తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 12
May - 2025, Price Rs.20/-.

మే 2025
వెల రూ. 20/-
పుటలు - 56



కృష్ణో రక్షతు నో జగత్త్రయగురుః, కృష్ణం నమస్యా మ్యహం,
కృష్ణేనామరశత్రవో వినిహతాః, కృష్ణాయ తస్మై నమః।
కృష్ణాదేవ సముత్థితం జగదిదం, కృష్ణస్య దాసోఽ(అ)స్మ్యహం,
కృష్ణ తిష్ఠతి సర్వ మేత దఖిలం, హేకృష్ణ రక్షస్వ మామ్॥

# కల్యాణం కమనీయం

వెంకటపాలెంలోని
శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో
15-03-2025న శ్రీవారి కల్యాణం
కన్నులపండువగా జరిగింది.
ఆరు గోపురాలతో ఏర్పాటు చేసిన
నమూనా ఆలయం వేదికపై
అంగరంగవైభవంగా దేవదేవుడి
కల్యాణం జరిగింది.
ఆం.ప్ర. రాష్ట్రప్రభుత్వం,
తి.తి.దే. ఆధ్వర్యంలో ఘనంగా
ఈ కల్యాణం నిర్వహించింది.



శ్రీవేంకటేశ్వరస్వామివారికి గౌ॥ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు, ఆయన సతీమణి శ్రీమతి భువనేశ్వరి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ పెద్దజీయర్, శ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివార్లు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్, ఆం.ప్ర. దేవదాయశాఖమంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి, తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., పలువురు తి.తి.దే. పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.












# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత!**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-28వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** భారత!= ఓ అర్జునా!; భూతాని= ప్రాణులు(ప్రాణుల శరీరములు); అవ్యక్తాదీని= ఆదియందు (పుట్టుకకు పూర్వం) కంటికి కనపడని స్వరూపం కలవియు; వ్యక్తమధ్యాని= మధ్యమందు(పుట్టిన తర్వాత) కనిపించే రూపం కలవియు; అవ్యక్తనిధనాన్యేవ= మరణించిన తర్వాత (చివరిదశలో) కనపడని స్వరూపం కలవియే (భవన్తి= అవుతున్నాయి); తత్ర= ఆ విషయంలో; (ఇక) పరిదేవనా= దుఃఖం; కా= ఎందుకు?

**భావం:** ఓ అర్జునా! ప్రాణికోట్లన్నీ పుట్టుకకు పూర్వం కనబడక, పుట్టిన తర్వాత (దేహంతో కూడి) కనబడుతూ, మరణించిన తర్వాత మళ్లీ కనపడక ఉంటున్నాయి. అలాంటి వాటి విషయాల్లో దుఃఖించడమెందుకు?

## కమలాగ్రవామాంక కనకనరకేసరి

నగుమోగముతోడి వోనరకేసరి
నగరూప గరుడాద్రినరకేసరి

అమితదానవహరణ ఆదినరకేసరి
నమితబ్రహ్మాదిసుర నరకేసరి
కమలాగ్రవామాంక కనకనరకేసరి
నమోనమో పరమేశ నరకేసరి

రవిచంద్రశిఖినేత్ర రౌద్రనరకేసరి
నవనారసింహ నమో నరకేసరి
భవనాశినీతీర భవ్యనరకేసరి
నవరసాలంకారనరకేసరి

శరణాగతత్రాణ సౌమ్యనరకేసరి
నరకమోచననామ నరకేసరి
హరి నమో శ్రీవేంకటాద్రినరకేసరి
నరసింహ జయ జయతు నరకేసరి

(అధ్యాత్మ సంపుటి-1, సంకీర్తన- 421)





నరసింహమూర్తిని నరకేసరి అని సంబోధిస్తూ నవనారసింహుడవు, లక్ష్మీదేవిని వామాంకంలో అధివసింప చేసుకున్నవాడవు అని అన్నమయ్య స్తుతిస్తున్నాడు.

నరసింహస్వామీ! నవ్వు ముఖంతో కొండరూపాన్ని ధరించి గరుడాద్రి మీదే అధిష్ఠించిన నరకేసరివి నువ్వు. ఎందరో రాక్షసులను సంహరించిన నరకేసరి, బ్రహ్మాదిదేవతల చేత నమస్కరింపబడుతున్న నరకేసరి.

లక్ష్మీదేవిని వామాంకంలో గల నరకేసరి. నీకు నమస్సులు పరమేశ నరకేసరి. ఒక కంటిలో సూర్యుని, మరొక కంటిలో చంద్రుడిని, ఒకకంటిలో అగ్నిని ధరించిన రౌద్రరూపం కలిగిన నరకేసరికి నమస్సులు. భవబంధాలను నాశనం చేసే భవ్యనరకేసరి నవరసాలంకారాలతో భాసించే నరకేసరి. శరణన్నవారిని కాపాడే శాంత స్వరూపుడవైన నరకేసరి. నరకబాధలు తప్పించే నరకేసరివి నువ్వు.

శ్రీవేంకటాద్రి మీద నెలకొన్న నరకేసరీ! నరసింహావతారుడవైన నరకేసరి జయం జయం అని అన్నమయ్య శ్రీ నరసింహస్వామిని స్తుతించాడు.

తిరుమల తిరుపతి దేవస్థానములు

## కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామివారి బ్రహ్మోత్సవం

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 04-05-2025 | ఆదివారం | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 05-05-2025 | సోమవారం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 06-05-2025 | మంగళవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 07-05-2025 | బుధవారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 08-05-2025 | గురువారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 09-05-2025 | శుక్రవారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 10-05-2025 | శనివారం | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 11-05-2025 | ఆదివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 12-05-2025 | సోమవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 13-05-2025 | మంగళవారం | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |
| 14-05-2025 | బుధవారం | పుష్పయాగం | |

తిరుమల తిరుపతి దేవస్థానములు

## హృషీకేశ్, నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్ల బ్రహ్మోత్సవం

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 10-05-2025 | శనివారం | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 11-05-2025 | ఆదివారం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 12-05-2025 | సోమవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 13-05-2025 | మంగళవారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 14-05-2025 | బుధవారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 15-05-2025 | గురువారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 16-05-2025 | శుక్రవారం | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 17-05-2025 | శనివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 18-05-2025 | ఆదివారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 19-05-2025 | సోమవారం | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం<br>ద్వాదశారాధానం, ఏకాంతసేవ |

తిరుమల తిరుపతి దేవస్థానములు

## జమ్మలమడుగు శ్రీభూసమేత శ్రీ నారాపురవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవం

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 10-05-2025 | శనివారం | --- | అంకురార్పణం |
| 11-05-2025 | ఆదివారం | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 12-05-2025 | సోమవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 13-05-2025 | మంగళవారం | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 14-05-2025 | బుధవారం | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 15-05-2025 | గురువారం | మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 16-05-2025 | శుక్రవారం | సర్వభూపాలవాహనం | కల్యాణం, గజవాహనం |
| 17-05-2025 | శనివారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 18-05-2025 | ఆదివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 19-05-2025 | సోమవారం | చక్రస్నానం | ధ్వజావరోహణం |
| 20-05-2025 | మంగళవారం | ----- | శ్రీపుష్పయాగ మహోత్సవం |

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 | మే, 2025 | సంచిక : 12



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥

గౌరవ సంపాదకులు
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,
పి.జి.డిప్లమో ఇన్ ఎపిగ్రఫీ, డిప్లమో ఇన్ యోగా,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
'కళారత్న' డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., తెలుగు & ఇంగ్లీషు, ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| ప్రహ్లాదవరదా! నారసింహా! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 07 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 12 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 14 |
| శ్రీరామానుజునకు, శ్రీరామానుజులకు సామ్యం | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 16 |
| సుమధుర మహాకావ్యం శ్రీశివానందలహరి | ఆచార్య నందుల గోపాలకృష్ణమూర్తి | 17 |
| కార్యసాధకుడు కపీశ్వరుడు | పద్మశ్రీ డా॥ గరికిపాటి నరసింహారావు | 19 |
| పరమ పవిత్రం | శ్రీ ఎస్.టి.జి.అంతర్వేది కృష్ణమాచార్య | 20 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 22 |
| చిగురంత ఆశ... జగమంత వెలుగు | శ్రీ పమిడికాల్వ మధుసూదన్ | 23 |
| తిరువహీంద్రపురమ్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| శ్రీఆంజనేయ పూజావిధానం | | 27 |
| ఊరిజనాల్ని కంటికి రెప్పలా కాపాడే తల్లులు | ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి | 31 |
| దానం అవగింజ ఫలితం అనంతకోటి | డా॥సుబ్బలక్ష్మి మర్ల | 34 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 37 |
| నారాయణుడు వరుడైన క్షేత్రం | శ్రీ కొచ్చర్ల మాల్యాద్రి | 38 |
| అన్నమయ్య- కూర్మావతారం | ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు | 39 |
| అన్నమయ్య చెప్పిన పురాణకథలెన్నో... | డా॥ఆకెళ్ళ విభీషణశర్మ | 40 |
| దేవుడితో ఆటలా? | శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 42 |
| కాంతిదీపం | కీ.శే. ఆచార్య కె.జె.కృష్ణమూర్తి | 43 |
| కదలి వచ్చెను చూడరే... | డా॥నొస్సం నరసింహాచార్య | 44 |
| అహంకారం మంచిది కాదు | డా॥ నల్లాని రాజేశ్వరి | 46 |
| వేమన శతకం | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 47 |
| చెప్పడుమాటలు చేటు తెస్తాయి(చిత్రకథ) | కథ: 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 48 |
| బాలవినోదం | | 50 |
| ఎండాకాలం.. ఏమరపాటొద్దు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 51 |
| క్విజ్ | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : ఉభయదేవేరులతో శ్రీవేణుగోపాలస్వామివారు (కార్వేటినగరం)
వెనుకచిత్రం: శ్రీలక్ష్మీనరసింహస్వామివారు (చిత్రకారుడు-శ్రీమణియం సెల్వన్)



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# మాధవమాసం

పుట్టిన ప్రతిప్రాణికి, ఆ మాటకువస్తే ఈ చరాచర విశ్వానికే అనివార్యమైనది అస్తమానం. మరి మన పుట్టుక, గిట్టుకలు ఉదయాస్తమానరూప సౌరచలనంతో ముడిపడి ఉన్నాయి. అందుకే సూర్యుణ్ణి కాలమని, కాలుడని అన్నారు. బండిచక్రంలా తిరిగే ఈ కాలచక్రంలో ఋతువులు, మాసాలు, ఋతుధర్మాలు ఉన్నా మార్గశిరమాసం తర్వాత మళ్లీ అంతటి ప్రాధాన్యత కల్గింది వైశాఖమాసం. దీనికి మాధవమాసం అని కూడ పేరుంది. అంటే శ్రీమహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన మాసం. మానవజాతికి మహత్తర సందేశాన్నిచ్చే మహోజ్జ్వల మాసం ఇది. అందుకే అర్చావతారంతో సహా ప్రపత్తిప్రతిపాదకులైన మహామహుల జన్మతిథులు ఈ మాసంలోనే వస్తాయి. ఇందులో మొదటిది సర్వప్రపత్తిస్వరూపుడైన ప్రహ్లాదుని రక్షించి, అహంకారి అయిన హిరణ్యకశిపుని సంహరించిన నరసింహస్వామి జయంతి. ఈ అవతారంవల్ల భగవానుని సర్వాంతర్యామిత్వాన్ని, సర్వగతత్వాన్ని అవగతం చేసుకుని ఆత్మసమర్పణం చేసుకున్న ప్రహ్లాదునకు రక్షణ, అహంకరించిన హిరణ్యకశిపునకు శిక్ష లభించాయి. శరణాగతతత్త్వానికి ఆచార్యస్థానం, మూర్తిమత్వం పొందిన మహనీయుడు ఆంజనేయస్వామి. ఇతను సర్వవిధ సామర్థ్యమున్నప్పటికీ త్రికరణశుద్ధిగా దాసభావాన్ని స్వీకరించి రామప్రభుకార్యాలను అతి సమర్థతతో నిర్వహించిన నిస్స్వార్థ జీవి. ఈయన జయంతి కూడ ఈ మాసమే.

అణువణువులోను అంతర్యామిని దర్శించి శివోఽహం అన్న అద్వైతభావనను ప్రకటించిన ఆదిశంకరులు జనానికుపదేశించింది సగుణప్రతీకకు శరణాగతి. అందుకే పారమార్థిక పరమావధి తీరం చేరుకున్నా జనావళి ఆత్మోజ్జీవనం కోసం భజగోవిందం, శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారాస్తవం, లక్ష్మీనృసింహకరావలంబస్తోత్రం జనానికందించి చరితార్థులయ్యారు. భిన్నపాత్రగతమైన ఏకైక చైతన్యస్వరూపాన్ని తమ రచనలలో ప్రకటించి నూతన సందేశాన్ని ఇచ్చారు. శంకరులు ప్రస్థానత్రయానికి భాష్యం సమకూర్చిన లోకోపకారి. ఆత్మానాత్మావివేకంతో మనిషి చేరాల్సిన గమ్యానికి అధ్యాత్మవిద్యను గరిపిన మహాత్ముడు. వ్యక్తికీ, సమిష్టికీ కర్తవ్యప్రబోధం చేసిన ధర్మోద్ధారకుడు.

ఇక భగవద్రామానుజులు సాక్షాత్ రామానుజులే. వారి విశిష్టాద్వైతసిద్ధాంతం అంతా అనన్యశరణాగతితత్త్వమే. ఇక నమ్మాళ్వారుల రచనలన్నీ భగవద్గుణగానలహరులే. పరమాత్ముని సర్వశేషిత్వప్రదర్శనలే. పదకవితాపితామహుడు అన్నమాచార్యులవారి పదకవితలన్నీ 'పతి–పత్నీ', 'జీవాత్మ–పరమాత్మ' సంలీనతాభావద్యోతకాలైన దివ్యశరణాగతిదీపకళికలే. వర్గ, వర్ణ వైషమ్యాల కతీతంగా సర్వజీవసమతాభావం, సర్వజగద్రక్షకుని పట్ల దీర్ఘశరణాగతి ఆయన గీతికాసారం. ప్రాచీన ధార్మికజ్ఞానసారాన్ని సంకీర్తనలలో నలుగురికి అందించిన ఘనత అన్నమయ్యదే. అద్వైతభావనా ప్రతిరూపమైన ఆదిశంకరులు అందరు దైవాలపైన శరణాగతిస్తవాలు చేస్తే, అన్నమయ్య అందరు దైవాలను శ్రీవేంకటేశ్వరునిలో పర్యవసింపచేసి భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించారు. ఇలా ఎందరో మహాపురుషులు తమ అవతరణతో ఆదరించిన మాసం ఈ మధు మాధవమాసం.

ఈ మాసంలో గృహప్రవేశాలు, దేవతాప్రతిష్ఠలు, ఉపనయనాది క్రతువులు చేయడానికి ముహూర్తాలుంటాయి. ఈ మాసంలో ప్రతిరోజూ ఒకపూటైనా శ్రీమన్నారాయణుణ్ణి స్మరించి ప్రతికార్యం పూర్తిచేయాలి. ఈ మాసంలో ఆచరించాల్సిన విధులన్నీ ఆరోగ్యరహస్యాలు కావడం విశేషం. ఈ మాసంలో తి.తి.దే. నిర్వహించే పర్వదినాలకు, వేడుకలకు కొరతేమీలేదు. తిరుచానూరు శ్రీ పద్మావతీ తాయార్ల వసంతోత్సవాలు, హృషీకేశ్, నారాయణవనం, జమ్మలమడుగు, కార్వేటినగరం క్షేత్రాలలో బ్రహ్మోత్సవాలు, తరిగొండ వెంగమాంబ జయంతి ఇత్యాదులను తి.తి.దే. ఎంతో ఘనంగా నిర్వహిస్తుంది. ఆస్తికులందరూ ఈ ఉత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులగుదురుగాక!

# ప్రహ్లాదవరదా! నారసింహా!

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ



దశావతారాలలో అత్యంతమధురమైన ప్రాధాన్యం పొందింది నృసింహావతారం. మత్స్య, కూర్మ, వరాహావతారాల తరవాత వచ్చింది నరసింహావతారం. బాహ్యసౌందర్యంతో పాటుగా ఆంతరంగా మన నిత్యజీవితంతో పాటు తెలుసుకుని అనుష్ఠించాల్సిన, మనసులో పదిలంగా జ్ఞాపకం పెట్టుకోవాల్సిన అనేక విషయాలను భాగవతంలో నరసింహ ఉపాఖ్యానంలో వ్యాసభగవానుడు అద్భుతంగా ఇస్తే దాన్ని వైభవోపేతంగా పోతన ఆంధ్రీకరించాడు. దితి కశ్యపులకు, హిరణ్యాక్ష హిరణ్యకశిపులు కవలలుగా జన్మించారు. యజ్ఞ వరాహావతారం హిరణ్యాక్షుణ్ణి సంహరించింది. హిరణ్యాక్షుడు మరణించాడని తెలుసుకున్నాడు హిరణ్యకశిపుడు. సంహరించిన విష్ణుభగవానుడి మీద చంపాడు అని కోపం పెట్టుకున్నాడు తప్ప, చంపడానికి కారణమేమిటో తెలుసుకోకపోవడమే రాక్షసత్వం. శ్రీమహావిష్ణువు తన సోదరుని మట్టుపెట్టాడు అంటే తన సోదరుడు ఎంత అధార్మికమైన ప్రవర్తన కలిగి ఉన్నాడన్న విషయాన్ని విస్మరించి, పగ పెంచుకుంటాడు. బ్రహ్మ గురించి తపస్సు చేయడం మొదలుపెట్టాడు. ఎన్ని సంవత్సరాలు తపస్సు చేశాడు అన్నది తపస్సు చేస్తున్న హిరణ్యకశిపునకు తెలీదు. తన శరీరమేమైపోయిందో తెలియదు. కృతయుగం కనక ఉన్నాడు. నూరు సంవత్సరాలు తపస్సు చేస్తే అంత కాలం గడచిపోయిందన్న విషయం ఆయనకు తెలియనే లేదు. అంత గొప్ప తపస్సు చేశాడని బ్రహ్మకు తెలుసు. అంత తపస్సు చేస్తే ఆయన కపాలంనుండి తపోధూమం బయలుదేరింది. సర్వలోకాలను కప్పుతున్నది. దేవతలు అందరూ వెళ్లి "ఈ ధూమాన్ని తట్టుకోలేకపోతున్నాం, ఆ హిరణ్యకశిపుని కోరికలు తీర్చుమని" ప్రార్థన చేస్తే ఆయన వచ్చారు. హిరణ్యకశిపుని మీద చీమలు పుట్టలు పెట్టాయి, చెట్లు పెరిగిపోయాయి. శరీరం లోపల ఉంది అనడానికి లోపల అస్థిపంజరముంది. పలుకరించే అవకాశం ఏది? బ్రహ్మ తన కమండలంలో నీళ్లు చల్లగానే ద్విగుణీకృతమైన ఉత్సాహంతో శరీరం పొంది పుట్టలో

***ఈ నెల 11న నృసింహజయంతి సందర్భంగా....***

నుండి పైకి వచ్చాడు. సాధారణంగా తపస్సు చేసినవాళ్లు పరమేశ్వరుడు ప్రత్యక్షమవగానే స్తోత్రం చేస్తారు. హిరణ్యకశిపుని వృత్తాంతంలో తెల్లబోయి ముక్కున వేలు వేసుకుని బ్రహ్మదేవుడే ఒక కితాబు ఇచ్చాడు. "ఇలాంటి తపస్సు గతంలో నేను చూడలేదు. ఇంకొకరు చేస్తారని కూడా నమ్మకం లేదు. అద్భుతం ఏమి తపస్సు? నీకు ఏమి కావాలి" అన్నాడు.

ఎన్ని అడిగాడు అంటే పంచభూతాలలో గాలిలో, భూమిమీద, అగ్నిలో, నీటిలో చచ్చిపోకూడదు. వాయువు వల్ల చచ్చిపోకూడదు. జంతువుల వలన, పాముల వలన, నరుల వలన, మృగాల వలన చచ్చిపోకూడదు. ఇంట్లో, బయట, పగలు, రాత్రి, ఏ దిక్కులయందూ చచ్చిపోకూడదు. ఇంక చచ్చి

పోవడానికి ఏమి ఉంటుంది? అని దానవుని ఆలోచన. సర్వజ్ఞుడైన పరమేశ్వరుడికి వీటికి మినహాయింపు తీసుకుని రావడం తెలుసు. హిరణ్యకశిపుడు లోకాలన్నిటినీ తన వశం చేసుకున్నాడు. విశేషమైన భోగాలను అనుభవిస్తున్నాడు. నచ్చితే ఉంచడం, నచ్చకపోతే సంహారం చెయ్యడం. హిరణ్యకశిపుని రాజ్యం ఉద్ధతితో హింసాత్మకంగా నడుస్తోంది.

ధర్మం దెబ్బతింది, దేవతలకు అన్నం లేదు. ఈశ్వరుడు పెట్టిన ప్రమాణం తప్పిపోతోంది. మళ్లీ దాన్ని నిలబెట్టాల్సింది పరమేశ్వరుడే. అందుకని వాళ్లు శ్రీమహావిష్ణువు గురించి స్తోత్రం చేశారు. ఆయన అత్యంత గంభీరమైన మాట చెప్పాడు. "మీరు బాధపడుతున్నారని హిరణ్యకశిపుణ్ణి నేను సంహరించను. అవతారస్వీకారం చేసి ఎప్పుడైనా, ఎవరినైనా చంపాల్సి వస్తే కొన్ని కారణాలు చెప్పి, అవి ఉంటే చంపుతాను" అన్నాడు.

"త్రికరణశుద్ధిగా భగవంతుని జోలికి వెడితే చంపేస్తాను. అందులో సందేహం లేదు. దేవతల జోలికి వెళ్లినా, వేదప్రమాణాన్ని తిరస్కరించి మాట్లాడినా, గోవులను చంపడం ఎక్కువైతే, బతుకుతున్న బ్రాహ్మణుల జోలికి, ధర్మం జోలికి వెడితే నేను అంగీకరించను. చివరికి నన్ను నిందించి, దూషించడం మొదలుపెడితే అవతారస్వీకారం చేసి చంపుతాను" అన్నాడు. మీరు ఒక్కరే బాధ పడినంత మాత్రంచేత రాను. ఇంకా వేచి ఉండవలసిందే, తప్పదు. ఇవన్నీ పూర్తి అయ్యాయి అంటే వస్తాను. ఇంకా ఎవరు రావాలి? అంటే ఆయన ఒక మహానుభావుడు, పరమభక్తితత్పరుడైనవాడు, హిరణ్యకశిపుడి కడుపునే ప్రహ్లాదుడు అన్నపేరుతో పుడతాడు. ఆ ప్రహ్లాదుని గుణాలు ఇన్నీ అన్నీ కావు. అంత మంచి కొడుకు పుడతాడు.

పరమభాగవతోత్తముడైన వాడు తన కడుపున పుట్టాడని సంతోషించక ప్రహ్లాదుని బాధపెట్టడం ఎప్పుడు మొదలు పెడతాడో, తండ్రిని అని కూడా మరచి ప్రహ్లాదుని చంపడానికి ప్రయత్నిస్తాడో, అప్పుడు వచ్చి ఆ దానవుణ్ణి చంపేస్తాను. అప్పటి వరకు వేచి ఉండండి" అన్నాడు.

హిరణ్యకశిపుడికి ఒక కుమారుడు కలిగాడు. ప్రహ్లాదుడు అని పేరు పెట్టారు. ఇతరులు సంతోషిస్తే సంతోషించేవాడు ప్రహ్లాదుడు. తనకి ఉన్నది ఒకరికి పెట్టి వారు సంతోషిస్తే ప్రహ్లాదుడు సంతోషిస్తాడు. ఒకడు ఏడిస్తే చూచి సంతోషిస్తాడు హిరణ్యకశిపుడు. గుణాలకు నిధియైన ప్రహ్లాదుని గుణాలు ఎంతగొప్పవి అని చెప్పడానికి ఎవరికీ సాధ్యం కాదు. భగవంతుడిని ప్రహ్లాదుడు ఎప్పుడు తలచుకుంటాడు అంటే తలచుకోవడానికి ఒక సమయం, పూజామందిరం అక్కరలేదు. ప్రపంచాన్ని మరచిపోయాడు. ఎప్పుడూ ఈశ్వరుడే గుర్తు వస్తుంటాడు. మంచినీళ్లు తాగుతుంటే భగవంతుడు గుర్తు వస్తాడు.

అలా పెరిగి పెద్దవాడు అవుతున్న ప్రహ్లాదుని చూసి హిరణ్యకశిపుడు నొచ్చుకున్నాడు. ఇలాంటి కొడుకు పుట్టాడేమిటా అని నొచ్చుకున్నాడు. పిల్లవాడు ఎలా బాగుపడతాడని బెంగ పెట్టుకున్నాడు. చండుడు, అమర్కుడు అని రాక్షసవంశానికి గురువైన శుక్రాచార్యులవారి కుమారులను పిలిచి పిల్లవాడికి విద్యాభ్యాసం చేయించమని అన్నాడు. తీసుకెళ్లి వారు చెప్పగలిగిన శాస్త్రాలు అన్నీ చెపుతున్నారు.

ప్రహ్లాదుడు– "ఈ విద్యలు అన్నీ పనికిమాలినవి, మా నాన్న మార్చేశాడు, ఇవి చదువుకోకూడదు" అని తాను తెలుసుకున్నప్పటికీ కూడా తన గురువులు పాఠం ఎలా చెపితే అలా తాను నేర్చుకుని గురువులను గౌరవించాడు తప్ప గురువుల ముందు నిలబడి ధిక్కరించి ఇలా పాఠం చెప్పకూడదని ఎన్నడూ గద్దించి మాట్లాడలేదు. ఆతని గురుభక్తి అలాంటిది. కొంత కాలం గడచిన తరువాత హిరణ్యకశిపుడికి కోరిక పుట్టింది. తన కుమారుడు ఏమి నేర్చుకున్నాడో వినాలని, "ఒకసారి తీసుకుని రండి" అన్నాడు. కొడుకుని తీసుకుని వచ్చి తండ్రి దగ్గర నిల్చోపెట్టారు. కొడుకుని చూసేటప్పటికి ముందు పుత్ర వ్యామోహమే. కొడుకుని చూచి– "దా" అని దగ్గరకు తీసుకుని తొడమీద కూర్చోపెట్టుకుని బుగ్గలు పుణికి ఒక పద్యం చెప్పు అన్నాడు. వెంటనే ప్రహ్లాదుడు–

**ఉ. ఎల్ల శరీరధారులకు నిల్లను చీకటి నూతిలోపలం**
**ద్రెళ్లక వీరు నే మను మతిభ్రమణంబున భిన్నులై ప్రవ**
**ర్తిల్లక సర్వము న్నతని దివ్యకళామయమంచు విష్ణునం**
**దుల్లము జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ!**
**(భాగ.7-142)**

నాన్నా అనలేదు. ఓ నిశాచరాగ్రణీ! అన్నాడు. అంటే "చీకట్లో తిరిగేవారికి నాయకుడా!" అని పిలిచాడు. అజ్ఞానం పోవాలి. అంటే శ్రీహరిని స్మరించాలి అన్నాడు. హిరణ్యకశిపుడు ఆశ్చర్యపోయాడు. "ఏమిటి ఈ మాటలు? ఎవరు చెప్పారీ మాటలు? ఇలాంటి మాటలు మన వంశంలో పుట్టినవాడు

మాట్లాడవచ్చా? ఇలాంటి మాటలు పక్కకి తీసుకుని వెళ్లి నేర్పుతున్నారా? నీ బుద్ధిలోనే తోచిందా ఇలాంటి ఆలోచన?" ఆయన అనుమానం అక్కడితో పోలేదు. గురువుగారు రహస్యంగా నేర్పుతున్నారా? గురువు మీద అనుమానం. వైకుంఠవాసుడైన నారాయణుడు దానవ వంశానికి అపచారం చేశాడు. ఆయనను పొగడటానికి వీలు లేదు. ఆ మాట ఎత్తకు అంటే తండ్రి వంక చూచి కొడుకు, "నాన్నా! ఆయన పేరు ఎత్తవద్దు అంటావు. నిరంతరం శ్రీమహావిష్ణు పాదపద్మాలలో నుండి స్రవించే మందార మకరందపానం చేత మత్తెక్కిపోయిన హృదయం కలిగి ఎప్పుడూ హృదయంలో భగవంతుణ్ణి స్మరించుకోవటానికి అలవాటుపడ్డ నేను, ఇవ్వాళ భగవంతుని స్మరణను విడిచిపెట్టి ఇతరవిషయాలు నేర్చుకుని, వాటిని మనసులో స్మరించమంటే, మాట్లాడమని అంటే నాకు సాధ్యం కాదు." అని ప్రహ్లాదుడు అనగానే కొడుకుని ఒక్క తోపు తోసి– "ధూర్తుడా! గురువు చెప్పని ఈ విద్య ఎవరు నేర్పారు నీకు? ఎక్కడనుండి వచ్చింది? ఎవరు చెప్పారో నాకు పేరు చెప్పమని" అన్నాడు. "తండ్రీ, ఒకరు చెప్పేదేముంది? భక్తి పరమేశ్వరుని కృపావిశేషం చేత లోపల పెల్లుబకాలి తప్ప ముహూర్తాలు పెట్టుకుని ఒకరు చెపితే వచ్చేది కాదు తండ్రీ!" అన్నాడు. ఎవరు వీడికి ఈ మాటలు చెప్పింది, తీసుకుని వెళ్లి చంపెయ్య మన్నాడు. వెంటనే గురువులు పరిగెత్తుకుని వచ్చి "అయ్యా, ఇంకొక్క అవకాశం ఇవ్వండి, నేర్పిస్తా"మని పిల్లవాడిని తీసుకుని వెళ్లారు. కొంతకాలం చదివించారు. మళ్లీ కొడుకుని తీసుకుని వచ్చారు. "ఏమి నేర్చుకున్నావు?" అన్నాడు "గురువుగారు చెప్పింది బాగా వచ్చింది". "ఒక పద్యం చెప్పి దాని విశేష మేమిటో, దాని అర్థతాత్పర్యాలు వివరించమ"ని అన్నాడు. ప్రహ్లాదుడు మళ్లీ హరినామసంకీర్తనమే చేశాడు.

తండ్రికి ఎక్కడలేని కోపం వచ్చి భటులని పిలిచి తీసుకుని వెళ్లి సంహరించమని అన్నాడు. తీసుకుని వెళ్లి వారు ఎన్నో ప్రయత్నాలు చేశారు. బాణాలు వేసి, గదలు పెట్టి కొట్టి, సముద్రంలో పడవేశారు, పర్వతశిఖరాల మీద నుండి పడ వేశారు. తాచుపాములను తెచ్చి కరిపించారు. ఏనుగులతో తొక్కించారు. ఎండలో, వానలో, చలిలో నించోపెట్టి కత్తులతో పొడిచారు. అయినా ప్రహ్లాదుడు విశ్వంలో నారాయణుడు తప్ప వేరొకటి లేదు. పొడుస్తున్న కత్తి నారాయణుడు. గద నారా యణుడు. కిందకి దొర్లిస్తే నారాయణుడు. బాణం వేస్తున్న వాడు నారాయణుడు. అంతా నారాయణుడుగా చూచినవాడిని ఎవరు బాధిస్తారు? అందుకే బాధించలేకపోయారు. కత్తి పట్టుకు వచ్చి పొడిచేస్తున్నా కనీసం చేతులు అడ్డుపెట్టుకోడు. కత్తిలో కూడా సంతోషంతో శ్రీమన్నారాయణుని చూస్తూ "ఓ గోవిందా! ఓ సర్వాపన్నశరణ్యా! ఓ జగదీశా!" అని అరుస్తున్నాడు.

ఎన్ని చేస్తున్నా పిల్లవాడు చచ్చిపోడు. ఎంత చిత్రం అంటే– తండ్రి బాధలు పెడుతుంటే అటూ ఇటూ పారిపోడు. కొరడాలతో కొడతామని నించోపెడితే ఎంతో సంతోషంగా గోవిందా, ముకుందా, కేశవా, హరీ అంటూ నించుంటున్నాడు. కొట్టేవాడు, కొరడా అన్నీ విష్ణువే. కొడుతుంటే ముఖం వాడదు. తండ్రి ఇన్ని బాధలు పెడుతున్నాడని విమర్శించడు. ఇప్పుడు ఏడుస్తున్నవాడు హిరణ్యకశిపుడు. చచ్చిపోకూడదని వరాలు కోరుకున్నవాడు తండ్రి. చచ్చిపోకుండా ఉండిపోతున్నవాడు కొడుకు. అన్ని వరాలు కోరుకున్నవాడు చచ్చిపోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. ఏ వరాలూ కోరుకోనివాడు పరమ భక్తితో చిరంజీవిగా మిగిలిపోతున్నాడు. యుగాలు మారినా ఆయన కథ చెప్పుకోవలసిందే. ప్రహ్లాదుడు అంత భాగవతోత్త ముడుగా మిగిలిపోయాడు. హిరణ్యకశిపుడు ఒంటరిగా గదిలోకి వెళ్లి తల పట్టుకుని కూర్చున్నాడు.

శ్రీమన్నారాయణా అంటూ చిరునవ్వుతో ఉన్నాడు. పడుకోపెట్టి గదలతో మొత్తించినా, గురువులు ఆదుకోవాలి కనుక "ఏడవకు, రాకుమారుడికి కొంత రాజనీతిశాస్త్రం నేర్పి, విష్ణువు మీద వైరం నేర్పుతా"మని మళ్లీ తీసుకుని వెళ్లారు. ప్రహ్లాదుడు గురుకులంలో గురువులులేని సమయంలో అక్కడి పిల్లల చేత కూడా హరినామసంకీర్తనం చేయించడం మొదలు పెట్టాడు. గురువులు ఇది చూసి ఇతడు మనం చెప్పినవి నేర్చు కోకపోగా, ఉన్న పిల్లలు అందరినీ పాడుచేస్తున్నాడని పిల్లవాడిని తీసుకుని హిరణ్యకశిపుని వద్దకు వెళ్లారు. "మహాప్రభో! ఈ పిల్లవాడికి మేము పాఠం నేర్పలేం. ఏమి చేసుకుంటావో నువ్వే చేసుకో" అని పిల్లవాడిని ఇచ్చేశారు. హిరణ్యకశిపునకు కోపం వచ్చి "ఎవరి బలం చూసుకుని ఇలా విర్రవీగుతున్నావు?" అని అడిగాడు.

"ఎవరి బలమని అడుగుతావేమిటి? బలం ఉన్న వాడికి, బలం లేనివాడికి, బ్రహ్మాదులకు, నీకు, నాకు, అందరికీ శరీరంలో ఉన్న బలంగా చెప్పబడుతున్నవాడు. ఎవరో, అతడే నాకు బలం తండ్రీ!" అన్నాడు.

హిరణ్యకశిపుడు "నీకు అతడి అండ ఉందని అంటు న్నావు కదా. మూడులోకాలు వెతికాను. నాకు విష్ణువు కనపడ లేదు. ఎక్కడ ఉన్నాడో చూపించగలవా?" అన్నాడు. ప్రహ్లాదుడు

"తండ్రీ! శ్రీమన్నారాయణుడు లేని ప్రదేశం ఉందా? ఎక్కడెక్కడ వెతికి చూస్తే అక్కడ ఉంటాడు" అన్నాడు. "ఓహో! అలాగా ఈ స్తంభంలో ఉంటాడా?" అన్నాడు. ఇప్పుడు వస్తున్నది నరసింహావతారం. పిల్లవాడు అంతటా ఉన్నాడు ఉన్నాడు అంటున్నాడు. హిరణ్యకశిపుడు మూడు వేళ్లు ముడిచి చూపుడు వేలు పైకి తీసి చూపిస్తూ ఎక్కడో ఆపుతాడు. ఆ వేలు ఎక్కడ ఆగితే అక్కడనుండి పైకి రావాలి. రాకపోతే తనని నమ్ముకున్న భక్తుని మాట వమ్ము అయిపోతుంది. రావడమంటూ జరిగితే శంఖ, చక్ర, గదాపద్మాలు పట్టుకున్న శ్రీమన్నారాయ ణుడుగా వచ్చి హిరణ్యకశిపుని సంహారం చెయ్యడానికి బ్రహ్మ గారు ఇచ్చిన వరం ప్రతిబంధకం. ఆయన ఎన్ని వరాలిచ్చాడో అన్ని వరాలకు మినహాయింపుగా రావాలి. అన్ని వరాలకు మినహాయింపుగా ఎక్కడనుండి రావాలో తన చేతిలో లేదు. హిరణ్యకశిపుడి వేలు ఎక్కడ ఆపితే అక్కడనుండి రావాలి.

బ్రహ్మాండమంతా నారసింహమయిపోయి విష్ణుతత్త్వం అన్నిటిలోకీ చేరిపోయింది నరసింహావతారంగా. అన్నిటా నిండిన నారసింహతత్త్వం ఎలా ఉంటుందో ఊహించాలి. హిరణ్యకశిపుడు వేలు తిప్పుతూ స్తంభాన్ని చూపించి, "ఇందులో ఉన్నాడా?" అన్నాడు. అంటే, "మళ్లీ అదేమాట అడగవద్దు. అంతటా ఉన్నాడు" అంటే, "ఉంటే వస్తాడా" అని అడిగితే "వస్తాడు నాన్నా!"– అన్నాడు. అయితే పిలవమని అన్నాడు. కొడుకు మాట కాదని నిరూపించాలి. కొడుకు మాట నిల బెట్టాలి అని పరమేశ్వరుడు. ఇది ఆయన దయ. పిల్లవాడు ధైర్యంగా ఉన్నాడు. అతని మాట నిలబెట్టడానికి బ్రహ్మాండమంతా నారసింహమై పోయింది. ఆ స్తంభాన్ని ఒక్క దెబ్బ కొట్టి, "రమ్మను ఇందులోనుండి" అన్నాడు. అలా అనడంతోనే ఫెళఫెళా శబ్దాలు చేస్తూ ఆ స్తంభం బద్దలై, అందులో నుండి విస్ఫులింగాలు పైకి వచ్చి, పెద్ద కాంతిమండలం కనపడి, కన్నులతో చూడలేనంత భయంకరమైన తేజస్సు ఒకటి బయటికి వచ్చింది. అందులో నుండి పట్టుపుట్టం కట్టుకుని స్వామి నిల బడ్డారు. భయంకరమైన గర్జన చేస్తూ ఆయన పాదాలు తీసి వేస్తుంటే ఆయన వేగాన్నీ, వొత్తిడినీ తట్టుకోలేక వేయిపడగలు గల ఆదిశేషుడు, సార్వభౌమం మొదలైన దిగ్గజాలు కూడా భూమిబరువుని ఓర్చలేక తలలు వంచాయి. ఆయన పాదాలలో శంఖ, చక్ర, పద్మ రేఖలు, నాగలి, అమృతభాండం మొదలైన దివ్యమైన చిహ్నాలు కనపడుతున్నాయి. బలిష్ఠమైన మోకాళ్లు, ఐరావత తొండం వంటి బలిష్ఠమైన తొడలు, సన్నటి నడుము, దానికి పెట్టుకున్న మువ్వల వడ్డాణం, చప్పుడు చేస్తున్న గంటలు, మెడలో వేసుకున్న హారాలు, నృసింహాకారం పైన సింహముఖం, పెద్దదంష్ట్రలు, భయంకరమైన వాటిని తెగకోయ గలిగిన నాగళ్లు ఎలా ఉంటాయో అలాంటి దంతపంక్తి, అదిరి పడిపోతున్న పెదవులు, మందరపర్వతగుహలను పోలిన నాసికా రంధ్రాలు, పుట్టలోనుండి పైకి వచ్చి కోపంతో ఊగుతున్న నాగుపాము ఎలా ఉంటుందో అలా ఆడుతున్న నాలుక, కోటి సూర్యుల ప్రకాశంతో గురి చూసి చూస్తున్న వెలిగిపోతున్న కన్నులు, నిక్కపొడుచుకున్న వెంట్రుకలు. పెట్టుకున్న పెద్ద కిరీటం, అనంతమైన బాహువులలో ఆయుధాలు పట్టుకుని



మహానుభావుడు అడుగుతీసి అడుగు వేస్తూ వస్తూ, పెద్ద గర్జన చేస్తూ తల ఇటు అటూ ఊపితే కేసరాలు కదలి విమానంలో వెడుతున్న దేవతలు భ్రంశమై విమానాల నుండి కిందపడి పోయి, ఆ మేఘాలన్నీ కొట్టబడి, పర్వతాలన్నీ ఘూర్ణిల్లి, సముద్రా లన్నీ పొంగిపోయి, భూమండలమంతా కలత చెంది స్వామి నరసింహావతారం వచ్చింది.

ఇప్పటివరకు ఉగ్రతత్త్వాన్ని పొందని విష్ణుమూర్తి అపారమైన కోపంతో తన పరమభక్తుడైన ప్రహ్లాదుని హిరణ్య కశిపుడు నిగ్రహించాడన్న కోపాన్ని ఆపుకోలేక, ఉగ్రనృసింహా వతారమై వచ్చాడని లోకమంతా భీతిల్లిపోతే, 33 కోట్లమంది దేవతలు ఆకాశంలో నిలబడి స్తోత్రం చేస్తుంటే, హిరణ్యకశిపుడు గదాదండంతో స్వామి చుట్టూ తిరిగి కొట్టడానికి ప్రయత్నిస్తుంటే, దేవతలు విడిచిపెట్టకుండా సంహరించమని అంటే, పెద్ద గర్జన చేస్తూ వెళ్లి హిరణ్యకశిపుని డొక్కల దగ్గర పట్టుకుని పైకి ఎత్తి, కలుగులోకి పారిపోతున్న ఎలుకని నాగుపాము పట్టుకున్నట్లుగా పట్టుకుని, పడగ పైకి ఎత్తితే ఎలా ఉంటుందో అలా పైకి ఎత్తి గడప దగ్గరకు తీసుకుని వచ్చి- ఇంట్లో కాదు బయట కాదు గడప మీద, పగలు, రాత్రి కాదు, ప్రదోషవేళ, ఏ ఇతరమైన ప్రదేశం కాక- పంచె పైకి తీసి తొడల మీద పెట్టుకుని, పంచ కట్టి ఉంటే దిక్కులు ఉంటాయి. పైకి తీస్తే దిక్కులు ఉండవు. అదొక శాస్త్రం. ప్రాణం ఉన్నది ప్రాణం లేనిదీ కాదు గోళ్లు, జంతువుకాదు, పాముకాదు, ఆయుధం కాదు, అస్త్రం, శస్త్రం కాదు, రాక్షసులు దేవతలు కాదు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, నరుడు కాదు నరసింహమై గంగా నది సుడి తిరుగుతున్నట్లుగా ఉన్న నాభి కనపడుతుండగా విశాలమైన వక్షఃస్థలంతో పెద్ద దంతాలతో దగ్గరగా చూస్తుంటే, ఆయన ముఖం వంక చూసి మృత్యువు ఆసన్నమైందని తెలివి తప్పి తల వాల్చేసిన హిరణ్యకశిపుణ్ణి తొడల మీద వేసుకుని, పెద్దగా పెరిగిన గోళ్లు కడుపులోకి దింపి చీల్చి గోళ్లని గొడ్డళ్లుగా చేసి వక్షఃస్థలంలో ఉన్న ఉరఃపంజరంలోని ఎముకలు అన్నిటినీ కోసేసి, పటపట విరిచి పేగులు తీసి మెడలో వేసుకుని ధారలుగా కారుతున్న నెత్తురు దోసిళ్లతో పట్టి త్రాగి ఒళ్లు, కేసరాలన్నీ నెత్తుటితో తడిసిపోతే, అక్కడ ఉన్న రాక్షసగణా లన్నిటినీ చంపి పెద్ద శబ్దం చేస్తూ దొల్లబడిన హిరణ్యకశిపుని శరీరాన్ని విసరివేసి భయంకరాకృతితో నడుస్తుంటే, బ్రహ్మాది దేవతలు స్తోత్రం చేశారు. ఏమి నారసింహ అద్భుతావతారం?

ఇంతమందీ స్తోత్రం చేస్తే ఆయన ప్రసన్నుడు కాలేదు. ఉగ్ర భావనతో ఊగిపోతున్నాడు. లక్ష్మీదేవిని చూచి, "అమ్మా, నీవు నిత్యానపాయినివి. ఆయన వక్షఃస్థలంలో ఉంటావు. నిన్ను చూస్తే ప్రసన్నుడౌతాడు తల్లీ, దగ్గరకు వెళ్లు"మని అన్నారు దేవతలు.

ఆమె "నా భర్త ముఖం పూర్ణచంద్రబింబంలా ఉంటుంది. ఇంత కోపంగా నేను ఎప్పుడూ చూడలేదు. నేను కూడా దగ్గరకు వెళ్లను" అంది. శ్రీమహావిష్ణువు అవతారాలలో లక్ష్మీదేవి దగ్గరకు వెళ్లని అవతారం నరసింహావతారమే. అందరూ భయ పడుతుంటే "ప్రహ్లాదా! నీ గురించి వచ్చిందే ఈ అవతారం. నీ స్వామి దగ్గరకు వెళ్లి ప్రసన్నుని చెయ్యి"మని అన్నారు. చిన్న పిల్లవాడైన అయిన ప్రహ్లాదుడు స్వామి వద్దకు వెళ్లి పాదాలను పట్టి నమస్కరించి స్తోత్రం చేశాడు.

పరవశించిన నరసింహస్వామి పరమప్రసన్నుడై ప్రహ్లాదుని ఎత్తుకుని తన తొడ మీద కూర్చోబెట్టుకుని "నీ భక్తికి పొంగిపోతున్నాను, ఏమి వరం కావాలో కోరుకో"మని అన్నాడు. అంటే "మళ్లీ నన్ను మాయలో ముంచుదామని అనుకుంటు న్నావా? నాకెందుకు వరాలు? నాకు ఎందుకు కోరికలు? ఏ కోరికా లేదు. నీపాదాలయందు నిరతిశయభక్తి కలిగి ఉంటే చాలు. నా తండ్రి అమాయకత్వంతో నీకు వ్యతిరేకంగా బతి కాడు. ఆయనకు ఉత్తమగతులు కలిగేటట్లుగా అనుగ్రహించు" మని వేడుకుంటే, "ఏనాడు పట్టుకుని పైకి ఎత్తి తొడల మీద పెట్టుకున్నానో, నీ తండ్రి నావంక చూసి స్తబ్ధుడైనాడో నా గోళ్లతో చీల్చి నెత్తురు తాగానో, ఆనాడు నీ తండ్రే కాదు అంతకుముందు 21తరాలు తరించాయి. ప్రహ్లాదా! నీవు బెంగ పెట్టుకోవద్దు. నీకు ఆశీర్వచనం చేస్తున్నాను. దీర్ఘాయుష్మంతుడవై రాజ్యాన్ని ధార్మికంగా పరిపాలించి పరమభాగవతోత్తముడవై అంత్యంలో నన్ను చేరుకుంటావు. నీ కథ ఎక్కడ చెప్పబడు తుందో, ఎక్కడ వినపడుతుందో, అక్కడ నేను ప్రసన్నుడనౌ తాను. ఎంతో సంతోషిస్తాను. సభామంటపంలోని వారందరికీ నా ఆశీర్వచనం పరిపూర్ణంగా లభిస్తుంది. దానివల్ల రోగాలు సమసిపోయి అందరూ ఉత్తమగతులు పొందుతారు" అని ప్రహ్లాదోపాఖ్యానానికి శ్రీమహావిష్ణువే ఫలశ్రుతి చెప్పారు.



# సందేహాలు సమాధానాలు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర) శ్రీసత్యనారాయణస్వామివ్రతం గురించి వివరణ ఇవ్వండి?**

**జ)** శ్రీసత్యనారాయణస్వామివ్రతం అత్యంత ప్రాచీనం, స్కాంద పురాణ రేవాఖండంలో ఉంది. ప్రతిఇంటా ఇది సంప్రదాయం. ఏ శుభకార్యం జరిగినా సత్యనారాయణవ్రతం ఆచరించడం మన ఆనవాయితీ. ఇది దేశమంతటా ఉంది. దక్షిణాదిలోనే కాదు, ఉత్తరాదిలో కూడా ఇది ప్రసిద్ధి. ఇంత ప్రసిద్ధమైన స్వామి అన్నవర క్షేత్రంలో తరువాత వెలిశారు. క్షేత్రానికి పూర్వమే స్వామి అర్చన ఉంది. సత్యమే నారాయణ స్వరూపం. 'సత్యం' అంటే త్రికాలాల లోనూ నశించని పరబ్రహ్మ. ఆ బ్రహ్మమే నారాయణుడు.

అతి సామాన్యజనులు కూడా స్వామిని ఆరాధించాలని పురాణాలు ఈ వ్రతాన్ని అందించాయి. 'లక్ష్మీనారాయణవ్రతం' అని 'క్రొత్త'గా ప్రవేశపెట్టాల్సిన పనిలేదు. పురాణమహర్షులు తపోదృష్టితో ఈ వ్రతాన్ని (సత్యనారాయణవ్రతాన్ని) కలియుగ మానవులకోసం ఆవిష్కరించారు. అనాదిగా మన ప్రాంతాలలో సత్యనారాయణ పేరు కలిగినవారు, ఎందరో సత్యబాబు, సత్య రాజు, సత్యం, సత్తిబాబు, సత్తిపండు... అనే పేర్లతో ఉన్నారు. ఇలా పల్లెపల్లెల్లో ప్రతిష్ఠితమైన సంప్రదాయమిది. ఉత్తరాదిలో 'సత్యనారాయణు'నికి హారతులు హిందీభాషలో గానం చేస్తుం టారు. అక్కడ ఈ వ్రతం చాలా ప్రముఖంగా ఆచరిస్తున్నారు.

సత్యనారాయణవ్రతం సర్వదేవతాసమన్వయాన్ని సూచిం చేది. సత్యనారాయణవ్రతం వైదికపరంపరను అనుసరిస్తోంది. సకల జగత్కారణమైన సచ్చిదానందపరబ్రహ్మగా అభీష్టదేవతను ఆరాధిస్తూ, ఇతర దేవతలు కూడా ఆ ఇష్టదేవతకు భిన్నులు (వేరు)కారని భావించి అర్చించడం సనాతన వైదిక పరంపర. అలా ఆ పరబ్రహ్మను లక్ష్మీనారాయణస్వరూపంగా భావిస్తూ, ఆయన కేంద్రంగా ఈ విశ్వచక్రం నిర్వహించబడుతోందని ఆరా ధించే వ్రతవిశేషం ఈ సత్యనారాయణవ్రతం. సర్వదేవతలూ ఆయన శక్తివిశేషాలే.

సూర్యుని కిరణాలకూ, సూర్యునికీ భేదం లేనట్లే, పర బ్రహ్మ, సృష్టి, స్థితి, విశ్వ వ్యవహారాలకై దాల్చిన పలు రూపాలు (దేవతలు) ఆయనకు భిన్నాలు కావు. అన్నీ ఆయన శక్తి విశేషాలే కనుక వాటికి నమస్కరించాలి. ఆ పరబ్రహ్మయే త్రిమూర్తులుగా, అష్టదిక్పాలకులుగా, నవగ్రహాలుగా, వాటి అధిదేవతాప్రత్యధిదేవతాస్వరూపాలుగా వ్యక్తమై ఈ విశ్వ నిర్వహణ చేస్తున్నాడు. ఈ విశ్వచక్రవిజ్ఞానమంతా ఈ సత్య నారాయణవ్రతంలో నిక్షిప్తం చేశారు. తద్వారా మన సనాతన ధర్మస్వరూపం, వైదికవిశ్వవిజ్ఞానం సామాన్యునికి కూడా అవగతం కావాలని పెద్దల ఉద్దేశ్యం. మనం ఒక్కసారి ఈ వ్రతాన్ని గమనిస్తే, పురాణకర్త అయిన వేదవ్యాసుడు అతి సామాన్యునికి కూడా మన దేవతావిజ్ఞానాన్ని, ప్రపంచ స్వరూపాన్ని అవగాహనలోకి అందించడంలో ఎంతటి చక్కని విధానాన్ని కల్పించాడో అర్థమౌతుంది.

సత్యనారాయణవ్రతంలో 'మండపారాధన' చాలా విశిష్టం. మధ్యలో 'కలశ' స్థాపన. ఇది మన అచ్చమైన సంప్ర దాయం. పాత్ర, జలం, పల్లవాలు, పూర్ణకలశం దేవతా విష్కరణకు, పంచభూతమయప్రకృతికి కేంద్రంగా ఉన్న పర

## 2025, జూన్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 02-10 | శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం, తిరుపతి |
| 06-10 | శ్రీపద్మావతీతాయార్ల తెప్పోత్సవం, తిరుచానూరు |
| 07-15 | శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, అప్పలాయగుంట |
| 09 | నమ్మాళ్వార్ శాత్తుమొఱ |
| 09-11 | తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం |
| 11 | ఏరువాకపూర్ణిమ |
| 17-19 | శ్రీసుందరరాజస్వామివార్ల అవతారోత్సవం, తిరుచానూరు |
| 27 | జగన్నాథరథయాత్ర |
| జూన్ 30 నుండి జూలై 02 వరకు | శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కార వైభవోత్సవం, శ్రీనివాసమంగాపురం |

మాతృశక్తికి సంకేతం. కేంద్రం నుంచి విస్తరించిన శక్తి వృత్తంగా (చక్రంగా) మారుతుంది. అలాగే పరబ్రహ్మశక్తి విశ్వచక్రంగా విస్తరించింది. ఆ శక్తి శక్తులుగా బహువిధాలైంది. ఆ శక్తులే దిక్పాలక, గ్రహాది శక్తులుగా మనల్ని నడుపుతున్నాయి. విశ్వాన్ని నడిపే ఈ దేవతల వల్లనే మన జీవిత చక్రం ప్రభావితమౌతోంది. వారందరినీ విడిగా చూడడం కాకుండా, ఏకపరతత్త్వం యొక్క అభివ్యక్తులుగా దర్శించాలని మహర్షుల ఉద్దేశ్యం.

పరతత్త్వాన్ని 'సత్యనారాయణు'నిగా (నారాయణ పరం బ్రహ్మ-తత్త్వం నారాయణః పరః) ప్రతిష్ఠిస్తారు. కలశరూపంలో, ఒక తుండుగుడ్డ పరచి, దానిపై మంగళకరమైన బియ్యం, తమలపాకులు, పసుపుకుంకుమలు ఏర్పరచి విశ్వచక్ర భావనను మనముందు ప్రదర్శించే అద్భుత విజ్ఞాన ప్రక్రియ ఇది. దీని ద్వారా భావింపబడ్డ గ్రహదేవతలు, దిగ్దేవతలు వ్రతాచరణ చేసిన వారిని అనుగ్రహిస్తారు.



**ఇక కథావిషయానికి వస్తే -**

ప్రపంచమంతా మేధావులే ఉండరు. సామాన్యజనులలో శ్రద్ధను పుట్టించడానికే కథ. అంతేకాక కథాసన్నివేశాలలో మనకు తెలియని యజ్ఞ సంకేతాలు చాలా ఉన్నాయి. నోముల కథల్లో కూడా యజ్ఞ రహస్యాలుంటాయి. ఈ యుగంలో యజ్ఞాచరణకు కావలసిన దేశకాల పరిస్థితులు లేవు కనుక, సులభంగా యజ్ఞఫలం రావడానికి, సాధారణ మానవులు కూడా దేవతానుగ్రహం పొందడానికి పురాణాలలో ఆ సంకేతాలను నిక్షిప్తం చేశారు. పురాణకథలు కొన్ని యథాతథాలు. కొన్ని సంకేతాలు, కొన్ని గుణపాఠాల కోసం కల్పించిన ఉదాహరణలు, వాటి తేడాలను వివేకంతో, విచక్షణతో, పూర్వ పరసంబంధజ్ఞానంతో గమనించి సమన్వయించుకోవాలి.

ఈ కథలో నాలుగువర్ణాల వారూ ఉన్నారు. అందులో శ్రద్ధాలోపం ఉంటే భగవంతుడు క్షమించడన్నది గుణపాఠం. 'సత్యం' నారాయణ స్వరూపం, సంకల్పించుకున్న దానికి 'నిబద్ధత' ఉండాలి. దైవానుగ్రహం కోసం ఒక సంకల్పం చేసుకున్నాక, దాన్ని ఆచరించకపోతే సృష్టిలో ఉన్న విశ్వనియమం ప్రకారం విపరీత ఫలితాలు ఏర్పడడం సహజం. అది సత్యానికి ఏర్పడ్డ విఘాతానికి ఫలం, అదే స్వామికోపంగా ప్రతీకగా చెప్పారు. ఇది ఏ వ్రతంలోనైనా తప్పదు. మొక్కు తీర్చకపోతే శిక్షించేది ఆ దేవుడుకాదు మనం నిర్లక్ష్యం చేసిన 'సత్యం' లోని శక్తి. ఆ సత్యమే భగవత్ స్వరూపం.

ఆ విధమైన అవగాహనతో అంతరార్థాన్ని చెప్పి వ్రతాచరణలో శ్రద్ధ కలిగించడమే పండితులు, సంప్రదాయజ్ఞులు చేయవలసిన పని.

అట్టడుగువర్గాల వారు వ్రతం ఆచరించి ఇచ్చిన ప్రసాదాన్ని నిర్లక్ష్యపరచిన మహారాజు కూడా భగవదాగ్రహానికి గురయ్యాడనడంలో... "భగవంతుడు సర్వసముడనీ, ఇతరుల్ని తక్కువ దృష్టితో చూడరాదనీ" అతి మామూలు వారి మనసులో సైతం నాటుకోవాలని ఆ కథ ఉద్దేశ్యం, ఇది స్పష్టంగా కనిపిస్తుంది.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి..**

ఈ ప్రసంగంతో మారుతుడు "శేషా! నీవు గర్విష్ఠుడివి. పెద్దాచిన్నా తేడాలేక నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నావు. ఐనా నీవెంత? నా బలమెంత? బేరీజు చేసుకో! నాకూ, నీకూ హస్తిమశకాంతరమనడం గుర్తుంచుకో! నేను సకలజీవులలోనూ అంతర్యామిని. జగదాధారుడను. నేను నీ కంటే అధికుడను" అన్నాడు.

ఈ వాదనతో శేషుడు "ప్రభంజనా! నన్ను తక్కువగా లెక్కగట్టవద్దు. కొండలూ, కోనలూ సకలజీవరాశులూ నడయాడే భూమండలాన్ని మోస్తున్నవాడిని. నేనే అధికుణ్ణి. బ్రహ్మాండభాండోదరుడైన స్వామిని నేనే భరిస్తున్నా. నన్ను చుల కనగా చూడకు" అన్నాడు.

ఈ ప్రసంగంతో వాయువు వాదప్రతి వాదాలకు స్వస్తిచెప్పాలని "పన్నగేంద్రా! నేను నీలో ఉన్నాను. కనుక నీకు బలం; నేనే లేకపోతే నీవు నిర్బలుడివి. నేనేమూల తత్త్వాన్ని, ఎన్ని రకాలుగా ఆలోచించినా నీవు నాకంటే తక్కువ వాడివే" అన్నాడు.

ఈ మాటలతో శేషుడు- ఇక ఆ మాట లెందుకు? అమీతుమీ తేల్చుకుందాం. నీవూ, నేనూ మల్లయుద్ధం చేద్దాం. ఎవరు బలవంతులో చూచేవారికి కూడా స్పష్ట మౌతుంది. రా! రా! అని గద్దిస్తుంటే మందిరంలోని మాధవుడు బయట ఏదో గడబిడ అని, అదేదో చూద్దామని బయటకు వచ్చాడు.

హరి కనబడగానే శేషమారుతులు నమస్కరించారు. సర్వమూ నివేదించారు. పైగా "స్వామీ! మేము మల్లయుద్ధం చేయ దలచుకున్నాం. మీరు మమ్మల్ని దీవిం చండి" అని మొకరిల్లారు.

విష్ణువు వారి పట్టుదలను గుర్తించాడు. ఇదొక క్రీడ కదా చూద్దాంలే అను కున్నాడు. వీరు కోరే మల్లయుద్ధంలో ఏదో తలపు దాగి ఉందని కూడా పసిగట్టాడు. ఇలాంటి సందర్భంలో వీరిద్దరిని నివారిం చడం సాధ్యం కాదని "శేష, మారుతు లారా! మీరిద్దరూ వీరాగ్రగణ్యులు. కారణం లేకుండా మల్లయుద్ధం చేయడం వల్ల లోకాలు కకావికలం అవుతున్నాయి. నన్నడిగారు కనుక మీకొక యుక్తి చెబు తాను. కనకనగంతో పుట్టినదే వేంకటాద్రి. ఆ వేంకటాద్రిని చుట్టి ఆదిశేషుడు పట్టు వదలకుండా ఉంటాడు. పవనుడు తన బలంతో వేంకటగిరిని ఎగరగొట్టగలిగితే అతడే బలవంతుడు. ఇద్దరి బలపరీక్షకు ఇంతకంటే మరో ఉపాయం లేదు" అన్నాడు.

ఇద్దరూ పౌరుషం కలవారు కావడంతో సరేనన్నారు.

హరిసూచన ప్రకారం ఆదిశేషుడు వేంకటాద్రి పర్వతం చుట్టూ వేయిపడగ లతో ఆలింగనం చేసుకున్న రీతిలో గట్టిగా పట్టు వదలకున్నాడు. వాయుదేవుడు ఆ పర్వతాన్ని పర్వతం చుట్టూ చుట్టుకుని ఉన్న శేషుని జాగ్రత్తగా గుర్తించి, తన శక్తిని పెంచి ముందు ఆ కొండను కదల్చ డానికి ప్రయత్నం సాగించాడు.

ఇలాంటి సమయంలో భూమండలం వణకసాగింది. బ్రహ్మేంద్రాదులు మారుత మూర్తి దగ్గరకు వెళ్లి, "వాయుదేవా! నీవిలా చేయడం సరికాదు. మీరిద్దరి విజృంభణం వల్ల మారణ ఉత్పాతాలు కలుగుతున్నాయి. ఈ విజృంభణ కల్పాంతంలో చేయదగింది. అంచేత మేం చెబుతున్నాం. నీ విజృంభణాన్ని ఆపు" అన్నారు.

అయినా మారుతమూర్తి వారి మాటల్ని వినలేదు. తాడోపేడో ఈ రోజు తేలిపోవాలన్నాడు. ఈ సమయంలో వెనకడుగు వేస్తే ఓడిపోతానేమో అని మరీ విజృంభించసాగాడు.

ఇవన్నీ చూసిన బ్రహ్మేంద్రాదులు శేషు డైనా తమ మాట వింటాడని- "శేషా! నీవు బలవంతుడివి. నీ బలమేమిటో శ్రీహరికి తెలుసు, గౌరీమనోహరుడికి తెలుసు, మాకు తెలుసు" అని పొగడు

తున్నా శేషుడు వారి మాటల్ని పెడచెవిని పెట్టాడు. అయినా బ్రహ్మేంద్రాదులు మరోసారి ప్రార్థిద్దామనుకున్నారు.

“శేషా! నీవు శక్తిమంతుడివి. మేరుపర్వతం కుమారుడైన ‘వేంకటాద్రి’ని పడగలతో చుట్టిముట్టి ఉండటం వల్ల పవనుడు ఏమీ చేయలేకపోతున్నాడు సుమా! మహాత్మా మీరిద్దరూ బలవంతులే. మీరు ఓటమిని అంగీకరించరు. వాయువూ తనదే విజయమనే ఆత్మాభిమానాన్ని వదలుకోడు. ఇద్దరూ పరస్పరం పంతం వదలుకుని శాంతించండి. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయకండి.

ఐనా మరొక చిన్నమాట– “పన్నాగాధిపా! నీవు సామాన్యుడివా? నీ సోదరులందరూ మూర్ఖులు అని తెలుసుకుని, సాత్త్వికమూర్తికి నమ్మినబంటువైనావు. ఈ స్వభావంతోనే మూర్ఖపు పట్టుదలను వదిలిపెట్టకున్నావు. అనవసరమైన క్రోధమెందుకు? గాలిదేవునిదే గెలుపైనా, నీవూ గొప్పవాడివే” అని సర్వలోకసంక్షేమార్థం విశదం చేశారు.

శేషుడు బ్రహ్మ రుద్రేంద్రాదుల ఉపదేశాన్ని మన్నించాడు. పదివేలపడగలలో ఒకదాని పట్టు సడలించాడు. ఇదే అదనని వాయువు తన బలం ప్రదర్శించాడు. బొటనవేలును అట్టే నేలపై మోపి కొండ ఎగిరేలా చేశాడు. ఆ వాయువేగానికి వేంకటాద్రి గంగానదికి దక్షిణంగా 200 యోజనాల దూరంలోని తూర్పు సముద్రానికి 5 యోజనాలదూరంలోని సువర్ణముఖరీతీరం ఉత్తరం వైపున్న అడవుల మధ్య పడింది. పవనుడు తానే జయించాననే విజయగర్వంతో తన దారిని వెళ్లిపోయాడు. ఇవన్నీ గుర్తించిన శేషుడు పరాభవదుఃఖంతో కుమిలిపోతుంటే బ్రహ్మరుద్రేంద్రాదులు శేషుణ్ణి ఓదార్చారు.

(ఇంకా ఉంది)

## గ్రంథసమీక్ష

# అంతరిక్ష వృత్త తారావళి

**(పద్యకృతి) మిత్రవ్యాఖ్యాసహితం**

**వ్యాఖ్యాత్రి**–ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి; **సైజు**–1/8 డెమ్మీ; **పుటలు**– 120; **ధర**– రూ. 150/–; **ప్రతులకు**– డా॥వి.నాగ రాజ్యలక్ష్మి, 301, రామన్నటవర్స్, (1వ లైను, రామన్నపేట, గుంటూరు– 522 007, చరవాణి : 93941 13848.

ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణగారు రచించిన పంచభూత తారావళులలో నాల్గవది ‘అంతరిక్ష వృత్త తారావళి’. సమస్త విశ్వం పుట్టుకకు మూలమైన అంతరిక్షం విశిష్టతను, సర్వతోముఖత్వాన్ని రసవంతమైన శాస్త్రపద్యకావ్యంగా సత్యనారాయణగారు రచించగా ఆ కావ్యంలోని అంతరార్థాలను ఆమూలాగ్రంగా ఆవిష్కరించిన వ్యాఖ్య మిత్రవ్యాఖ్య.




పంచభూతాలను దేవతాస్వరూపాలుగా సనాతన మహర్షులు భావించారు. వేదమంత్రాలలో, సూక్తాలలో పంచ భూత స్తుతిమంత్రాలు విశిష్టతను సంతరించుకున్నాయి. అనేక వైజ్ఞానికరహస్యాలు ఆ మంత్రాలలో, సూక్తాలలో నిక్షేపింపబడ్డాయి. వేదమంత్రద్రష్టలైన మహర్షులు సృష్టిరహస్యాలను, పంచభూత తత్త్వాలను విశ్లేషించే క్రమంలో సంపూర్ణసిద్ధిప్రదమైన తపశ్శక్తిని ఆలంబనగా స్వీకరించారు. వారి సూక్ష్మదర్శనఫలితాలు, ప్రతిఫలాలు, ఆవిష్కరణలు, ఆధునిక కాలంలోని ఖగోళశాస్త్రవేత్తల పరిశోధనల సత్ఫలితాలకు, నిరూపణలకు, ఆవిష్కరణలకు సదృశమైనవిగా కన్పించిన తీరు అత్యంతాశ్చర్యకరమైంది.

వైజ్ఞానికదృష్టితో పరిశోధించినప్పుడు సృష్టికి పూర్వం అంతరిక్షంలోని అతిస్వల్పమైన అగ్నిబిందువు ఆదితేజోరూపమై క్రమంగా విస్తరించి విస్ఫోటం చెంది విశ్వం రూపుదిద్దుకుంది. సనాతన భారతీయ మహర్షుల దివ్యదృష్టిని, శాస్త్రవేత్తల పరిశోధనల ఆవిష్కరణలను సమన్వయిస్తూ వేద, పురాణకావ్య ఉదాహరణలను, శాస్త్రవేత్తల సిద్ధాంతాలను ఉటంకిస్తూ ఈ గ్రంథానికి డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అందించిన ‘మిత్రవ్యాఖ్య’ రచయిత్రి బహుముఖ పాండితికి నిదర్శనం. శాస్త్రాంశాలు, కావ్యనిర్మాణకళ మెండుగా నిండి ఉన్న ఈ కావ్యం అందరూ చదువదగింది.

*– డా॥ తాడేపల్లి వీరలక్ష్మి*

ఈ నెల 2వ తేదీన
శ్రీరామానుజ జయంతి సందర్భంగా...

# శ్రీరామానుజునకు, శ్రీరామానుజులకు సామ్యం

-డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీయతిరాజసప్తతి స్తోత్రంలోని 13వ శ్లోకంలో భగవద్రామానుజులకు, భగవంతునికి మధ్య ఉండే సామ్యాలను ఆవిష్కరిస్తూ శ్రీకృష్ణుడే భగవద్రామానుజులుగా అవతరించారు అని శ్రీదేశికులు నిర్ధారణ చేశారు. ఆ శ్లోకం....

"శమితోదయశంకరాదిగర్వః
స్వబలాదుద్ధృతయాదవప్రకాశః,
అవరోపితవాన్ శ్రుతే రపార్థాన్
నను రామావరజః స ఏష భూయః"

కాటుక పూసిన బాణం వలే, వేలాయుధం వలే ఉండే కళ్లను కలిగిన రోహిణి ముందుగా పొందిన తెల్లని వర్ణాన్ని కలిగిన కోపాన్ని కలిగినవాడైన గుణపూర్ణుడైన బలరామునకు తమ్ముడు అనే విధంగా శ్రీకృష్ణుడు బలరామునకు తమ్ముడు కనుక, రామానుజుడు అనే పేరును పొందాడు. జగదాచార్యులైన శ్రీభాష్యకారులు కూడా రామానుజనామంతో ప్రసిద్ధులు.



**శమితోదయ శంకరాదిగర్వః**-శ్రీకృష్ణుడు-బాణాసుర యుద్ధంలో శంకరునకు అపజయం కలిగించి, ఇంద్రుడు వడగళ్లవర్షాన్ని కురిపించినప్పుడు గోవర్ధనపర్వతాన్ని ఎత్తి ఆ వడగళ్లవాన నుండి రేపల్లెను రక్షించి చతుర్ముఖబ్రహ్మ రేపల్లెలోని ఆవుల లేగదూడలను దాచి పెట్టినప్పుడు లేగదూడలను సృష్టించి, ఈ విధంగా వారి అందరి గర్వాలను అణచేశాడు.

"బ్రహ్మం లెక్కలేనన్ని కల్యాణగుణాలకు సముద్రంవంటివాడు" అనే విషయాన్ని ఉపనిషత్తులను ప్రమాణంగా గ్రహించి, ఆళ్వారుల శ్రీసూక్తులను దానికి సహాయంగా చేసుకుని, శ్రీరామానుజులు స్థాపించారు.

**స్వబలాదుద్ధృతయాదవప్రకాశః** యదువంశీయులను చాలాకాలంగా బాధపెడుతున్న కంసుణ్ణి తన బలంతో వధించి, యాదవులకు సుఖంగా జీవించే మంచిమార్గాన్ని ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడు యాదవప్రకాశుడయ్యాడు.

**కప్యాసం పుండరీక మేవ మక్షిణీ** అనే ఉపనిషద్వాక్యానికి, ఇంకా కొన్ని వేదవాక్యాలకు అపార్థాలను చెబుతున్న యాదవప్రకాశులను శ్రీరామానుజులు తమ నిశితమైన జ్ఞానంతో ఖండించి, సరియైన అర్థాలను తెలిపి, వేదపురుషుని హృదయాన్ని స్పష్టం చేశారు. ఆ తరువాత ఆ యాదవ ప్రకాశుని తమ శిష్యునిగా పరిగ్రహించి, పంచసంస్కారాలను చేసి, అతనికి ఉజ్జీవనాన్ని కలిగించారు.

**అవరోపితవాన్ శ్రుతే రపార్థాన్** తన భక్తురాలైన ద్రౌపదిని పెద్దసభలో అవమానం చేసిన దుర్యోధనుడు మొదలైన వారిని, ఆ అన్యాయాన్ని అడ్డుకోని భీష్ముడు, ద్రోణుడు మొదలైన వారిని భారతయుద్ధంలో అర్జునునకు సహాయభూతుడై, అతని సారథిగా నిలచి వధించాడు, పార్థసారథి అయిన శ్రీకృష్ణుడు.

వేదాంతవాక్యాలకు ఇతర మతాలవారు విరుద్ధంగా పలికిన అర్థాలను అన్నిటిని నిరాకరించి తమ సరి అయిన శ్రీసూక్తులతో వాటిని ఖండించి వేదవాక్యాలకు సరైన అర్థాలను తెలియజేశారు శ్రీభాష్యకారులు.

ఈ విధంగా శ్రీకృష్ణుడికి, భగవద్రామానుజులకు మధ్య ఉండే అందమైన, యుక్తమైన సామ్యాలను పరిశీలించి చూస్తే, శ్రీకృష్ణభగవానుడే భాష్యకారులుగా అవతరించాడు అని చెప్పడం అనేది చాలా యుక్తంగా ఉంటుంది అని ఒక యుక్తమైన నిర్ణయాన్ని శ్రీదేశికులు చేశారు.

ఈనెల 2న శ్రీ శంకర జయంతి సందర్భంగా...

## సుమధుర మహాకావ్యం

# శ్రీశివానందలహరి

- ఆచార్య నందుల గోపాలకృష్ణమూర్తి



శంకరభగవత్పాదులు శంకరుని అపరావతారం. ఆచార్యస్వామి కారణజన్ములై సర్వమత శిరోభూషణం 'అద్వైతమ'ని పూర్వ పక్షంలేని సిద్ధాంతం చేసి వేదాంతడిండిమం మ్రోగించారు. ఆ మహామనీషి, పరమ కరుణామూర్తియై, సామాన్యమానవులకు మోక్షం పొందడానికి సులభోపాయం భక్తియని, విష్ణుసహస్ర నామభాష్యం, సౌందర్యలహరి, శివానందలహరి, కనకధారా స్తవ ప్రభృతి స్తోత్రవాఙ్మయం, మధుమయఫణితులలో అనుగ్రహించారు.

సర్వకావ్యలక్షణలక్షితమైన 'శివానందలహరి' అనే కన్యకను శ్రీగిరి మల్లికార్జునస్వామికి సమర్పించారు. భగవత్పాదులు తమ గ్రంథానికి శివానందలహరి అనే పేరు పెట్టడంలో పరమార్థముంది. శివానందలహరి అనగా మంగళప్రదమైన ఆనందప్రవాహం. లహరి అంటే అల, కెరటం. ఈ శివానందలహరి, పరమశివుని చరితమనే నదినుండి వెలువడింది. పాపమనే బురదను కడిగివేస్తుంది. బుద్ధివృత్తులనే కాలువలో ప్రవహిస్తుంది. సంసారంలో సంచరించడంవల్ల కలిగే తాపాన్ని ఉపశమింపచేస్తుంది. ఓ మహాదేవా! "నా మనసనే మడుగులో సదా ప్రవహించుగాక" అని ప్రార్థించారు. 47వ శ్లోకంలో "నా హృదయోద్యానంలో మాధవుని మనమున జ్ఞానానందసుధ, మకరందలహరి పరిమళించుగాక" అన్నారు.

ఆధునిక మానవుడు అర్థ, కామాలకు బానిసయై జ్ఞాన, కర్మ మార్గాల ననుసరింపలేక అహంకారంతో కాలక్షేపం చేస్తున్నాడు. అలాంటి మానవాళికి ఈ స్తోత్రవాఙ్మయం భవ వ్యాధి నుండి ఉపశమనం పొందడానికి చక్కని ఔషధం.

అమ్యూలమైన భక్తి అనగానేమి? ప్రశ్నకు ఉపమానాలతో మనోహరంగా నిర్వచించారు శ్రీ శంకరులు.

అంకోలం, నిజబీజసంతతిరయస్కాంతోపలం సూచికా
సాధ్వీనైజవిభుం లతా క్షితిరుహం సింధురిద్వల్లభమ్
ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదారవిందద్వయం
చేతోవృత్తిరుపేత్య తిష్ఠతి సదా సా భక్తిరిత్యుచ్యతే (61)

ఊడుగచెట్టును దాని విత్తనాలు అంటుకొంటాయి. సూదంటురాతిని సూది అంటి ఉన్నట్లు, ఉత్తమ ఇల్లాలు భర్త నీడ అనుసరించినట్లు, వృక్షాన్ని లత పెనగొనినట్లు, సముద్రంలో స్రవంతి కలియునట్లు, పశుపతిపాదారవింద ద్వయాన్ని సదా ఆశ్రయించడాన్నే భక్తి అంటారు.

భగవత్పాదులు భక్తిని నవ్యనవనీతసమానంగా భావించడం, భక్తుణ్ణి చిట్టిపాపాయిగా భావించి చేసే సేవలు రమణీయం. ఆ భక్తి జనని, పసివానికి ఆనందబాష్పాల లాలపోస్తుంది. పులకలను మెత్తని పొత్తిళ్లతో కప్పుతుంది. వాక్యశంఖంతో పరమశివుని చరితామృతంతో ఉగ్గు పెడుతుంది. ఉయ్యాలలో బజ్జోపెడుతుంది.

పరమేశ్వరుడు అనుగ్రహించిన మానవజన్మ సార్థకం చేసుకోవడానికి ఆయన ప్రసాదించిన సర్వ అవయవాలు పరమేశ్వరారాధనకు వినియోగించమని హితోపదేశం చేస్తున్నారు.

మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్రఫణితౌ
కరౌ చాభ్యర్చాయాం, శ్రుతిరపి కథాకర్ణనవిధౌచా

తవ ధ్యానే బుద్ధిర్నయనయుగళం మూర్తివిభవే
పరగ్రంథాన్కైర్వా పరమశివ జానే పరమతః (7)

వృథా గ్రంథపఠనం వృథా అని, భగవద్భజనలో సర్వేంద్రియాలు లగ్నం కావాలని శ్రీ శంకరులు కోరుతున్నారు. ఓ పరమశివా! నా మనస్సు నీ పాదపద్మాలనాశ్రయించుగాక! నా నాలుక నీ స్తోత్రాల్ని ఆలపించుగాక! నా హస్తాలు నీ పూజ యందే వినియోగించబడుగాక! నా చెవులు నీ కథల నాకర్ణించు గాక! నా కన్నులు నీ భువనమోహనసౌందర్యం వీక్షించుగాక! ఇంతకంటే ఇతర గ్రంథాల నెఱుగను అనే ఈ రమణీయ భావాన్ని మనసులో ఉంచుకుని కులశేఖరులు ముకుంద మాలలో "జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం/ చేతో భజ శ్రీధరం" అనే శ్లోకం విరచించాడు.

భక్తసామ్రాజ్యానికి పట్టంకట్టిన పోతన మహాకవి- "కంజాక్షు నర్చించు కరములు కరములు/ శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ" అనే సీసపద్యం మందార మకరందమధురంగా పలికారు. మహాపురుషుల భావధార సమాంతరం కదా!

మానవులు ఆడంబరంగా కీర్తి కోసం, పూజ కోసం పుష్పాల కోసం నానాయాతనలు పడేవారికి స్వామి ఉపదేశం చేశారు.

గభీరే, కాసారే, విశతి విజనే ఘోరవిపినే
విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థం జడమతిః ।
సమర్ప్యైకం చేతః సరసిజముమానాథ! భవతే
సుఖేనావస్థాతుం జన ఇహ న జానాతి కిమహో ॥ (9)

"హే! ఉమానాథ! కొందరు జడమతులు, ఈ లోకంలో తమ మనస్సనే తామరపువ్వు అర్పించక, పూలకై కొండలలో, సరస్సులలో పరిభ్రమిస్తున్నారు. ఎంత అవివేకం? ఈ పూవుల మాటున మనం అలవరచుకోవాల్సిన విష్ణుప్రీతికరాలను శ్లోకం అనుసంధించింది.






భగవత్పాదులు శ్రీశైలమల్లికార్జునస్వామిని సేవించే విధానాన్ని మనోహరమైన శ్లేషాలంకారంలో సంతరించారు. అల్పాక్షరాలలో అనల్పార్థం ప్రత్యక్షరంలో ధ్వనింపచేయడం మహాకవిత్వలక్షణం కదా!

సంధ్యారంభవిజృంభితం శ్రుతిశిరః స్థానాంతరాధిష్ఠితం
సప్రేమభ్రమరాభిరామమసకృత్సద్వాసనాశోభితమ్ ।
భోగీంద్రాభరణం సమస్తసుమనః పూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీగిరిమల్లికార్జునమహాలింగం శివాఽలింగితమ్॥ (50)

పరాశక్తిచే ఆలింగితమైన శ్రీశైలంలో స్వయంభువు అయిన మల్లికార్జున మహాలింగాన్ని సేవింతుననే ఈ శ్లోకం భ్రమరాంబాసహితుడైన మల్లికార్జునస్వామికి, మల్లికతో కూడిన అర్జునవృక్షానికి వ్యంగ్యార్థాలు స్ఫురిస్తున్నది. సంధ్యా సమయంలో పరమశివుడు నాట్యారంభానికి సమాయత్త మౌతాడు. మల్లికార్జునుడు ప్రణయాభిరామమైన భ్రమరాంబా పరిశోభితుడు. సత్పురుషుల భావనాశోభితుడు. ఆ మహాస్వామి సర్పాభరణుడు. పరమశివుడు దేవతాపూజ్యుడు. మల్లికార్జున పుష్పపరం.

ఈ పుష్పాలు సంధ్యారంభంలో పూస్తాయి. భక్తులు తమ చెవులలో, తలపైనా అలంకరించుకుంటారు. ఆ పుష్పం తుమ్మెదలలో అభిరామమైనవి సౌరభ సంవాసితాలు. ఈ పుష్పాలు భోగులకు ప్రియాతిప్రియాలు. ఈ రెండూ గుణాలచే ప్రకటింపబడుతున్నాయి. శంకరభగవత్పాదులు కవీనాం కవిః అని కదా!

స్వామి కవితాపరమార్థం ఆలోచన రమణీయంగా చిన్ని శ్లోకంలో ఆవిష్కరించారు. ఈ శ్లోకంతో భగవత్పాదుల వాఙ్మయం పరిశోధనార్హం.

సర్వాలంకారయుక్తాం, సరళపదయుతాం సాధువృత్తాం సువర్ణాం
సద్భిస్సంస్తూయమానాం, సరసగుణయుతాం, లక్షితాం లక్షణాఢ్యామ్
ఉద్యద్భూషావిశేషాముపగవినయాం ద్యోతమానార్థరేఖాం
కళ్యాణీం దేవ! గౌరీప్రియ ! మమ కవితాకన్యకాం, త్వం గృహాణ (98)

శంకరభగవత్పాదుల శ్రీశివానందలహరి అనే కవితా కన్యక సత్యం, శివం, సుందరమైంది.

ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా...

# కార్యసాధకుడు కపీశ్వరుడు

- పద్మశ్రీ డా॥గరికిపాటి నరసింహారావు

సుందరకాండ పారాయణ చేస్తే ఆగిపోయిన పనులు కూడా అయిపోతాయని లోకంలో ప్రతీతి. అలా చెప్పడంలో పెద్దల ఉద్దేశ్యం కేవలం పారాయణ చేసినంతలో ఏదో 'హనుమచ్ఛక్తి' క్రిందికి దిగి వచ్చి మన పనులన్నీ చేసిపెట్టేస్తుందని కాదు. సుందరకాండ మొత్తం సావకాశంగా, సావధానంగా చదివితే కార్యసాధనలో ఎదురయ్యే ఆటంకాలు ఎన్ని రకాలుగా ఉంటాయో, వాటిని ఏరకంగా తొలగించుకోవాలో అవగాహన చేసుకుంటారని. అవగాహన చేసుకుని వాటిని మన జీవితానికి అన్వయం చేసుకుని ఆచరణలో పెడితే కానిపని ఉంటుందా?

హనుమంతుడు సముద్రలంఘనం చేస్తుంటే మూడు రకాల ఆటంకాలేర్పడ్డాయి. మైనాకపర్వతం మర్యాద చేయడానికి అడ్డంగా వచ్చి నిలబడింది. ఇది సాత్త్వికాటంకం. తరువాత సురస అనే రాక్షసి ఆకాశమార్గానికి అడ్డంగా వచ్చి తన నోట్లో ప్రవేశించకుండా ఏ ప్రాణి ముందుకు వెళ్లలేదని పంతం పట్టింది. ఇది రాజసాటంకం. ఆ తర్వాత సింహిక అనే ఛాయాగ్రాహిణి మాటామంతీ లేకుండా క్రిందికి లాగెయ్యడం మొదలుపెట్టింది. ఇది తామసాటంకం.

కార్యసాధకుడైన హనుమంతుడు మూడు ఆటంకాలనీ మూడురకాలుగా ఎదుర్కొన్నాడు. మైనాకుడు మర్యాదలు చెయ్యడం కోసం అడ్డుపడ్డాడు. అతనితో మర్యాదగానే మాట్లాడి తిరిగివచ్చేటప్పుడు ఆగుతానని చెప్పి వెళ్లిపోయాడు. సురస ఆంజనేయుణ్ణి దాటి మ్రింగేద్దామని నోరుతెరిచింది. స్వామి దాంతో పోటీపడి దానికి రెట్టింపుస్థాయిలో శరీరం పెంచి కొంతసేపయ్యాక సమయం వృథా అవుతోందని గమనించి అతిసూక్ష్మ శరీరంతో దాంట్లోంచి బయటపడ్డాడు. రాజసాటంకాల నుండి బయటపడే ఉపాయం అది. ఆ తర్వాత సింహిక నీడ పట్టుకుని బలవంతంగా క్రిందికి లాగేస్తుంటే అది తమోగుణప్రవృత్తి అని గ్రహించి తన బలమంతా ఉపయోగించి దాన్ని పైకి లాగి ఒక్క గుద్దుతో పైలోకాలకి పంపేశాడు.

మనం కూడా ఏదైనా ఒక గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నప్పుడు ఎదురయ్యే ఆటంకాలు ఏరకమైనవో గమనించుకుని ఆ రకమైన ప్రవృత్తితోనే వాటిని ఎదుర్కోవాలి. కొన్నింటిని మర్యాదగానే ప్రక్కకి తొలగించాలి. కొన్ని విషయాల్లో కొంతసేపు పోటీపడినా సూక్ష్మమైన ఉపాయాలతో ఆ పోటీ నుండి బయటపడి మన పని మనం చూచుకోవాలి. ఒక్కవ్యక్తి జీవితానికైనా, మొత్తం వ్యవస్థలో మార్పులకైనా ఈ త్రిగుణాత్మకవ్యూహం బ్రహ్మాండంగా పనిచేస్తుంది. ఈ రకంగా సుందరకాండలో ఘట్టాలన్నీ అవగాహన చేసుకుని, ఆచరణలో పెడితే కానిపని అంటూ ఉంటుందా? అందుకోసం సుందరకాండ అందరూ చదవాలి. కపీశ్వరుని కార్యసాధకత్వాన్ని అవగాహన చేసుకుని అనుసరించాలి.



చిత్రం: శ్రీ ఎన్.వి.రమణ

# పరమ పవిత్రం

– శ్రీ ఎస్.టి.జి.అంతర్వేది కృష్ణమాచార్య

సరస్వతీ అతిపురాతనమైన వేదకాలపు నది. హిమాలయాలలో పుట్టిన ఈ నదీప్రసక్తి వేదాలలోను, రామాయణ భారత, భాగవతాలలోను కనిపిస్తుంది. బ్రహ్మాండపురాణంలో సరస్వతీ నదీ ఆవిర్భావం గురించి ఉంది. పూర్వం పరమశివుని ఆద్యం తాలను కనుక్కోదలచి బయలుదేరిన బ్రహ్మదేవుడు ఎంత వెదకినా కనుక్కోలేకపోయాడు. చివరికు శివుని వద్దకు వచ్చాడు. బ్రహ్మను చూచిన శివుడు నా ఆద్యంతాలు కనుగొన్నావా? అని అడిగాడు. పరాభవం చెందుతానని భావించిన బ్రహ్మ "నీ ఆద్యం తాలు చూచి వచ్చాను" అని అబద్ధం చెప్పాడు. ఈ విషయాన్ని గ్రహించిన శివుడు అతడి వాక్కగు సరస్వతిని నదివి కమ్మని శపించాడు. అందువల్లనే విద్యాధిదేవతైన సరస్వతి నదీదేవతగా మారిందని కథనం.

బ్రహ్మవైవర్త, దేవీభాగవత పురాణాలలో గంగ, సర స్వతులు ఒకరినొకరు శపించుకుని భూలోకంలో నదులుగా జన్మించినట్లు కథనం.

మహాభారతంలో సరస్వతీనది పూర్వం బ్రహ్మ చేసిన యాగానికి 'సుభద్ర' అనే పేరుతో, నైమిశారణ్యంలో మునులు చేసిన యాగానికి 'కనకాక్షి' అనే పేరుతో, గయుడు చేసిన క్రతువుకు 'విశాల' అనే పేరుతో, ఉద్దాలకుడు చేసిన అధ్వరానికి 'సురతన్వి' అనే పేరుతో, వశిష్టుడు చేసిన యాగానికి 'ఓఘమాల' అనే పేరుతో, బృహస్పతి చేసిన సత్రానికి 'సువేణి' అనే పేరుతో, బ్రహ్మ చేసిన సవనానికి 'విమలోదక' అనే పేరుతో వచ్చి నిరుపమానమైన గౌరవం పొందినట్లు చెప్ప బడింది. సరస్వతీనది ఈవిధంగా ఏడు యాగాలకు, ఏడు రూపాలతోను, పేర్లతోను వచ్చి గౌరవాదులు పొందడం వల్ల ఆమె 'సప్తసారస్వతం' అనే పేరును పొందింది.

## సరస్వతీనదీ ప్రాశస్త్యం

సరస్వతీనదీ ఎంతో పవిత్రమైంది. ఈ నదీస్మరణ వల్లనే సకల పాపాలు శమిస్తాయి. ఈ నదీతీరంలో వందలకొద్దీ తీర్థాలున్నాయి. అవి ఎంతో పుణ్యప్రదమైనవి. చంద్రుడు ఈ నదీస్నానఫలితం వల్ల రాజయక్ష్మవ్యాధిని పోగొట్టుకున్నాడు. ఇంద్రుడు తన బ్రహ్మహత్యాదోషాన్ని పోగొట్టుకున్నాడు. వరుణునికి జలాధిపత్యం, కుబేరునికి ధనాధిపత్యం ఈ నదీ సేవనం వలననే వచ్చాయి. విశ్వామిత్రుడు బ్రహ్మర్షికావడానికి కూడా ఈ నదే కారణం. వ్యాసభగవానుడు ఈ నదీతీరంలోనే విజ్ఞానరాశి అయిన వేదవిభజన చేశాడు. భాగవతరచన కూడా చేశాడని పురాణాలు సరస్వతీనదీప్రాశస్త్యాన్ని చెబు తున్నాయి.

**ఈ నెల 15వ తేదీ నుండి సరస్వతీ నదీ పుష్కరారంభం...**



ఈ సరస్వతీనదీతీరంలోనే తొలిమానవుడు నడయాడాడు. ఆర్యనాగరికత, ఆర్యుల జీవనం, వేదవిజ్ఞాన సముపార్జనవిస్తరణ ఈ నదీతీరంలోనే కొనసాగాయి. అందుకనే వారిచేత వేదాలలో తమ జీవనానికి కారణమవటం వల్ల తల్లిగా, జ్ఞానసముపార్జన ఈ నదీతీరంలోనే జరగడం వల్ల జ్ఞానదాయినిగా అభివర్ణించారు.

ఋగ్వేదంలో గంగా, యమునా, సింధు ఇత్యాది 21 నదులకన్నా సరస్వతీనదీ చాలా ఎక్కువగా కీర్తించబడింది.

## సరస్వతీనదీ గమనం

వేదాలలో ఈ నదీతీరంలో నివసించే రాజుల గురించి, ఋషుల గురించి, ప్రజల గురించి, దీని గమనం గురించి అనేక వర్ణనలున్నాయి. హిమాలయంలో పుట్టే ఈ నది వితస్తా (జీలం), అసిక్నీ (చీనాబ్), పరుష్ణి (రావీ), శతద్రు (సట్లేజ్) విపాశ (బియాస్), సింధునదులతో కలసి (పంజాబ్, పాకిస్తాన్ మీదుగా) ప్రవహించి పశ్చిమ సముద్రంలో సంగమించేది. ఈ ఏడు నదులు కలిసి ప్రవహించిన ప్రదేశమే సప్తసింధుప్రదేశంగా (ఆర్యావర్తంగా) ప్రసిద్ధి చెందింది. సరస్వతీనదీప్రవాహం కొన్నిచోట్ల వేగంగా, కొన్నిచోట్ల మందంగా సాగేది. ఈ నది వెడల్పు కూడా చాలా ఎక్కువగానే ఉండేది. కొన్నిచోట్ల సరోవరంలాగా, చెరువులాగా ఈ నదీప్రవాహం ఉండేది. ఆర్యావర్తంనుండి ఈ సరస్వతీనది గంగాయమునలవద్దకు ప్రవహించి ప్రయాగ అనే పవిత్రపుణ్యస్థలంలో వాటితో అంతర్వాహినిగా కలుస్తుంది. ఇదే ప్రఖ్యాతి చెందిన త్రివేణీ సంగమం.

ఈ సరస్వతీనదీతీరప్రాంతంలో ఉన్నదే కురుక్షేత్రం. కురుక్షేత్రానికి దగ్గరలోనే ఉన్నది 'వినాశన' అనే ప్రదేశం. ఇక్కడే సరస్వతీనది అంతర్ధానమైంది. ఒక పవిత్రనదిఅంతర్ధానాన్ని చూచిన స్థలం కాబట్టి ఆ చోటుకు 'వినాశన' అనే పేరు వచ్చింది. ఇపుడీ ప్రాంతంలో ఒక నది ఉంది. దాని పేరు "గగ్గర్". ఇది కేవలం వర్షాకాలంలోనే ప్రవహిస్తుంది.

32 చిన్నా, పెద్ద నదులు సరస్వతీనదిగా పిలువబడుతూ, సరస్వతీనదికి చెరగనిముద్రను వేస్తున్నాయి. అలాంటి వాటిలో ఒకటి శ్రీకృష్ణుడు నిర్యాణమొందిన 'ప్రభాస' పట్టణంలో కలదు. లవణానదిలో కలుస్తున్న మరొక సరస్వతీనది ఉంది. అది పుష్కరసరోవరంలో పుట్టి లవణానదిలో కలిసి పుష్కర సరస్వతి అనే పేరు పొందింది. ఈ లవణానదియే ఇప్పుడు కచ్ సింధుశాఖలో కలియు "లూనీనది".

వైదికకార్యవిజ్ఞానానికి, ఆర్షసంప్రదాయానికి పురుడు పోసిన ఈ సరస్వతీనదిని గుర్తించాలని, దీని పునరుజ్జీవనానికై ప్రయత్నిస్తూ 1819 సంవత్సరం నుంచి పరిశోధనలు చేయబడుతున్నాయి. 1985 సం॥లో వైదిక సరస్వతీనదీపరిశోధనా ఉద్యమం ప్రారంభమై 18 మంది సభ్యులతో ఒక సమితి నిరంతరం శ్రమిస్తూ సరస్వతీనదిని పునరుజ్జీవింపచేసి కృతకృత్యమైంది. పుష్కరాలు వచ్చే నదులలో ఇది మూడవది. గురుడు మిథునరాశిలోకి ప్రవేశిస్తే ఈ నదికి పుష్కరాలు వస్తాయి.

తిరుమల తిరుపతి దేవస్థానములు

## కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవం

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 18-05-2025 | ఆదివారం | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 19-05-2025 | సోమవారం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 20-05-2025 | మంగళవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 21-05-2025 | బుధవారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 22-05-2025 | గురువారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 23-05-2025 | శుక్రవారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 24-05-2025 | శనివారం | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 25-05-2025 | ఆదివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 26-05-2025 | సోమవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 27-05-2025 | మంగళవారం | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |
| 28-05-2025 | బుధవారం | పుష్పయాగమహోత్సవం | |

ధారావాహిక




*(గత సంచిక తరువాయి భాగం...)*

శ్రీకృష్ణ(శర్మ) మండపానికి వచ్చి గరుత్మంతుని, ద్వార పాలకులను సేవించి భగవద్రామానుజులవారి ఎదుట వారి పురుషకారముతోడ శ్రీవేంకటాచలపతి శ్రీపాదాలకు సాష్టాంగ పడి 'తాయేతంద్దై' అనే తిరువాయ్‌మొళి అనుసంధించి లోనికి వెళ్లి కులశేఖరపడి వద్ద నిలచి 'ఆపాద చూడ మనుభూయ హరిం శయానమ్' అనే అభ్యాసవశాన శ్రీపాదకమలాలు మొదలుకొని కిరీటపర్యంతం అనుభవించి 'కంగులుమ్ వగలుమ్' దశకాన్ని దేవగానసరళిలో పాడుతుండగ భగవం తుడు సంతసించి, "ఓ ప్రబంధగాయకా! నమ్మాళ్వారులు మాపై మోహం పొంది నాయికాభావాన్ని పొంది మమ్మనుభవించిన తీరును మీరనుకరించి చూపారు. అందుచేత ఆ శ్రీముఖసూక్తి మాకు మధురంగా ఉండింది. మన పరకాల దివ్యసూరి నాయికాదశాపన్నులై అనుభవించి పాడిన గీతాలలో ఒక్కటి గానం చేయుడు" అని చెప్పగా ఆళ్వారుత్తైయర్ అనే గాయకులు ముగ్ధహృదయులై పరకాలదివ్యసూరి అనుగ్రహించిన భక్తిరసార్ద్ర తన్మయులై 'కారార్‌వరై క్కొంగై' అని, పరకాలుడు తాటిమట్ట పైనెక్కి భగవదనుభవం చేసిన తీరును పరవశగాత్రులై ఆలాపింపగా ఆకర్షించి హృదయం ఉప్పొంగగా భగవంతుడు శ్రీపాదపద్మాలు, శ్రీశఠకోపం, తీర్థం మున్నగు ప్రసాదాల నన్నింటిని ఇప్పింపగా పొంది కృతకృత్యుడయ్యాడు. అప్పుడు సన్నిధిలోనున్న పెద్దలు తిరువేంకటజియ్యరు, అంజనవెళ్ళునార్, అరైయర్ (గాయకులు) మొదలైనవారంతా సంతుష్టస్వాంతులై ఈ మధ్యాహ్నకాలంలో దివ్యమాలికను ధరించినపుడు శ్రీవేంకటేశ్వరస్వామి సంతోషించి పరకాల దివ్యసూరిగీతాన్ని విని ఆనందింప మనసుపడి తిరుమడల్ ప్రబంధాన్ని వినినందున నేడు మొదలు మధ్యాహ్నవేళ దివ్యమాలికను ధరింపజేసే సందర్భంలో 'శిఱియ తిరుమడల్' అనే ప్రబంధాన్ని అనుసంధింపగా విని సంతసించడానికి 'కంగులుమ్ వగలుమ్' గీతాన్ని విని ఆనందించడానికి మనసు పడినందున నిత్యానుసంధానకాలంలో 'కంగులుమ్ వగలుమ్' గీతాన్ని ఆలాపించుచుండగలరు (అని భగవదాజ్ఞ) అని చిరకాలంగా వృద్ధులు ఉపాసించినవారు చెబుతారు. శ్రీవీథులలో కూడా ఈ 'శిఱియ తిరుమడల్' గేయం అనుసంధేయం.

## శ్రీవేంకటేశ్వరుడు శ్రీకృష్ణజయంతి పరిపాలన చేయడానికి ప్రమాణం

ప్రాచీనకాలంలో శ్రీవైఖానసవంశంలో 'శంగని వాయన్' (బింబాధరుడు) వంశస్థులైన పెరియపెరుమాళ్ అనే అర్చకులు జ్ఞానానుష్ఠానసంపదలు గలిగి శ్రీవేంకటేశ్వరుని దివ్యదేహంపై అత్యంతాసక్తులై భగవదనుగ్రహానికి పాత్రులై యుండిరి. ఇట్టి పెరియపెరుమాళ్ కలలో, అప్పటి ప్రబంధ గాయకుల కలలో, అప్పటివారై 'తిరువేంగడచ్చిఱుక్కన్' అనే వేంకటేశ్వరస్వామి పుత్రాభిమానముంచుటకు యోగ్యులైన తిరుప్పణిప్పిళ్ళై స్వప్నంలో ఒకరాత్రి శ్రీవేంకటరమణస్వామి మొదట తన నిజరూపాన్ని చూపించాడు. *(ఇంకా ఉంది)*


ఎండప్రభావం చర్మం మీద చాలా ఎక్కువ

# చిగురంత ఆశ... జగమంత వెలుగు

- శ్రీ పమిడికాల్వ మధుసూదన్



జీవితం అంటే గెలుపు; జీవితమంటే సుఖం; జీవిత మంటే శిఖరారోహణం.... అని మన నరానరాన ఎక్కించు కున్నాం.

జీవితమంటే ఎడతెగని ప్రయాణం, గెలుపోటములు, ఎగుడుదిగుళ్లు, కష్టనష్టాలు సహజం అని అర్థం చేసుకోవడం ఎప్పుడో మానేశాం.

దూరం బాధిస్తున్నా... పక్షివిశ్వాసం రెక్కలు విప్పు తూనే ఉంటుంది. అలలను సవాలు చేసి.... చేపపిల్ల ఈదు తూనే ఉంటుంది. గ్రీష్మంలో ఎండిన కొమ్మే చైత్రంలో చిగు రించి... ప్రకృతికి పట్టుచీరల సారె పెడుతుంది.

మావిచిగురుకోసం కోయిల నిరీక్షిస్తూ ఉంటుంది. కోయిల పిలుపుకోసం మావికొమ్మ ఎదురుచూస్తూనే ఉంటుంది. చీకటిరాత్రికొమ్మమీదే రేపటివెలుగుల సూరీడు ఎదురుచూస్తూ ఉంటాడు. కష్టాలవెంట సుఖాలు; సుఖాలవెంట కష్టాలు; కష్టాల వెంట కష్టాలను తలచుకుని, తలచుకుని బాధపడుతూ ఉంటే... గుండె మరింత బరువెక్కి దిక్కుతోచదు.

జీవితమంటే బరిలో గిరిగీసి నిలవడం. జీవితమంటే బతికి... బతికించడం. జీవితమంటే మనను మనమే నడిపించు కోవడం. మన యుద్ధం ఇంకెవరో చేయరు.

అవతారమూర్తి అయిన సీతమ్మను కూడా ఇలాంటి కష్టాలే చుట్టుముట్టాయి. కానీ ఆమె గుండెనిబ్బరం కష్టాలెదు ర్కొనేవారికి శ్రీరామరక్ష.

హనుమంతుడు సునాయాసంగా వంద యోజనాల సముద్రందాటి, చీకటిపడేదాకా ఆగి, పిల్లి పిల్లంత రూపంతో లంకంతా వెతికాడు. సీతమ్మ కనిపించలేదు. చాలా నిరుత్సాహ పడ్డాడు. ఇంతదూరం ఎగిరివచ్చి ప్రయోజనం లేకుండా పోయిందే అని బాధపడ్డాడు. లంకలో సీతమ్మ కనిపిస్తోంది అని సంపాతి చెప్పాడు కదా! మరి నాకెందుకు కనిపించలేదు? అని మథనపడ్డాడు. వట్టిచేతులతో వెనక్కు వెళ్లి రాముడికి, సుగ్రీవుడికి ఎలా మొహం చూపించాలి అని విసుక్కున్నాడు. నిర్వేదంతో డీలా పడిపోయాడు. ఒక్కక్షణం ఆలోచించాడు. నేను చూడగలను అనుకోవడం తప్పు. సీతమ్మే నన్ను కరుణించి కనిపించాలి అని ప్రార్థించి తనను తాను ఉత్సాహపరుచు కున్నాడు. ఆ సందర్భంగా హనుమ అన్న మాట ఇది.

"అనిర్వేదః శ్రియో మూలమనిర్వేదః పరం సుఖమ్
అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః"

(నిర్వేదం లేకపోవడమే శ్రేయస్సు. నిర్వేదం లేకపోవ డమే అన్ని సుఖాలకు మూలం. నిర్వేదం లేనివారే అన్నివేళలా అన్ని పనులు చక్కబెట్టుకోగలరు.)

ఇలా అనుకోగానే హనుమకు దూరంగా అశోకవనంలో శింశుపావృక్షం చెట్టుకింద అరుగుమీద సీతమ్మ కన్పిస్తుంది. తీరా దగ్గరికెళ్లి ఆ చెట్టుకొమ్మమీద కూర్చునేసరికి రావణాసురుడు తప్ప తాగి వచ్చి కారుకూతలు కూస్తూ ఉంటాడు. పదినెలలు ఓపిక పట్టాను. ఇంకో రెండు నెలలు గడువిస్తున్నా. మనసు మార్చుకుని నా అంతఃపురంలోకి వచ్చావా సరి. లేదంటే ఆ మరుసటిరోజు నిన్ను ముక్కలుచేసి

# హెల్మెట్ తప్పనిసరి

**తిరుపతి నుంచి తిరుమలకు, తిరుమల నుంచి తిరుపతికి ద్విచక్రవాహనంలో చేరుకోవాలనుకునే, ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ లేనివారిని అలిపిరి టోల్‌గేట్ దగ్గర అనుమతించరు. కాబట్టి ఖచ్చితంగా హెల్మెట్ ధరించి వెళ్ళాలి. దీని వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చు.**

**క్షేమంగా ప్రయాణించవచ్చు.**

ఉదయం ఫలహారంలో తింటా అంటాడు. రావణాసురుడి మాటలకు సీతమ్మకు కన్నీళ్లు పొంగి వచ్చాయి. కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంది. పది నెలలుగా సీతమ్మ పడ్డకష్టాలు, అవమానాలు అన్నీ ఇన్నీ కాదు. రావణాసురుడి మాటలు గుండెను రంపపుకోతలా కోస్తున్నాయి. దుఃఖం పొంగుకొస్తోంది. పది నెలలుగా ఊపిరి బిగబట్టుకుని, ఆశను ఉగ్గబట్టుకుని నిరీక్షించింది. ఇక ఆశ సన్నగిల్లింది.

రాముడి గురించి ఎలాంటి సమాచారం లేదు. దేశంకాని దేశంలో అయిదు వందల మంది పరమవికృతమైన రాక్షసస్త్రీలమధ్య అన్నాళ్లు ఉండడమే ఊహకందని విషయం. నా కష్టం పగవాడికి కూడా రాకూడదు. ఇక బతికి ఉండి లాభం లేదనుకుని అంతులేని నైరాశ్యంలో సీతమ్మ ఉండగా ఆంజనేయస్వామి మెరుపువేగంతో స్పందించాడు.

"అయోధ్యరాజు దశరథుడు. ఆయన పెద్దకొడుకు రాముడు. తండ్రిమాటకు కట్టుబడి రాముడు వనవాసానికి బయలుదేరితే సీతమ్మ, లక్ష్మణులు వెంట వచ్చారు. దండకారణ్యంలో ఉండగా రావణాసురుడు సీతమ్మను అపహరించుకుని వెళ్లాడు. శ్రీరామసుగ్రీవులు సీతాన్వేషణలో భాగంగా హనుమ నయిన నన్ను ఇక్కడికి పంపారు" అని స్పష్టంగా, పద్ధతిగా, వరుసగా, లౌక్యంగా, అనునయంగా చెప్పాడు. హనుమ మాటలతో సీతమ్మకు పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయ్యింది. మెల్లగా కొమ్మదిగిన హనుమ మిగతా తతంగమంతా వినయంగా, ఒక గొప్ప దౌత్యవేత్తలా చక్కబెట్టాడు. సీతమ్మకు రామనామాంకిత ఉంగరమిచ్చాడు. సీతమ్మ చూడామణి రాముడికి ఇవ్వడానికి తీసుకున్నాడు. హనుమ మాటలతో కుదుటపడ్డ సీతమ్మ ఈ సందర్భంలో చెప్పిన గొప్ప మాట ఇది.

"కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మే।
ఏతి జీవంత మానందో నరం వర్షశతాదపి॥"

(మనిషికి వందేళ్ల ఆయుష్షు. తొంభై తొమ్మిదేళ్లు కష్టాలున్నా వందో సంవత్సరమైనా బాగుంటుందని ఆశతో బతకాలి. ఆశను బతికించుకోవాలి. రేపటిమీద ఆశను వదులుకోకూడదు. ఆనందాన్ని వెతుక్కోవాలి.)

ప్రాణం ఉన్నంతవరకూ పోరాడాలి. ప్రాణం పోయేంత వరకూ పోరాడాలి. ప్రాణం పోతున్నా పోరాడుతూనే ఉండాలి. పోరాడుతూనే పోవాలి. పోతే చరిత్రగా మిగిలిపోవాలి. నీళ్లు లేని ఎడారుల్లో కన్నీళ్లయినా త్రాగి నిలబడాలి. కరి మబ్బులు కమ్మినవేళ వేగుచుక్కల వెలుగును వెతికి పట్టుకోవాలి. చిగురంత ఆశను బతికించుకుని జగమంత వెలుగులమవ్వాలి. జగతికి వెలుగులు పంచాలి.

## వైకుంఠపాళి

### :: 112 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 శ్రీ | ల | క్ష్మీ | 2 న | ర | 3 సిం | హ | 4 స్వా | మి | | 5 ప్ర |
| మ | | | ర | | హి | | యం | | | హ్లా |
| ద్రా | | | 6 సిం | హి | త | | భు | | 7 కా | దు |
| 8 మా | మ | | హ | | | 9 భ | వు | డు | | డు |
| ను | | 10 వి | జ | యం | | ర | | | 11 ఆ | |
| జు | | | యం | | | 12 ద్వా | ప | ర | యు | గం |
| లు | | 13 స్వా | తి | | | జు | | | వు | |
| | 14 సు | | | 15 ఆ | | డు | | | | 16 అ |
| 17 శం | క | రా | చా | ర్యు | లు | | 18 మో | | 19 వే | ప |
| | న్య | | | డు | | 20 మో | హి | ని | | ర |
| | | 21 కుం | తి | | | | నీ | | | |



రెండుపూటలా స్నానం చేయడమే చెమటకు పరిష్కారం

## 108 దివ్యదేశాలు

# తిరువహీంద్రపురమ్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

ఈ దివ్యదేశం నడునాడు దివ్యదేశాలలో ఒకటి. బ్రహ్మాండ, స్కాంద, నారదీయపురాణాల్లో ఈ దివ్యదేశవైభవం వర్ణితం. కడలూర్ నుండి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ దివ్యదేశముంది.

ఈ దివ్యదేశానికి ఐదారు స్థలపురాణాలు ఉన్నాయి.

1) భగవంతుడైన వైకుంఠపతిని సనకసనందాదులు దర్శించుకోవాలని, పాలకడలికి, ఆ పై వైకుంఠానికి వచ్చారు. స్వామి ఎక్కడా కన్పించలేదు. ద్వారపాలకులు "భూమాదేవి, మార్కండేయమహర్షి తపస్సు చేసేటటువంటి తిరువహీంద్ర పురానికి వెళ్లితే శ్రియఃపతిని సేవించుకోవచ్చు" అని చెప్పారు. దాంతో సనకసనందాదులు ఈ దివ్యదేశానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అంతేకాదు ఈ దివ్యదేశంలోనే స్థిరంగా ఉండి భక్తుల్ని కటాక్షించాలని ప్రార్థించారు. వారి కోరిక మేరకు స్వామివారు దేవనాథుడిగా ఇక్కడ వేంచేసి ఉన్నాడు.

2) నిత్యసూరులైన గరుడ, ఆదిశేషుల వైభవాన్ని లోకానికి తెలియజేయాలని స్వామి సంకల్పించి వారిద్దరికీ ఒక పరీక్షపెట్టాడు. తనకు "దాహంగా ఉంది. మంచినీళ్లు తీసుకు రండి" అని చెప్పాడు. గరుడుడు వేగంగా ఎగిరి ఒక పర్వతం పైన తపస్సు చేస్తున్న ఒక మహర్షి కమండలాన్ని తన ముక్కుతో తీసుకువచ్చే సందర్భంలో ఆ నీరు క్రిందపడి, అది పెద్ద నదిగా మారి తిరువహీంద్రపురంలో ప్రవహించింది. దాన్నే గరుడనది అంటారు.

ఆదిశేషుడు, ఈ దివ్యదేశంలోని భూమిని తవ్వి, పాతాళలోకంలోని నీటిని దేవనాథుడికి సమర్పించాడు. ఆ తీర్థమే శేషతీర్థం. ఈ తీర్థజలాన్ని స్వామివారి ప్రసాదం తయారుచేయడానికి, విరజానదికి సమానమైన గరుడనదీ జలాన్ని స్వామివారి అభిషేకానికి, చక్రస్నానానికి వినియోగించా లని నియమం చేశారు. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. ఇక్కడి భక్తులు శేషతీర్థంలోనే పాలను సమర్పిస్తారు.

3) మార్కండేయమహర్షి బ్రహ్మను ప్రార్థించి విశ్వకర్మ చేత ఈ దివ్యక్షేత్రనిర్మాణం చేయించాడు. బ్రహ్మతీర్థసమీపంలో తపస్సు చేసి, దేవనాథస్వామికి సమీపంగా ఉండి బ్రహ్మోత్స వాన్ని జరిపించి, భూదేవిని కూడా మరొక ప్రక్క వేంచేపు చేయించి ఈ క్షేత్రాన్ని తీర్చిదిద్దాడు.

| | | |
|---|---|---|
| భగవంతుడు | : | దైవనాయకుడు |
| ఉత్సవమూర్తి | : | దేవనాథన్, అడియవరుక్కుమెయ్యన్, దాస సత్యన్, స్థిరజ్యోతి |
| అమ్మవారు | : | హేమాంభుజవల్లి, వైకుంఠనాయకి, భార్గవి, తరంగముఖ నందిని |
| తీర్థం | : | గరుడనది, శేషతీర్థం, చంద్రతీర్థం, భూతీర్థం |
| ప్రత్యక్షం | : | గరుడుడు, ఆదిశేషుడు, చంద్రుడు, శివుడు, మార్కండేయుడు, భృగువు |
| విమానం | : | చంద్రవిమానం, శుద్ధసత్త్వవిమానం, చంద్రనిర్మిత విమానం |
| ఆగమం | : | వైఖానసం |



4) దేవాసురయుద్ధంలో దేవతలు ఈ దివ్యదేశస్వామిని నాయకుడిగా, దానవులు పరమశివుణ్ణి నాయకుడిగా ఏర్పాటు చేసుకున్నారు.



ఆ సమయంలో పరమశివుడు తన శూలాయుధాన్ని స్వామివారి మీద వేయగా, దేవనాథస్వామి తన చక్రాయుధాన్ని దానికి ప్రతిస్పర్ధిగా వేశాడు. సుదర్శనుడు శూలగర్వాన్ని అణచాడు. కనుక ముమ్మూర్తులలో విష్ణుస్వరూపుడైన దేవనాథుడే అగ్రగణ్యుడని తీర్మానించారు. కనుకనే ఆయనకు దైవనాయకుడనే పేరు సార్థకమైంది.

5) త్రేతాయుగంలో హనుమంతుడు సంజీవపర్వతాన్ని తీసుకువస్తుండగా, దాని నుండి ఒకరాయి క్రిందపడి, అదే ఔషధగిరిగా ఏర్పడిందని అంటారు.

ఈ ఔషధగిరిలోనే సౌగంధికవనంలో తపస్సు చేసిన మార్కండేయుడు, పద్మంలో మూడేళ్లప్రాయం గల ఒక అమ్మాయిని చూచి పెంచుకున్నాడు.

ఆ అమ్మాయి సముద్రంలోని తరంగాల్ని చూస్తూ ఆనందించేది. అంచేత ఆ అమ్మాయికి తరంగముఖనందిని అనే పేరు పెట్టారు. ఈమెను శ్రీదేవనాథస్వామికి మార్కండేయ మహర్షి కన్యాదానం చేయడం వల్ల ఇక్కడే నిత్యనివాసం చేస్తున్నారని స్థలపురాణం.




అలాగే భృగుమహర్షి బ్రహ్మదేవుని అనుగ్రహంతో శ్రీమహాలక్ష్మిని కుమార్తెగా పొందాడు. ఈమె భార్గవి, హేమాబ్జ వల్లి అనే పేర్లతో పెరిగి దేవనాథస్వామికి ఇల్లాలైనట్లు ఐతిహ్యం.

ఈ స్వామిని తిరుమంగై ఆళ్వారు పదిపాశురాలతో అర్చించాడు. శ్రీవేంకటేశ్వరుని ఘంటావతారంగా భావించబడే శ్రీవేదాంతదేశికులవారు ఈ క్షేత్రంలో శ్రీహయగ్రీవస్వామి అనుగ్రహంతో అనేకవిద్యలు పొందారు.

ఈ దివ్యక్షేత్రస్వామి వారిపై దేశికులు దేవనాయక పంచాశత్ అనే గ్రంథాన్ని అనుగ్రహించారు. ఇంకా వీరు 120 గ్రంథాల్ని, ఇక్కడి గరుడుని ఉపాసించి రచించారు. వేదాంత దేశికుల వారికి ధ్వజస్తంభంతో ఉన్న ఆలయం ఇక్కడ తప్ప మరెక్కడా లేదు.

ప్రతి సంవత్సరం భాద్రపదమాసంలో హంసధ్వజారోహణంతో దేశికులవారికి పదిరోజులపాటు ఇక్కడ ఉత్సవం జరుగుతుంది. సుమారు నలభై సంవత్సరాలు శ్రీవేదాన్తదేశికుల వారు ఈ దివ్యదేశంలోనే నివసించారు. వారి దివ్యతిరుమాళిగై ఇక్కడే ఉంది. వారు త్రవ్విన బావి కూడా ఈనాటికీ మనకు దర్శనమిస్తుంది.


ఎక్కడికి వెళ్తున్నా వెంట నీళ్ల సీసా తీసుకెళ్లాలి

# శ్రీఆంజనేయస్వామి పూజావిధానం

'శ్రీహనుమజ్జయంతి' సందర్భంగా శ్రీఆంజనేయపూజావిధానం 'సప్తగిరి' పాఠకుల కోసం..



అత్యంత శక్తివంతమైన హనుమద్వ్రతం ఆచరించడం వలన కార్యసిద్ధి, శత్రుజయం కలుగుతుంది. కోరుకున్న పనులు వెంటనే సిద్ధిస్తాయి. ఆటంకాలు తొలగిపోతాయి. దీర్ఘకాలవ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుంది. అనితర సాధ్యమైన పనులన్నీ ఎటువంటి ఆటంకాలు లేకుండా వెంటనే పూర్తవుతాయి.

ప్రాతఃకాలాన నిద్రలేచి, స్నానాది నిత్యకృత్యాలను ఆచరించి, శుద్ధుడై, తులసీ, పుష్పఫలాది, పూజాద్రవ్యాలను ఏర్పరచుకుని- శ్రీఆంజనేయుని పటానికిగానీ, విగ్రహానికిగానీ యథావిధి పూజించాలి.

శ్రీకేశవాది నామాలతో ఆచమనీయం చేసి తరువాత, ప్రాణాయామం ఆచరించి - సంకల్పించుకోవాలి.

ఘంటానాదం చేశాక ప్రాణాయామం చేసి, "శుభతిథౌ ......... గోత్రస్య.......... నామధేయస్య.......... ధర్మపత్నీ సమేతస్య సహకుటుంబస్య సపుత్రకస్య సపౌత్రకస్య సభ్రాతృకస్య సబాంధవస్య సపరివారస్య క్షేమ, స్థైర్య, ధైర్య, విజయ, అభయ, ఆయురారోగ్య, ఐశ్వర్యాభివృద్ధ్యర్థం, ధర్మార్థ, కామమోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం, శ్రీఆంజనేయస్వామి దేవతాముద్దిశ్య శ్రీఆంజనేయస్వామి దేవతాప్రీత్యర్థే షోడశోపచారపూజాం కరిష్యే" అని సంకల్పించుకుని కలశారాధన చేసి - కలశంపై చేతినుంచి-

## కలశపూజా

తదంగ కలశారాధనం కరిష్యే, కలశం గంధ పుష్పాక్షతై రభ్యర్చ్యః
కలశస్యముఖే విష్ణుః, కంఠే రుద్రః సమాశ్రితః॥
మూలే తత్ర స్థితో బ్రహ్మా మధ్యే మాతృగణాః స్మృతాః॥
కుక్షౌతు సాగరా స్సర్వే సప్తద్వీపా వసుంధరా
ఋగ్వేదోఽథ యజుర్వేద స్సామవేదో హ్యథర్వణః।
అంగైశ్చ సహితా స్సర్వే కలశాంబుసమాశ్రితాః॥
గంగేచ యమునేచైవ గోదావరి! సరస్వతి!
నర్మదే సిన్ధుకావేర్యా జలేఽస్మిన్ సన్నిధిం కురు॥
కావేరీ తుంగభద్రా చా కృష్ణవేణీ చ గౌతమీ॥
భాగీరథీతి విఖ్యాతాః పంచగంగాః ప్రకీర్తితాః॥
ఆయాంతు దేవ పూజార్థం దురితక్షయకారకాః॥

(కలశజలాన్ని పుష్పంతోగాని, తులసితోగానీ తీసుకుని దైవప్రతిమపై ప్రోక్షించి, తనపై కూడా చల్లుకుని, పూజాద్రవ్యాలపై చల్లి) ఆదౌ సంకల్పిత పూజా నిర్విఘ్నేన పరిసమాప్త్యర్థం శ్రీమహాగణపతిపూజాం కరిష్యే (గణపతిని పూజించాక) పూర్వ సంకల్పిత శ్రీఆంజనేయపూజాం కరిష్యే అని పూజారంభం చేయాలి. సంకల్పః... పూర్వోక్త.... శుభతిథౌ శ్రీఆంజనేయదేవతాప్రీత్యర్థం షోడశోపచారపూజాం కరిష్యే

## ధ్యానం

మర్కటేశ మహోత్సాహ సర్వశోకవినాశన
శత్రూన్ సంహర మాం రక్ష శ్రియం దాపయ మే ప్రభో
స్ఫటికాభం స్వర్ణకాంతిం ద్విభుజం చ కృతాంజలిం
కుండలద్వయ సంశోభి ముఖాంభోజం ముహుర్ముహుః ॥
శ్రీహనుమతే నమః, ధ్యాయామి.

## ఆవాహనం

రామచంద్ర పదాంభోజ యుగళస్థిరమానసం
ఆవాహయామి వరదం హనూమంత మభీష్టదం
శ్రీహనుమతే నమః ఆవాహయామి.

## సింహాసనం

నవరత్న నిబద్ధాశ్రం చతురశ్రం సుశోభనం
సౌవర్ణమాసనం తుభ్యం దాస్యామి కపినాయక
శ్రీహనుమతే నమః సువర్ణరత్న సింహాసనం సమర్పయామి.

## పాద్యం

సువర్ణకలశానీతం గంగాదిసలిలైర్యుతం
పాదయోః పాద్యమనఘం ప్రతిగృహ్య ప్రసీద మే
శ్రీహనుమతే నమః పాదయోః పాద్యం సమర్పయామి.

## అర్ఘ్యం

కుసుమాక్షత సమ్మిశ్రం ప్రసన్నాంబు పరిప్లుతం
అనర్ఘ్య మర్ఘ్య మధునా గృహ్యతాం కపిపుంగవ
శ్రీహనుమతే నమః, ముఖే ఆచమనీయం సమర్పయామి.

## మధుపర్కం

మధ్వాజ్యక్షీరమిళితం శర్కరాదధిసంయుతం
అర్పయే మధుపర్కం తే స్వీకురు త్వం దయామయ
శ్రీహనుమతే నమః, మధుపర్కం సమర్పయామి.

## పంచామృతస్నానం

మధ్వాజ్యక్షీరదధిభిః సగుడైర్మంత్రపాలితైః
పంచామృతైః పృథగ్జ్ఞాతై స్సించామి త్వాం కపీశ్వర
శ్రీహనుమతే నమః, పంచామృతస్నానం సమర్పయామి.
శ్రీహనుమతే నమః, శుద్ధోదకస్నానం సమర్పయామి.
స్నానానంతరం ఆచమనీయం సమర్పయామి.

## వస్త్రం

గ్రథితాం నవరత్నైశ్చ మేఖలాం త్రిగుణీకృతాం
అర్పయామి కపీశ త్వం గృహాణ మహతాం వర
శ్రీహనుమతే నమః, వస్త్రయుగ్మం సమర్పయామి.
వస్త్రధారణానంతరం ఆచమనీయం సమర్పయామి.
(అని చెప్పి, పెద్దవస్త్రం కట్టి, రెండు భుజాలపై నుంచి వ్రేలాడేటట్టుగా పైపంచ ధరింపజేయాలి)

## యజ్ఞోపవీతం

శ్రౌత స్మార్తాది కృత్యానాం సాంగోపాంగ ఫలప్రదం
యజ్ఞోపవీత మనఘం ధారయాఽ నిలనందన
శ్రీహనుమతే నమః, యజ్ఞోపవీతం సమర్పయామి.
అనంతరం ఆచమనీయం సమర్పయామి.

## గంధం, సిందూరం

దివ్యసిందూర కర్పూర మృగనాభి సమన్వితం
సకుంకుమం పీతగంధం లలాటే ధారయానఘ
శ్రీహనుమతే నమః, గంధసిందూరాణి సమర్పయామి.
(అని చెప్పి మంచి వాసనగల గంధద్రవ్యాన్ని, సిందూరాన్ని, విగ్రహముఖం నొసట, పాదాలకు పెట్టాలి. గంధం ముందుగానే సిద్ధంచేసి ఉంచుకోవాలి)

## పుష్పాక్షతాః

నీలోత్పలైః కోకనదైః కల్హార కమలైరపి
కుముదైః పుండరీకైస్త్వాం పూజయామి కపీశ్వర
శ్రీహనుమతే నమః, పరిమళ పుష్పాక్షతాన్ సమర్పయామి.
(అని చెప్పి, విగ్రహాన్ని పూలతో చక్కగా అలంకరించాలి)

## అంగ పూజ

| | | | | |
|---|---|---|---|---|
| శ్రీ హనుమతే | నమః | - | పాదౌ | పూజయామి |
| శ్రీ సుగ్రీవసఖాయ | నమః | - | గుల్ఫౌ | పూజయామి |
| శ్రీ అంగదమిత్రాయ | నమః | - | జంఘే | పూజయామి |
| శ్రీ రామదాసాయ | నమః | - | ఊరూ | పూజయామి |
| శ్రీ అక్షఘ్నాయ | నమః | - | కటిం | పూజయామి |
| శ్రీ లంకాదహనాయ | నమః | - | వాలం | పూజయామి |
| శ్రీ రామమణిదాయ | నమః | - | నాభిం | పూజయామి |
| శ్రీ సాగరోల్లంఘనాయ | నమః | - | మధ్యం | పూజయామి |
| శ్రీ లంకామర్దనాయ | నమః | - | కేశావలీం | పూజయామి |
| శ్రీ సంజీవాహర్త్రే | నమః | - | స్తనౌ | పూజయామి |
| శ్రీ సౌమిత్రిప్రాణదాయ | నమః | - | వక్షః | పూజయామి |
| శ్రీ కుంఠిత దశకంఠాయ | నమః | - | కంఠం | పూజయామి |
| శ్రీ రామాభిషేకకారిణే | నమః | - | హస్తౌ | పూజయామి |
| శ్రీ మంత్రరచిత రామాయణాయ | నమః | - | వక్త్రం | పూజయామి |
| శ్రీ ప్రసన్నవదనాయ | నమః | - | వదనం | పూజయామి |
| శ్రీ పింగళనేత్రాయ | నమః | - | నేత్రే | పూజయామి |
| శ్రీ శ్రుతిపారగాయ | నమః | - | కర్ణౌ | పూజయామి |
| శ్రీ ఊర్ధ్వపుండ్రధారిణే | నమః | - | కపోలే | పూజయామి |
| శ్రీ మణికంఠమాలినే | నమః | - | శిరః | పూజయామి |
| శ్రీ సర్వాభీష్టప్రదాయ | నమః | - | సర్వాణ్యంగాని | పూజయామి |

## శ్రీమదాంజనేయ అష్టోత్తరశతనామావళి

ఓం శ్రీఆంజనేయాయ నమః
ఓం మహావీరాయ నమః
ఓం హనుమతే నమః
ఓం మారుతాత్మజాయ నమః
ఓం తత్త్వజ్ఞానప్రదాయ నమః
ఓం సీతాదేవీముద్రాప్రదాయకాయ నమః
ఓం అశోకవనికాచ్ఛేత్రే నమః
ఓం సర్వమాయావిభంజనాయ నమః
ఓం సర్వబంధవిమోక్త్రే నమః
ఓం రక్షోవిధ్వంసకారకాయ నమః 10
ఓం పరవిద్యాపరీహారాయ నమః
ఓం పరశౌర్యవినాశనాయ నమః
ఓం పరమంత్రనిరాకర్త్రే నమః
ఓం పరయంత్రప్రభేదకాయ నమః
ఓం సర్వగ్రహవినాశినే నమః
ఓం భీమసేనసహాయకృతే నమః
ఓం సర్వదుఃఖహరాయ నమః
ఓం సర్వలోకచారిణే నమః
ఓం మనోజవాయ నమః
ఓం పారిజాతద్రుమూలస్థాయ నమః 20
ఓం సర్వమంత్రస్వరూపాయ నమః
ఓం సర్వతంత్రస్వరూపిణే నమః
ఓం కపీశ్వరాయ నమః
ఓం మహాకాయాయ నమః
ఓం సర్వరోగహరాయ నమః
ఓం ప్రభవే నమః
ఓం బలసిద్ధికరాయ నమః
ఓం సర్వవిద్యాసంపత్ప్రదాయకాయ నమః
ఓం కపిసేనానాయకాయ నమః
ఓం భవిష్యచ్చతురాననాయ నమః 30
ఓం కుమారబ్రహ్మచారిణే నమః
ఓం రత్నకుండలదీప్తిమతే నమః
ఓం సంచలద్వాలసన్నద్ధలంబమానశిఖోజ్జ్వలాయ నమః
ఓం గంధర్వవిద్యాతత్త్వజ్ఞాయ నమః
ఓం మహాబలపరాక్రమాయ నమః
ఓం కారాగృహవిమోక్త్రే నమః
ఓం శృంఖలాబంధమోచకాయ నమః
ఓం సాగరోత్తారకాయ నమః
ఓం ప్రాజ్ఞాయ నమః
ఓం రామదూతాయ నమః 40
ఓం ప్రతాపవతే నమః
ఓం వానరాయ నమః
ఓం కేసరీసుతాయ నమః
ఓం సీతాశోకనివారకాయ నమః
ఓం అంజనాగర్భసంభూతాయ నమః

ఓం బాలార్కసదృశాననాయ నమః
ఓం విభీషణప్రియకరాయ నమః
ఓం దశగ్రీవకులాంతకాయ నమః
ఓం లక్ష్మణప్రాణదాత్రే నమః
ఓం వజ్రకాయాయ నమః 50
ఓం మహాద్యుతయే నమః
ఓం చిరంజీవినే నమః
ఓం రామభక్తాయ నమః
ఓం దైత్యకార్యవిఘాతకాయ నమః
ఓం అక్షహంత్రే నమః
ఓం కాంచనాభాయ నమః
ఓం పంచవక్త్రాయ నమః
ఓం మహాతపసే నమః
ఓం లంకిణీభంజనాయ నమః
ఓం శ్రీమతే నమః 60
ఓం సింహికాప్రాణభంజనాయ నమః
ఓం గంధమాదనశైలస్థాయ నమః
ఓం లంకాపురవిదాహకాయ నమః
ఓం సుగ్రీవసచివాయ నమః
ఓం ధీరాయ నమః
ఓం శూరాయ నమః
ఓం దైత్యకులాంతకాయ నమః
ఓం సురార్చితాయ నమః
ఓం మహాతేజసే నమః
ఓం రామచూడామణిప్రదాయ నమః 70
ఓం కామరూపిణే నమః
ఓం పింగళాక్షాయ నమః
ఓం వార్ధిమైనాకపూజితాయ నమః
ఓం కబళీకృతమార్తాండమండలాయ నమః
ఓం విజితేంద్రియాయ నమః
ఓం రామసుగ్రీవసంధాత్రే నమః
ఓం మహిరావణమర్దనాయ నమః
ఓం స్ఫటికాభాయ నమః
ఓం వాగధీశాయ నమః
ఓం నవవ్యాకృతిపండితాయ నమః 80
ఓం చతుర్బాహవే నమః
ఓం దీనబంధవే నమః
ఓం మహాత్మనే నమః
ఓం భక్తవత్సలాయ నమః
ఓం సంజీవననగాహర్త్రే నమః
ఓం శుచయే నమః
ఓం వాగ్మినే నమః
ఓం దృఢవ్రతాయ నమః
ఓం కాలనేమిప్రమథనాయ నమః
ఓం హరిమర్కటమర్కటాయ నమః 90
ఓం దాంతాయ నమః
ఓం శాంతాయ నమః
ఓం ప్రసన్నాత్మనే నమః
ఓం శతకంఠమదాపహృతే నమః
ఓం యోగినే నమః
ఓం రామకథాలోలాయ నమః
ఓం సీతాన్వేషణపండితాయ నమః
ఓం వజ్రదంష్ట్రాయ నమః
ఓం వజ్రనఖాయ నమః
ఓం రుద్రవీర్యసముద్భవాయ నమః 100
ఓం ఇంద్రజిత్ప్రహితామోఘ-
బ్రహ్మాస్త్రవినివారకాయ నమః
ఓం పార్థధ్వజాగ్రసంవాసినే నమః
ఓం శరపంజరభేదకాయ నమః
ఓం దీర్ఘబాహవే నమః
ఓం లోకపూజ్యాయ నమః
ఓం జాంబవత్ప్రీతివర్ధనాయ నమః
ఓం సీతాసమేతశ్రీరామపాదసేవా
ధురంధరాయ నమః
ఓం శ్రీమదాంజనేయస్వామినే నమః 108

అష్టోత్తరశతనామపూజాం సమర్పయామి.
(గంట మ్రోగిస్తూ దీపం ఇవ్వాలి)





## ధూపం

దివ్యం సగుగ్గులుం రమ్యం దశాంగేన సమన్వితం
గృహాణ మారుతే ధూపం సుప్రియం ఘ్రాణతర్పణం

శ్రీహనుమతే నమః, దివ్య పరిమళ ధూప మాఘ్రాపయామి
(అని చెప్పి, విగ్రహానికి చక్కగా ధూపవాసన వ్యాపించేటట్టుగా ధూపం ఇవ్వాలి)

(నేతి వత్తులు మూడింటిని ఒకటిగా చేసి, వెలిగించి, దేవుని విగ్రహాన్ని అందరూ చూచేటట్టుగా త్రిప్పాలి)

## దీపం

ఘృతవర్తి సముజ్జ్వాలా శతసూర్య సమప్రభం
అతులం తవ దాస్యామి వ్రతపూర్త్యై సుదీపకం

శ్రీ హనుమతే నమః దీపం దర్శయామి.
(అని చెప్పి, దేవునికి దీపం చూపించి, తర్వాత)
ధూపదీపానంతరం ఆచమనీయం సమర్పయామి
(అని చెప్పి, ఉద్ధరణి నీళ్లు దేవుని ముఖానికి చూపించి, అర్ఘ్య పాత్రలో వేయాలి)

గమనిక: ఉపచారాలతో ఇచ్చే ఈ దీపాన్ని, హారతివలె కన్నులకు అద్దుకోవాల్సిన అవసరం లేదు.

## నైవేద్యం

మణిపాత్రసహస్రాఢ్యం దివ్యాన్నం ఘృతపాయసం
అపూప లడ్డుకోపేతం మధురామ్ర ఫలైర్యుతం
హింగూజీరకసంయుక్తం షడ్రసోపేత ముత్తమం
నైవేద్యమర్పయామ్యద్య గృహాణేదం కపీశ్వర

యథావిధి నివేదనం కుర్యాత్, మధ్యే మధ్యే పానీయం సమర్పయామి, ఉత్తరాపోశనం సమర్పయామి, హస్తప్రక్షాళనం సమర్పయామి, ముఖప్రక్షాళనం సమర్పయామి, పాదప్రక్షాళనం సమర్పయామి, గండూషం సమర్పయామి, శుద్ధాచమనీయం సమర్పయామి.

*(అని చెప్తూ ఐదుమార్లు ఉద్ధరిణితో నీళ్లు అర్ఘ్యపాత్రలోకి వదలాలి)*

(తాంబూలంలో మూడు బిళ్లవక్కలు, రెండు తమలపాకులు కానీ, రెండుబిళ్లవక్కలు, మూడు తమలపాకులు కానీ ఉంచాలి. ఇది తాంబూలం ఇచ్చే విధానం)

## తాంబూలం

నాగవల్లీదళోపేతం క్రముకైర్మధురైర్యుతమ్
తాంబూల మర్పయామ్యద్య కర్పూరాదిసువాసితం

శ్రీహనుమతే నమః, సదక్షిణ తాంబూలం సమర్పయామి, తాంబూలచర్వణానంతరం ఆచమనీయం సమర్పయామి.

*(అని చెప్పి, దేవునికి తాంబూలం సమర్పించాలి)*

(గంట వాయించాలి)

## కర్పూర నీరాజనం

ఆరార్తికం తమోహారి శతసూర్య సమప్రభం
అర్పయామి తవ ప్రీత్యై అంధకారనిషూదనం

శ్రీహనుమతే నమః, కర్పూరనీరాజనం సమర్పయామి,

*(అని చెప్పి, దేవునికి మూడుసార్లు పాదాది శిరః పర్యంతం అందరూ కర్పూరకాంతిలో దేవుణ్ణి దర్శించి, ఆనందించేటట్టుగా విగ్రహానికి కుడిపక్కన హారతి ఇవ్వాలి. హారతి తట్ట నిదానంగా భక్తిప్రపత్తులతో త్రిప్పాలి. వేగంగా త్రిప్పరాదు.)*

నీరాజనానంతరం ఆచమనీయం సమర్పయామి.

## మంత్రపుష్పం

ఆంజనేయాయ విద్మహే । వాయుపుత్రాయ ధీమహి
తన్నో హనుమత్ప్రచోదయాత్

శ్రీహనుమతే నమః, సువర్ణ దివ్య మంత్రపుష్పం సమర్పయామి.

*(అని భక్తితో దోసిటిలోనికి పూలు తీసుకుని, హనుమంతుణ్ణి స్మరిస్తూ, స్వామివారి పాదపద్మాలపై సమర్పించాలి. మన హృదయమనే పుష్పాన్నే సమర్పిస్తున్నట్లు భావించాలి. పూజలో పాల్గొన్న అందరికీ పూలు ఇచ్చి, నలుపకుండా భక్తితో తట్టలో వేయమని, తర్వాత వాటిపై కలశజలం పువ్వుతో చల్లి, అందరూ సమర్పించిన పూలను భగవంతుని పాదాలపై సమర్పించాలి. పిదప అందరూ భక్తితో నమస్కరించాలి.)*

## ప్రదక్షిణ నమస్కారం

ప్రదక్షిణ నమస్కారాన్ సాష్టాంగాన్ పంచసంఖ్యయా
దాస్యామి కపినాథాయ గృహాణ సుప్రసీద మే

శ్రీహనుమతే నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

*(ఎడమనుండి కుడికి నమస్కార ముద్రతో ఐదుసార్లు ప్రదక్షిణం)*

ఛత్రం ధారయామి, చామరైః వీజయామి, నృత్యం దర్శయామి, గీతం శ్రావయామి, దర్పణం దర్శయామి, ఉష్ట్రానావాహయామి, వాద్యం ఘోషయామి, సమస్త రాజోపచార, భక్త్యుపచార, శక్త్యుపచార పూజాం సమర్పయామి.

*(అని చెప్పి, పూలు, అక్షతలు స్వామి పాదాలపై ఉంచి నమస్కరించాలి)*

అనయా.. పూజయా శ్రీ హనుమద్దేవతా సుప్రీతః సుప్రసన్నో వరదో భవతు.

సర్వేజనాః సుఖినో భవంతు

## పుష్పాంజలిః

వైశాఖే మాసి కృష్ణాయాం దశమ్యాం మందవాసరే
పూర్వాభాద్రా ప్రభూతాయ మంగళం శ్రీహనూమతే

కరుణారసపూర్ణాయ ఫలాపూపప్రియాయ చ
మాణిక్యహారభూషాయ మంగళం శ్రీహనూమతే

సువర్చలాకళత్రాయ చతుర్భుజధరాయ చ
ఉష్ట్రారూఢాయ వీరాయ మంగళం శ్రీహనూమతే

దివ్యమంగళదేహాయ పీతాంబరధరాయ చ
తప్తకాంచనవర్ణాయ మంగళం శ్రీ హనూమతే

భక్తరక్షణశీలాయ జానకీశోకహారిణే
జ్వలత్పావకనేత్రాయ మంగళం శ్రీహనూమతే

పంపాతీరవిహారాయ సౌమిత్రిప్రాణదాయినే
సృష్టేః కారణభూతాయ మంగళం శ్రీహనూమతే

రంభావనవిహారాయ గంధమాదనవాసినే
సర్వలోకైకనాథాయ మంగళం శ్రీహనూమతే

పంచాననాయ భీమాయ కాలనేమిహరాయ చ
కౌండిన్యగోత్రజాతాయ మంగళం శ్రీహనూమతే

శ్రీహనుమతే నమః, పుష్పాంజలిం సమర్పయామి

**శ్లో॥** త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ!
హనుమాన్ యత్నమాస్థాయ దుఃఖక్షయకరో భవ.

**తాత్పర్యం:** వానరోత్తముడైన హనుమంతుడా! ఈ కార్యం నీ వల్ల జరగాల్సి ఉంది. నీవు ప్రయత్నం చేసి ఎట్లయినా నా ఈ దుఃఖాన్ని నశింపచేయి స్వామి.

# ఊరిజనాల్ని కంటికి రెప్పలా కాపాడే తల్లులు

- ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, 98493 07333

మన దేవాలయాలు

తిరుపతి గంగజాతర ఆంధ్రప్రదేశ్‌లో పేరెన్నిక గన్న జాతర. ప్రపంచప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రం తిరుపతిలో గంగమ్మ కొలువుదీరి ఉండడం మరొక ప్రత్యేకత. సాక్షాత్తు తిరుమల వెంకన్నే ఈమెకు సోదరుడని ప్రజలు భావించడం ఈ జాతరకు మరింత శోభ తీసుకు వచ్చింది.

ప్రతి సంవత్సరం తిరుపతిలో గంగజాతర ప్రధానంగా తాతయ్యగుంట గంగమ్మగుడి దగ్గరే జరుగుతుంది. ఆ తర్వాత తాళ్లపాక గంగమ్మ, వేషాలమ్మ గుడిదగ్గర కూడా జరుగుతుంది. తిరుపతి గ్రామదేవతల్లో వీరిద్దరే కాకుండా అంకాళమ్మ, నేరేళ్లమ్మ, మాతమ్మ, కరకమాని గంగమ్మ, దొనకొండ గంగమ్మ ముత్యాలమ్మ, మారెమ్మ, పేరంటాలమ్మ మొదలైన గ్రామదేవతలు కూడా ఉన్నారు. వీరిలో ఏడుమందిని కలిపి గంగమ్మకు అక్కచెల్లెళ్లుగా వ్యవహరిస్తారు. స్థానిక కథల ఆధారంగా చూస్తే తిరుపతి గ్రామదేవతలు అక్కచెల్లెళ్లు ఏడుమంది. వీరిలో పెద్దగంగమ్మ (తాళ్లపాక గంగమ్మ) అందరి కంటే పెద్దది. తర్వాత వేషాలమ్మ, అంకాళమ్మ, ముత్యాలమ్మ, నేరేళ్లమ్మ, మాతమ్మ, అందరి కంటే చిన్నది తాతయ్యగుంట గంగమ్మ (చిన్నగంగమ్మ). జానపద కథల్లో ఈ ఏడుసంఖ్యకు విపరీతమైన ప్రాధాన్యం ఉంది. అందరికంటే చిన్నవాళ్లే సాహసవంతులుగా, శక్తివంతులుగా ఉంటారు. అలా తాతయ్యగుంట గంగమ్మ శక్తివంతురాలిగా భావింపబడుతోంది. తిరుపతిలో వెలసిన ఈ ఏడుగురు అక్కచెల్లెళ్లను గురించి తెలుసుకుందాం!

### 1)తాళ్లపాక గంగమ్మ (పెద్దగంగమ్మ)

తాళ్లపాక చెరువు కట్టమీద వెలసినందువల్లనో లేదా తాళ్లపాక అన్నమాచార్యులు అర్చించినందువల్లనో ఈమెకు తాళ్లపాక గంగమ్మ అనే పేరు వచ్చింది. తిరుపతిలోనికి వచ్చే యాత్రికులకు ముందు తాళ్లపాక గంగమ్మే దర్శనమిస్తుంది. అన్నమయ్య కూడా తిరుపతియాత్ర వచ్చినప్పుడల్లా ఈ గంగమ్మను పూజించినట్లు తాళ్లపాక చిన్నన్న పేర్కొన్నాడు. జాతరలో పెద్దగంగమ్మకు ఎక్కువ ప్రాధాన్యం లేకపోవడం గురించి స్థానికులు ఒక కథను కూడా చెప్తారు –

చిన్నగంగమ్మ ఒకసారి తన అక్క పెద్దగంగమ్మ ఇంటికి పిల్లలను చూడదానికని తినుబండారాలు తీసుకువెళ్తుంది. సంతానంలేని చెల్లి తన పిల్లలను చూస్తే దిష్టి తగులుతుందని పిల్లలను గంప కింద దాచి పెడుతుంది పెద్ద గంగమ్మ. పిల్లలు ఎక్కడికి పోయారని చిన్నగంగమ్మ అడుగుతుంది. అందుకు పెద్ద గంగమ్మ చెట్టుకొకరు, పుట్టకొకరు పోయారని అబద్ధం చెబుతుంది. ఎంతో ఆశతో అక్కబిడ్డలను చూడదానికి వచ్చిన చిన్నగంగమ్మకు ఆ మాటలు ఆగ్రహాన్ని కలిగిస్తాయి. కోపంతో ఆమె గంప కింది పిల్లల్ని మాయం చేసేసి తిరిగి వచ్చేస్తుంది. పిల్లలు గంపకింద కనిపించకపోయేసరికి పెద్దగంగమ్మ తన చెల్లి దగ్గర చేసిన తప్పు గ్రహించి క్షమించమని చెల్లిని



ప్రాధేయపడుతుంది. తన పిల్లల్ని తిరిగి తనకు అప్పగిస్తే ముందు పూజలు చిన్న గంగమ్మకని, తరువాతి పూజలు తనకని, అలాగే ప్రజలు సమర్పించే ఆహారం అంతా చిన్నగంగమ్మకేనని చెబుతుంది. చిన్నగంగమ్మ పిల్లలను పెద్దగంగమ్మకు అప్పగిస్తుంది. అప్పట్నుంచి జాతర మొత్తం చిన్నగంగమ్మ చుట్టే కేంద్రీకృతమైంది.

## 2) వేషాలమ్మ

వేషాలమ్మ గుడి ఒకప్పుడు తిరుపతి గ్రామసరిహద్దుల్లో నైరుతిదిశలో ఉండేది. గంగజాతరలో ఆనువంశికంగా వేషాలు వేసే కైకాల రెడ్లు, రజకులు వేషం వేసిన తర్వాత, ముఖాన వస్త్రం కప్పుకుని ముందుగా వేషాలమ్మను దర్శించి, పూజలు చేస్తారు. ఆ తర్వాత వస్త్రం తొలగించి, వేషాన్ని అందరికీ ప్రదర్శిస్తారు. సున్నపుకుండలు వంటి ప్రధానవేషాల్ని వేషాలమ్మ గుడిలోనే వేస్తారు. గంగజాతరలో అత్యంత ఆకర్షణీయమైన చప్పరాలు వేషాలమ్మ గుడి పక్కనే (కోర్టు ఆవరణలో) కుడ్తారు. ఒకటి, రెండు వేషాలు తప్ప ప్రతి వేషం వేషాలమ్మ గుడికి మొదట రావాల్సిందే. దొరవేషం, పేరంటాలు వేషం కూడా



గుడిలోకి రాకపోయినా గుడి సమీపం నుండే మొదట ప్రారంభమవుతుంది. గంగమ్మ పాలెగాడిని చంపిన ప్రదేశం కూడా వేషాలమ్మ గుడికి వెనుక పక్కనే ఉండడం గమనార్హం. గంగజాతరలో ప్రతి వేషం ఈ గ్రామదేవత వద్దకు రావడం వల్ల, వేషాలన్నింటికీ ఈమె ఆధిపత్యం వహించడం వల్ల ఈమెకు వేషాలమ్మ అనే పేరొచ్చింది.

## 3) అంకాళమ్మ

తిరుపతికి ఆగ్నేయదిశలో తిరుచానూరు రోడ్డులో అంకాళమ్మ గుడి ఉంది. అందమైన రాతి స్తంభాలతో, శిల్పాలతో ఈ గుడి నిర్మించబడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేని విధంగా ఈ గుడి ముందు స్త్రీద్వారపాలికలు నల్లరాతితో ఎంతో అద్భుతంగా మలచబడి ఉన్నారు. ఒకప్పుడు తిరుపతిలో కలరా వంటి అంటువ్యాధులు ప్రబలినప్పుడు అంకాళమ్మను పూజించేవారు.

## 4) ముత్యాలమ్మ

తిరుపతికి తూర్పువైపున ముత్యాలమ్మగుడి ఉంది. ఈమె ముత్యాలవంటి అమ్మవారును పోసేదని అంటారు. ఇప్పటికీ అమ్మవారు వచ్చిన పిల్లలను తీసుకుని గుడిముందు పడుకోబెట్టి రెండుమూడురోజులతర్వాత బాగయ్యాక తీసుకుపోతుంటారు. ముత్యాలవంటి అమ్మవారును పోస్తుంది. కాబట్టి ఈమెకు ముత్యాలమ్మ అనే పేరొచ్చింది.

## 5) నేరేళ్లమ్మ

ఈ దేవత తాతయ్యగుంట గంగమ్మగుడికి ఎడమవైపునే ఉండేది. ఈమె ఒకప్పుడు సూరావాళ్లతోటలో (నేటి హెడ్ పోస్టాఫీసు స్థలంలో) నేరేడు చెట్టు కింద ఉండేది. అందుకని ఈమెకు నేరేళ్లమ్మ అనే పేరొచ్చింది. ఈమె కూడా ఊరును కంటికిరెప్పలా కాపాడుతుంది.

## 6) మాతమ్మ

తిరుపతికి దక్షిణం వైపు దళితవాడలో 'మాతమ్మ' ఉంది. ఈమె గుడిని ధూపం రెడ్లు కట్టించారు. వీరేగాక ఈమెను ఇతర కులాల వాళ్లు కూడా ప్రధానంగా కొలుస్తారు. పెండ్లికి ముందు కొందరు స్థానికులు మాతమ్మ గుడికెళ్ళి పొంగళ్లు పెట్టుకు వస్తుంటారు. మాతంగి వేషాలు కచ్చితంగా

మాతమ్మ గుడికెళ్లి వస్తుంటాయి. మాతమ్మను జాతర సమయంలోనే కాకుండా ప్రత్యేకంగా తొమ్మిది రోజులు కొలువులు చేస్తారు.

### 7) తాతయ్యగుంట గంగమ్మ (చిన్నగంగమ్మ)

తాతయ్యగుంట కట్ట ముందు వెలసినందువల్లనో, తాతాచార్యులు ఆరాధించినందువల్లనో, ఈమెకు తాతయ్య గుంట గంగమ్మ అనే పేరొచ్చింది. ఈమె (నాటి) తిరుపతికి ఈశాన్యం వైపున ఉండడం వల్ల అత్యంత శక్తివంతురాలిగా పూజలందుకుంటోంది. అమ్మవారు పోసినప్పుడు ఈమెకు మొక్కుకునేవారు. అలాగే వర్షాలకోసం కూడా ఈమెను ఆరాధి స్తుంటారు. ఈమెకే అంగరంగవైభవంగా జాతర జరుగుతుంది. సాక్షాత్తూ తిరుమలేశుడే గుట్టమీద కూర్చొని జాతరను వేడుకగా తిలకిస్తాడని ప్రజలు నమ్ముతారు.

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామికి సంబంధించి అనేక విషయాలు విశేషాలు జనవ్యవహారంలో ఉన్నాయి.

శ్రీవేంకటేశ్వరస్వామి అవతరణకు సంబంధించి పురాణాలు చెప్పే విషయాలకు జానపదులు చెప్పే విషయాలకు, చాలా తేడాలున్నాయి. పురాణాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి తల్లిదండ్రులు, అన్నలు, చెల్లెలు గూర్చి చెప్పబడలేదు. అయితే జానపదులు మాత్రం వీరిని గూర్చి చెప్పారు.

వేంకటేశ్వరస్వామి తండ్రిపేరు 'శేషాచలం' అనీ, తల్లి 'పేరూరమ్మ' అని వీళ్లకు ఏడుమంది మగసంతానమని, వీళ్లలో చిన్నవాడు వేంకటేశ్వరుడని జానపదులు తమగేయాల్లో పాడుకుంటుంటారు.

'మచ్చలబందారి' అనే దేశాన్ని శేషాచలం ఏలు తున్నాడు. అతని భార్య పేరు 'పేరూరమ్మ' అని జానపదులు పాడుకున్నారు.

వేంకటేశ్వరస్వామికి చుట్టు పక్కలుండే ఇతర దేవుళ్లను జానపదులు అతనికి తోడబుట్టిన వాళ్లుగా చేశారు. అలాగే వీరి తల్లిదండ్రుల విషయం కూడా ఆసక్తికరంగా ఉంటుంది. తిరుపతికి ఐదు కిలోమీటర్ల దూరంలోని పేరూరు అనేగ్రామంలో చిన్నకొండ ఉంది. ఆ కొండకు 'పేరూరు బండ' అని పేరు. ఈ బండమీద శిథిల దేవాలయం ఉంది. ఈ దేవాలయంలో మూలవిరాట్టు లేదు. ఈ దేవాలయాన్ని స్థానికులు 'పేరూరమ్మ గుడి' అని అంటారు. గానీ, పేరూరు గ్రామదేవతే ఈ పేరూరమ్మ. ఈమెను శ్రీవేంకటేశ్వరుని తల్లిగానే వ్యవహరిస్తుంటారు. ఇక తండ్రి 'శేషాచలం' అని ప్రస్తావించడం వల్ల 'శేషాచలం' ఏడుకొండల్లో ఒకటిగా భావించాల్సి వస్తోంది.

పేరూరమ్మ, శేషాచలపతి దంపతులకు పుట్టిన ఏడుగురిలో పెద్ద ఓబులన్న, చిన్న ఓబులన్న, మద్దిలేటన్న, పెంచల నరసింహ, కదిరి నరసింహ, గోవిందరాజులకు తగిన చోటు దొరుకుతుంది. అందరి కన్నా చిన్నవాడైన వేంకటేశ్వరుడు తాను నివసించడానికి తగిన స్థలం వెదుక్కోవడానికి తన తల్లి పేరూరమ్మ దగ్గర శెలవు తీసుకుని బయలుదేరుతాడు. ఎంత వెతికినా ఆయనకు తగిన స్థలం దొరకదు. అలా వెతుక్కుంటూ తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ దగ్గర కొచ్చి తనకు తగిన స్థలం ఎక్కడుందో చెప్పమంటాడు. తనకు తగిన చోటు చూపిస్తే గంగమ్మకు సంవత్సరానికి ఒకసారి జాతర జరిపిస్తానని చెప్తాడు. అప్పుడు గంగమ్మ ఏడుకొండల మీద గట్టి చోటు చూపించిందని చెప్తారు. అప్పట్నుంచి వేంకటేశ్వర స్వామి గంగమ్మను సొంతచెల్లెలుగా భావించి ఆమెకు ఏటా జాతర జరిపిస్తున్నాడని అంటారు.

ఇలా తిరుపతిగంగమ్మ శ్రీవేంకటేశ్వరస్వామి చెల్లెలుగా అనాది నుండి భావింపబడుతోంది. నేటికీ ప్రతి సంవత్సరం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుండి గంగమ్మగుడికి, గంప, చేట, పట్టు శేషవస్త్రం, పసుపు కుంకుమలు వస్తున్నాయి.

అలాగే తిరుచానూరులో ప్రతి సంవత్సరం పద్మావతీ దేవి అమ్మవారికి పంచమీ చక్రతీర్థం జరుగుతుంది. ఆరోజు తిరుమల శ్రీవారి ఆలయంనుండి ఏనుగుపై పసుపుముద్దను తిరుచానూరుకు పంపుతారు. పసుపుముద్ద తిరుమలనుండి తిరుచానూరు చేరుకున్నాకే అమ్మవారి చక్రస్నానం జరుగు తుంది. పసుపుముద్ద తిరుచానూరు వెళ్లేటప్పుడు, మార్గ మధ్యంలో తాళ్లపాక గంగమ్మకు గుడిముందు ఆపి పూజారులు, దేవస్థానం అధికారులు తాళ్లపాక గంగమ్మకు కొబ్బరికాయ కొట్టి హారతిచ్చి తర్వాత వెళ్లడం సంప్రదాయం.

గృహలక్ష్మి

# దానం ఆవగింజ ఫలితం అనంతకోటి

- డా॥సుబ్బలక్ష్మి మర్ల

వైశాఖమాసానికి అధినాయకుడు శ్రీమన్నారాయణ మూర్తి. కనుక ఆయనప్రీతికోసం ఈ మాసంలో ప్రాతః కాలంలో నదికిగాని, తటాకానికి గాని, నూతివద్దకు గాని, వెళ్లి "ఓ! మాధవా! మధుసూదనా! పురాణపురుషా! వైశాఖమాస వ్రతాన్ని ప్రారంభించడానికి ముందు నిన్ను స్మరించి స్నానం చేస్తున్నాను కనుక వ్రతం పూర్తి అయ్యేవరకు ఎలాంటి ఆటంకాలు కలుగనీయక, వ్రతభంగం కాకుండా కాపాడు తండ్రీ!" అని శ్రీహరిని ధ్యానించి నీళ్లు వదలాలి. తరువాత నీటిలో దిగి "ఓ! గంగానదీ! సమస్త పుణ్యనదులారా! మీరు పుణ్యమూర్తులు. నేను వైశాఖమాసవ్రతం ప్రారంభిస్తున్నాను కనుక నాకెలాంటి విఘ్నాలు కలుగకుండా కాపాడండి. మీకిదే అర్ఘ్యపాద్యాలిస్తున్నాను" అని గంగను ప్రార్థించి స్నానం చేయాలి.

తరువాత శ్రీహరికి నమస్కరించి "ఆదిపురుషా! జగన్నాథా! నటనసూత్రధారీ! దుష్టశిక్షకా! నా పాపాలను నశింపజేసి పుణ్యఫలమిచ్చి నీ సాయుజ్యానికి చేర్చుకో తండ్రీ! నీకివే నమస్కారాలు" అని మూడుసార్లు దోసిళ్లతో నీరు వదిలి మరల స్నానం చేయాలి. తర్వాత పట్టువస్త్రాలు గాని, ఉతికిన వస్త్రాలుగాని ధరించి సంధ్యావందనాదికాలు ముగించి తులసీ దళాలతో విష్ణువుని పూజించి పూలు, పండ్లు నైవేద్యం సమర్పించి పురాణశ్రవణం చేయాలి. ఆవిధంగా చేస్తే అనేకవందల సంవత్సరాల నుంచి చేసిన పాపాలన్నీ పటాపంచలై మోక్షం ప్రాప్తిస్తుంది.

వైశాఖశుద్ధద్వాదశి తిథి సర్వపాపపరిహారమైంది. ఆరోజు సూర్యోదయకాలంలో స్నానమాచరించి ద్వాదశీవ్రతం చేసినవారికి గ్రహణకాలంలో గంగానదీతీరంలో వెయ్యిగోవులు దానం చేసినఫలం కలుగుతుంది. యోగ్యుడైన బ్రాహ్మణునకు అన్నదానం చేస్తే ఒక్కొక్క మెతుకుకు కోటి విప్రులకు అన్నమిడిన పుణ్యం కలుగుతుంది. ద్వాదశినాడు నువ్వులు తేనెతో ఉన్న పాత్రను దానమిస్తే జన్మాంతంలో వైకుంఠప్రాప్తి కలుగుతుంది. వైశాఖశుద్ధద్వాదశినాడు స్నానపూజాదికాలు చేసి రాత్రి విష్ణు పురాణశ్రవణం, హరినామసంకీర్తనచేసి జాగరణ చేస్తే గ్రహణ కాలంలో పుణ్యనదులలో స్నానం చేసి దానధర్మాలు చేసిన ఫలం కలుగుతుంది. తులసీదళాలతో విష్ణువుని పూజిస్తే ఏడు తరాలవరకు తన వంశాన్ని తరింపజేయడమేకాక యమ లోకంలో నరకబాధలు పొందుతున్న పితృదేవతలకు కూడ విముక్తి కలిగించి విష్ణుసాయుజ్యం కలిగేలా చేయగలుగుతాడు. ఆ రోజున పితృదేవతలను తలచుకుని విష్ణుమూర్తిని ధ్యానించి, యమధర్మరాజుని స్మరించి నీటితో ఉన్న పాత్రను, పెరుగు కలిపిన అన్నాన్ని దానం చేస్తే ప్రయాగతీర్థంలో పంచభక్ష్య పరమాన్నాలతో అన్నదానం చేసినంత ఫలం కలుగుతుంది. ఆరోజు సాలగ్రామదానం చేసినవారు నారాయణుని అనుగ్రహానికి పాత్రులై సర్వపాపవిముక్తులౌతారు. శ్రీమన్నారాయణునకు ఆరోజు పంచామృతస్నానం చేస్తే తన వంశస్థులందరినీ పాపకూపం నుండి తరింపజేసినవారౌతారు. పాలతో అభిషేకిస్తే గంగానదీతీరంలో అశ్వమేధయాగం, రాజసూయయాగం చేసినంత పుణ్యం కలుగుతుంది. ఒక సద్బ్రాహ్మణునకు మామిడి పండ్లు, పానకం, చెఱకుగడ దానంచేసి దక్షిణ ఇస్తే సమస్త పాపకర్మలనుండి విముక్తుడై విష్ణుసాయుజ్యం పొందుతారు. బ్రాహ్మణునకు మంచిగంధం, సుగంధద్రవ్యాలు రాసి విసన కఱ్ఱతో విసరితే పుత్రపౌత్రాభివృద్ధి కలిగి అష్టైశ్వర్యాలతో తులతూగి జన్మాంతంలో వైకుంఠప్రాప్తి కలుగుతుంది. వైశాఖ శుద్ధ ద్వాదశినాడు ఆవగింజంత పుణ్యం చేస్తే అది ఎంతో ఘనమైనదై శాశ్వత సుఖసంతోషాలను కలిగిస్తుంది.

వైశాఖమాస శుక్లపక్ష త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి తిథులు అతి ప్రధానమైన పుణ్యదినాలు. ఈ మూడు తిథులలో ఏ తిథిలోనైనా నదీస్నానం చేస్తే సంపూర్ణమాసఫలం పొంద గలుగుతారు. వైశాఖశుద్ధ త్రయోదశినాడు స్నానమాచరించిన సమస్తప్రాణులను దేవతలు తరింపజేస్తారు. పౌర్ణమిరోజున అన్ని తీర్థాలలోను దేవతలు, విష్ణువు కూడి ఉంటారు. చతుర్దశినాడు



ఎండాకాలంలో పిల్లలు ఈతకొట్టాలని అనుకుంటారు. పెద్దలు జాగ్రత్తగా చూచుకోవాలి

యాగాలలో కూడి ఉంటారు. వైశాఖమాసంలో ముప్పై రోజులలో ఏ ఒక్కరోజైన స్నానంచేసి విష్ణుమూర్తిని తులసిదళాలతో పూజించి విష్ణుపురాణం ఆలకిస్తే బ్రహ్మహత్య, గోహత్య, శిశుహత్య, పరధనాపహరణ, మాంసభక్షణ, సురాపానం మొదలైన దోషాలన్నీ పటాపంచలైపోతాయి.

పూర్వం దేవదానవులు పాలసముద్రాన్ని మథించి అమృతం వెలికితీసింది వైశాఖ శుద్ధ ఏకాదశినాడు. శ్రీహరి దాన్ని భద్రపరచి దేవతలచేత త్రాగించింది త్రయోదశినాడు, చతుర్దశినాడు దానవులను సంహరించాడు. రాక్షస వినాశనానంతరం దేవతలు తిరిగి స్వర్గలోకాధిపత్యాన్ని పొందింది పౌర్ణమినాడు. కనుక ఈ మూడుతిథులు దేవప్రీతికరాలై గొప్ప ఫలాన్ని చేకూర్చుతాయి. వైశాఖశుద్ధ పౌర్ణమినాడు ఒక సద్బ్రాహ్మణునకు పప్పు పరమాన్నాలతో భోజనంపెడితే స్త్రీకి కీర్తివంతుడైన పుత్రుడు కలుగుతాడు.

త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి దినాలలో భగవద్గీత పారాయణ చేస్తే వెయ్యి అశ్వమేధయాగాలు చేసిన ఫలం కలుగుతుంది. విష్ణుసహస్రనామపారాయణ చేస్తే కలిగే ఫలం ఇంత అని వర్ణించడం బ్రహ్మకైనా తరంకాదు.

వైశాఖమాస శుక్లపౌర్ణమినాడు స్నానంచేసి బ్రాహ్మణునకు దానపుణ్యాలు చేసి శ్రీహరిని ఆవుపాలతో అభిషేకించాలి. ఇక వైశాఖబహుళ ద్వాదశినాడు పెరుగుతో కలిపిన అన్నం, నీటితో నిండిన రాగిచెంబు, పండ్లు, దక్షిణ, తాంబూలాలు విప్రునకు దానం చేయాలి. ఆ విధంగా చేసినవారు చనిపోయేటప్పుడు యమధర్మరాజు తన కింకరులను పంపక వారిని వైకుంఠానికి పంపుతాడు.

వైశాఖమాసవ్రతం ఆచరించేవారు చైత్రబహుళ అమావాస్యనాడు పానకంతో నింపిన కలశాన్ని, మల్లెపూలను, సుగంధద్రవ్యాలను బ్రాహ్మణునకు దానం ఇవ్వాలి. వైశాఖమాసంలో ఆదిత్యుడు మేషరాశిలో ఉన్నప్పుడు ప్రాతఃకాలంలో స్నానసంధ్యావందనాదికాలు నిత్యకర్మలు చేసి సూర్యునకు నమస్కరించి విష్ణ్వాలయానికి వెళ్లి శ్రీహరిని తులసిదళాలతోను, పుష్పాలతోను పూజించి తరువాత విప్రుడు చెప్పినరీతిగా ధర్మాలుచేసి బ్రాహ్మణునికి కర్పూరం కలిపిన మంచిగంధం రాసి గొడుగు, చెప్పులు, విసనకఱ్ఱ, పరుపు, తలగడ, పండ్లు, మజ్జిగతో గాని, పానకంతోగాని నింపిన కలశం మొదలైనవి దానమివ్వాలి. శక్తికొలది దక్షిణతో 5 తమలపాకులు, ఒక పోకచెక్క, లవంగపట్ట, పుష్పములతో దానమిచ్చిన సంతానం లేనివారికి సుపుత్రప్రాప్తి కలుగుతుంది. సంపదగలవారు వైశాఖమాసంలో చలివేంద్రాలు కట్టి బాటసారులకు మంచినీరివ్వాలి. దిగుడుబావులు, చెఱువులు, నూతులు త్రవ్వించినవారికి ఇహలోకంలో సకలైశ్వర్యాలు పుత్రపౌత్రాభివృద్ధి కలిగి విష్ణులోకం ప్రాప్తిస్తుంది. దాహంతో పీడింపబడ్డవారికి శీతలజలం ఇస్తే రాజసూయ యాగం చేసిన ఫలం కలుగుతుంది. వైశాఖవ్రతం చేయించి పురాణాన్ని చదివి వినిపించిన బ్రాహ్మణునకు విష్ణువిగ్రహాన్ని, నూతనవస్త్రాలను దానమివ్వాలి.

ఈనెలరోజులు సూర్యుణ్ణిపూజిస్తూ ఒక ఆదివారంనాడు విష్ణుచక్రం గల సాలగ్రామాన్ని, బంగారపు తునకను ఒక సద్బ్రాహ్మణునకు దానమిస్తే సకల అరిష్టాలు, ఆపదలు, దీర్ఘరోగాలు, నశించి సిరిసంపదలతో తులతూగుతారు. సోమవారంనాడు మంచిముత్యం, నల్లని గోవుగాని, తెల్లటి ఆవుదూడను గాని తెచ్చి దాని మెడకు తెల్లని కొత్తవస్త్రాన్ని చుట్టి దానంచేస్తే ఇహపరలోకాలలో సకలసుఖాలు అనుభవిస్తారు. మంగళవారంనాడు తెల్లటి కొత్త వస్త్రంపై పగడాన్ని, నువ్వులు, పెసలు, కందులు, మినుములు, గోధుమలు మొదలైనవాటిని ఉంచి చిన్న బంగారపు ముక్కను పెట్టి దానమివ్వాలి. బుధవారంనాడు కొత్తబట్టలో 'పచ్చ' అనే రత్నాన్నుంచి రకరకాల సువాసనపుష్పాలతో దానంచేస్తే శత్రుబాధలు తొలగి జయం కలుగుతుంది. గురువారంనాడు 'పుష్యరాగం' కొత్తవస్త్రంలో ఉంచి గంధం, కస్తూరి, పచ్చకర్పూరం, అరటిపండ్లు, వెలగపండ్లు, కొబ్బరికాయ ఉంచి దక్షిణయుక్తంగా దానంచేస్తే సకలపాపాలుపోతాయి. శుక్రవారంనాడు స్వయంపాకంతోను, పెరుగు, పంచదార కలిపిన నీళ్లు, తాటియాకుల గొడుగు, విసనకఱ్ఱ దానంచేస్తే కుబేరునంతటి ధనవంతులౌతారు. శనివారంనాడు గోవునుగాని గుఱ్ఱం, గొఱ్ఱె, సువర్ణం, వస్త్రం, శాలువ, కంబళి వీటిలో ఏ ఒక్కటైనా దాంతోకలిపి దక్షిణ దానంచేస్తే అపమృత్యువు, మనోవ్యాధులు, నవగ్రహదోషాలు తొలగి వైకుంఠం ప్రాప్తిస్తుంది.

ఈ మాసమంతా నూనెతో తలంటుకొనుట, అనపకాయ, నువ్వుపిండి, వెల్లుల్లిపాయలు, చద్దన్నం, బచ్చలికూర,

ములగకాడలు, వంకాయ, చిత్రకూర, ఉలవలు, చిరుసెనగలు, యవధాన్యపుకూరలు, కుసుమపువ్వులు, ముల్లంగి దుంపలు, మేడిపండ్లు మొదలైనవి విసర్జించాలి.

ఈ వైశాఖమాసవ్రతఫలాన్ని గురించి పురాణాలలో ఒక గాథ ఉంది. పూర్వకాలంలో సూర్యవంశంలో హేమాంబరుడు అనే రాజు రాజ్యపాలన చేసేవాడు. అతడు గోదాన, భూదాన సువర్ణదానాది పద్నాలుగు రకాల దానాలు చేస్తూ అపరకర్ణునిగా పేరుగాంచాడు.

అయితే అత్యంత ప్రశస్తమైన జలదానాన్ని మాత్రం విస్మరించాడు. కులగురువైన వశిష్ఠుడు ఉద్బోధించిన లెక్క చేయక కొంతకాలానికి గర్విష్ఠియై సద్బ్రాహ్మణులను లెక్కచేయక సజ్జనులను విడిచి దుష్టులకే పెద్దపీట వేసి గతి తప్పడంవల్ల తరువాత వరుసగా మూడు జన్మలలో గ్రద్దగాను, మూడు జన్మ లలో కాకిగాను, ఐదు జన్మలలో కుక్కగాను జన్మించి అటు పిమ్మట మిథిలానగర రాజైన శ్రుతకీర్తి ఇంట బల్లియై జన్మించి గోడమీద ఈగలను, పురుగులను తింటూ కాలం గడుపు తున్నాడు.

ఒకసారి శృతకీర్తి ఇంటికి విద్యాధరుడు అనే ఋషి పుంగవుడు మార్గాయాసం తీర్చుకోవడానికి రాగా రాజు అతనికి పాదప్రక్షాళన చేసి ఆ జలాన్ని తన శిరస్సున చల్లుకుని తన పరివారం పైన కూడ చల్లుతుంటే అందులో రెండు చుక్కలు వచ్చి గోడమీద ఉన్న బల్లిపైన పడ్డాయి. ఆ జలమహిమవల్ల ఆ బల్లికి పూర్వజన్మజ్ఞానం కలిగి ఆ మునిపుంగవుని పాదాల చెంత వాలి 'మహాత్మా! నన్ను రక్షించండి' అని ప్రార్థించింది.

విద్యాధరుడు మనిషిలా మాట్లాడుతున్న ఆ బల్లిని చూచి ఆశ్చర్యపడి నీవెవరివని ప్రశ్నించగా అది తన పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలిపి తనకి ఈ విధమైన జన్మలు కలుగడానికి కారణం ఏమిటి? తరుణోపాయం సెలవీయమని వేడుకుంది. ఋషి తన దివ్యదృష్టితో విషయాన్ని తెలుసుకుని హేమాంబరా! నీవు రాజుగా ఉన్నప్పుడు అనేక దానాలు చేసినా విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన వైశాఖమాసాన విప్రునికి జలదానం చేయలేదు. అదీకాకుండా వేదవిదులైన విప్రులను విడిచి మంత్రంరాని వేదహీనులైనవారికే దానాలు చేశావు అందుకే



నీకీ దుస్థితి కలిగింది. నేను చేసిన వైశాఖమాసవ్రతఫలాన్ని నీకు ధారపోస్తాను. దానివల్ల నీకీబల్లిరూపునుండి విముక్తి కలిగిస్తాను. నీవు తిరుమల క్షేత్రానికి వెళ్లి సకల పాపవినాశిని అయిన స్వామిపుష్కరిణిలో స్నానం చేయి అని తాను వైశాఖ మాసంలో కొన్ని రోజులుగా ఆచరించిన వ్రతఫలాన్ని ధార పోస్తూ నీటిని బల్లిపై విడువగానే అది రత్నకిరీటకేయూరాలతో మహారాజురూపుదాల్చి విద్యాధరునికి నమస్కరించి నిలిచి కృతజ్ఞతలు తెలియజేశాడు. అతడు పదివేల సంవత్సరాలు అన్ని భోగాలు అనుభవించి తిరిగి ఇక్ష్వాకువంశంలో కాకుస్థుడుగా జన్మించాడు.

ఈ వైశాఖమాసవ్రతాన్ని గంగాతీరంలోను, కాశీక్షేత్రం లోను ప్రయాగలోను, నేపాల్‌దేశంలోనూ, గండకీనదీతీరంలోని పశుపతి క్షేత్రంలోను, కాశ్మీరదేశంలోని అమరనాథక్షేత్రంలోను, వంగదేశంలోని తారకేశ్వరలింగంవద్ద, దక్షిణభారతంలో గౌతమీ తటానగల కోటిపల్లిక్షేత్రంలో, ద్రాక్షారామక్షేత్రంలో, సప్త గోదావరీతీరంలోని మాణిక్యాంబ భీమలింగేశ్వరుల సన్నిధిలో, అఖండగౌతమీతీరంలోని కోటిలింగేశ్వరక్షేత్రంలో, సువర్ణముఖీ నదీతీరంలోని జ్ఞానప్రసూనాంబ శ్రీకాళహస్తీశ్వరసన్నిధిలో, శ్రీరంగంలో, జంబూవనంలోని జంబుకేశ్వర, రామతీర్థం, సూర్యచంద్ర అగస్త్యలింగాల దగ్గర ఆచరిస్తే అనంత ఫలం లభిస్తుంది.



ఎండాకాలంలో నిశ్శబ్దంగా ముంచుకొచ్చే ముప్పు వడదెబ్బ

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

ఇక్కడి నీరు స్ఫటికంవలే స్వచ్ఛంగా ఉంటుంది. ఈ సరస్సుకు తిరుమలసాగరమని పేరు. అక్కడ అన్నసత్రం (రామానుజ కూటం) నిర్మించారు. ఈ ప్రదేశాన్ని 'తిరుమల సాగరఛత్ర' అని పిలుస్తారు. ఈ సరస్సునే 'మోతీ తాలాబ్' అని కూడా అంటారు.

అప్పటి మైసూర్ పాలకుడు టిప్పుసుల్తాన్ (తొండ నూరు శ్రీరంగపట్టణానికి చాలా దగ్గరలో ఉంది) ఒకసారి నదీవిహారం చేస్తున్నప్పుడు, అకస్మాత్తుగా అతని ముత్యాలహారం జారి సరస్సులో పడిపోయిందట. అతని పడవ సరస్సు మధ్యలో ఉన్నప్పటికీ, నదీతలంలో దిగువన పడి ఉన్న ముత్యాలహారాన్ని టిప్పుసుల్తాన్ స్పష్టంగా చూడగలిగాడు. అందుకే దానికి మోతీ తాలాబ్ అని పేరు పెట్టాడు. రామానుజులు దాదాపు 912 సంవత్సరాల క్రితం తిరుమలసాగరమనే కైంకర్యాన్ని నిర్వహించారు. ఈ నది ఇప్పుడు ఈ ప్రాంతానికి, పరిసరప్రాంతాలకు ప్రధాన నీటివనరు.

రామానుజాచార్య విష్ణువర్ధనమహారాజుకు మార్గనిర్దేశం చేస్తూ మరికొంతకాలం తొండనూరులో ఉన్నారు. శ్రీరంగ పట్టణం సమీపంలోని కావేరీనది ఒడ్డున అష్టగ్రామాలను స్థాపించాడని కూడా చెబుతారు.

రామానుజులు నాగమంగళాన్ని సందర్శించి, సౌమ్య కేశవస్వామి ఆలయాన్ని పునరుద్ధరించమని ముదలిఆండన్ స్వామిని కోరిన గుర్తుగా నాగమంగళదేవాలయంలో ఆయన విగ్రహాన్ని అక్కడ ప్రత్యేక సన్నిధిలో ప్రతిష్ఠించారు. భగవద్రామానుజాచార్యులు బిండిగనవిలే సందర్శించి మూడురోజులు అక్కడే ఉన్నారు. తొండనూరులో కాలక్షేపం చేస్తూ విష్ణువర్ధన రాజుకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమయంలోనే విష్ణు వర్ధనమహారాజు సహకారంతో, ముదలిఆండన్ పర్యవేక్షణలో పంచనారాయణక్షేత్రాలను స్థాపించారు. పంచనారాయణ మూర్తులను అమరశిల్పి జక్కనాచార్య, అతని శిష్యబృందం చెక్కారు.

**పంచనారాయణ క్షేత్రాలు:** తొండనూరులోని శ్రీనంబినారాయణ, గుండుల్‌పేటలో శ్రీవినయనారాయణ, తలకాడ్‌లో శ్రీకీర్తినారాయణ, బేలూరులో శ్రీవిజయనారాయణ, గడగ్‌లో శ్రీవీరనారాయణ భగవానుల క్షేత్రాలు.

తార్కికంగాచూస్తే భగవద్రామానుజులు స్థాపించిన దేవాలయాలు విశాలంగా విస్తరించిన హొయసలసామ్రాజ్యానికి సరిహద్దులుగా భావించవచ్చు.

## రామానుజులు వదిలి యదుగిరికి ప్రయాణించుట

రామానుజాచార్యులు కాలం గడిచిన కొద్దీ తమ వద్ద నిలువ ఉంచిన తిరుమాన్ (నుదుట నామం ధరించినప్పుడు వాడే ప్రత్యేకమైన తెల్లని మట్టిసుద్ద) అయిపోవస్తోందని గ్రహించి ఆందోళన చెందారు. భగవద్ధ్యానం చేసుకుని నిద్రించగానే ఆ రాత్రి ఆచార్యులకు ఒక కల వచ్చింది; తిరునారాయణ స్వామి కలలో కనిపించి, యాదవాద్రి (నేటి మేల్కోటే) అనే ప్రదేశం ఉందని, అక్కడి పుట్టలో తన అర్చారూపం నిక్షిప్తమై ఉందని, పుట్టకు క్షీరాభిషేకం చేయమని, అర్చావిగ్రహాన్ని బయటకు తీసి, నూతనఆలయాన్ని నిర్మించి ప్రతిష్ఠించమని ఆచార్యులను ఆదేశించాడు. యాదవాద్రిలో స్వచ్ఛమైన తిరుమాన్ (తెల్లని మట్టి) పుష్కలంగా అందుబాటులో ఉందని కూడా పెరుమాళ్ స్వప్నంలో తెలియజేశాడు.

*(ఇంకా ఉంది)*

# నారాయణుడు వరుడైన క్షేత్రం

– శ్రీ కొచ్చర్ల మాల్యాద్రి

శ్రీపద్మావతీ శ్రీనివాసులకల్యాణం అంగరంగవైభవంగా జరిగిన ఆ ప్రాంతం... ఓ దేవాలయమైంది.

ఆ జంట వివాహవేడుకకు సంబంధించిన వస్తువులే అందులోని ప్రధాన ఆకర్షణ.

పద్మావతిని పరిణయమాడటానికి నారాయణుడు వరుడిగా వచ్చిన ఆ పవిత్రక్షేత్రమే తిరుపతికి సమీపంలోని **నారాయణ వరం.**

**ఈ నెల 10 నుండి 19వ తేదీ వరకు నారాయణవనంలో బ్రహ్మోత్సవాలు**

కుడిచేతికి కల్యాణ కంకణం, నడుముకు దశావతార వడ్డాణంతో అలరారే శ్రీవేంకటేశ్వరుణ్ణి చూస్తే కల్యాణశోభ ఉట్టిపడుతుంది. కలియుగ ప్రత్యక్షమైన వేంకటేశ్వరుడు 'కల్యాణ వేంకటేశ్వరుడు'గా వెలసిన ఆ క్షేత్రమే 'నారాయణవనం'. పద్మావతీ శ్రీనివాసుల పరిణయం.

వైశాఖమాస శుక్లపక్షదశమినాడు(శుక్రవారం) వారి పెళ్లి నారాయణవనంలో జరిగింది. ఐదురోజుల పాటు జరిగిన వివాహ వేడుకల్లో చివరి రోజున కల్యాణం నిర్వహించారు. శ్రీనివాసుడు తన కల్యాణానికి కుబేరుడి దగ్గర అప్పు చేశాడని పురాణవాక్కు. ఈ ఋణం ఇప్పటికీ వడ్డీతో సహా చెల్లిస్తున్నాడని నమ్మిక.

## వివాహవేదికే ఆలయం

నారాయణుడు ఈ ప్రాంతంలో వరుడిగా అడుగుపెట్టాడు కాబట్టి దీనికి నారాయణవరం అనే పేరు వచ్చింది. వివాహం జరిగిన ప్రాంతంలో అప్పట్లో ఆకాశరాజు చిన్నగుడిని నిర్మించాడనీ, ఆ తరువాత యాదవరాజులు, కార్వేటినగర సంస్థానాధీశులు, శ్రీకృష్ణదేవరాయల వంశస్థులు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారనీ చెబుతారు. ఆలయ ఆవరణలో పద్మావతి అమ్మవారి సన్నిధి, గోదాదేవి సన్నిధి, రామాలయం ఉన్నాయి. ఆలయ ముఖద్వారంలో ఎత్తయిన గోపురం ఉంది. దీన్ని శ్రీకృష్ణదేవరాయల వంశస్థులు నిర్మించారు. తిరుత్తణి దేవస్థానం ఆధీనంలో ఉన్న ఈ ఆలయం 1967సం॥లో తిరుమల తిరుపతి దేవస్థానం కిందికి వచ్చింది.





### భిన్నమైన వెంకన్న

తిరుమల తిరుపతి అనుబంధ ఆలయాల్లో ఉన్న వేంకటేశ్వరస్వామికన్నా ఇక్కడి స్వామి భిన్నంగా కనిపిస్తాడు. సాధారణంగా వేంకటేశ్వరస్వామికి వక్షఃస్థలంలో ఓ వైపు లక్ష్మీదేవి, మరోవైపు పద్మావతీ అమ్మవారు కనిపిస్తారు. కానీ, ఈ ఆలయంలో స్వామివక్షఃస్థలంలో లక్ష్మీదేవి మాత్రమే కనిపిస్తుంది. ఆలయప్రాంగణంలో పద్మావతి అమ్మవారు వేంచేసి ఉన్నందున స్వామివారి వక్షఃస్థలంలో ఆమె కనిపించదు. శ్రీనివాసుడు వేటకోసం వచ్చినప్పుడు తెచ్చినట్లుగా చెప్పే వేటఖడ్గాన్ని ఈ ఆలయంలో చూడవచ్చు.

ఆలయ ఆవరణలో ఓ తిరగలి ఉంది. కల్యాణం సందర్భంగా అమ్మవారికి నలుగు పెట్టడానికి పిండికోసం దీన్ని ఉపయోగించినట్లు చెబుతారు. ఇక్కడ ఉన్న పారిజాతవృక్షం అలనాడు సత్యభామ కోసం శ్రీకృష్ణుడు తీసుకొచ్చి నాటిందని ప్రతీతి. సాధారణంగా వైష్ణవాలయాల్లో వైకుంఠఏకాదశి రోజున ఉత్తరద్వార దర్శనం జరుగుతుంది. కానీ, ఇక్కడ ద్వాదశి రోజున జరుగుతుంది. పెళ్లికానివారు పద్మావతి అమ్మవారి గుడి చుట్టూ 108 ప్రదక్షిణలు చేస్తే వెంటనే పెళ్లి జరుగుతుందని భక్తుల విశ్వాసం.

స్వామి, అమ్మవార్ల కల్యాణానికి గుర్తుగా ఏటా ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. వైశాఖమాసంలో వారి పరిణయం జరిగినందున ఏటా ఆ నెలలోనే (సౌరమానం ప్రకారం) ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారు పుట్టిన శ్రవణానక్షత్రానికి పదిరోజుల ముందుగా వీటిని ప్రారంభిస్తారు. ఎనిమిదో రోజున పద్మావతీశ్రీనివాసుల కల్యాణం నిర్వహిస్తారు.

నారాయణవరం తిరుపతికి 40కి.మీ. దూరంలో ఉంది. తిరుపతి-చెన్నై బస్సుల్లో నారాయణవరం వెళ్లొచ్చు. రైలు ద్వారా రేణిగుంట చేరుకుని, అక్కడినుంచి పుత్తూరు వెళ్లి ఐదు కి.మీ. దూరంలో ఉన్న నారాయణవరం చేరుకోవచ్చు.

# అన్నమయ్య - కూర్మావతారం

- ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు



స్వామివారి దశావతారాల్లో కూర్మావతారం రెండవది.

దేవదానవులు అమృతంకోసం మందరపర్వతం కవ్వంగా, సర్పరాజైన వాసుకిని తాడుగా చేసుకుని సముద్రమథనం ప్రారంభించారు. కొంతసేపటికి పర్వతం సముద్రంలోకి క్రుంగడం ప్రారంభమైంది. సముద్రమథనం కష్టసాధ్యమౌతోంది. అప్పుడు దేవతలు శ్రీమహావిష్ణువును ప్రార్థించారు. విష్ణువు కూర్మావతారం ధరించి సముద్రంలో మునుగుతున్న మందర పర్వతానికి అడుగున ఆధారపీఠంగా ఉండి సాగరమథనం సులభతరం చేస్తాడు. ఈ అవతారానికి కారణం సముద్రమథనం.

"మొదలగుంగిన కొండ మోచి యెత్తితి" అని అన్నమయ్య వర్ణన. అనగా కొండ మొదలు సముద్రంలో కుంగిపోతుంటే నీ వీపుమీద మోచియుంచినావని శ్రీహరిని అన్నమయ్య వర్ణించాడు. ఇంకా,



"పట్టి యెత్తవలెనంటే బాతాళాన బిద్దకొండ
తట్టి యెత్తి పాలవెల్లి దచ్చగా నీవు" (2-47)

పాలసముద్రంలో క్రుంగి పాతాళంలో చేరిన కొండను పైకి ఎత్తి నిలిపిన నిన్ను పట్టి ఎత్తుకోవడానికి సాధ్యమా! అని అన్నమయ్య కూర్మావతారవర్ణన చేశాడు.

"అదిగో పాతాళమందు వెదకితే నాది కూర్మమో విష్ణుడు" (9-81)

ఇలా అన్నమయ్య సంకీర్తనల్లో కూర్మావతారవర్ణనలు అనేకం కన్పిస్తాయి.



# అన్నమయ్య చెప్పిన పురాణకథలెన్నో...

- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ, 98662 34482

అన్నమయ్య సమాజంలోని అన్ని వర్ణాలను శ్రోతలుగా ఎన్నుకొన్నవాడు. పల్లెపట్టులలో రచ్చబండ దగ్గర, ఆలయాలలో పురాణపఠనం, విశేష ఉత్సవాలలో ప్రత్యేకించి నిర్దిష్ట పురాణ శ్రవణం జరగడం చూచినవాడు. కనుక విష్ణ్వాధిక్యాన్ని కథల ద్వారా చెప్పడానికి తన పదాలలో సముచితస్థాన మిచ్చాడు. అన్నమయ్య కీర్తనలలో పురాణాల ప్రసక్తి అతివేలం. మచ్చుకు–

'ఏ పురాణముల నెంత వెదకినా
శ్రీపతిదాసులు చెడరెన్నడును' (2-88)

అన్నది శ్రోతలకు భరోసా. పురాణాలవల్ల కలిగే ప్రయోజనాన్ని అన్నమయ్య–

'సకలపురాణాలు శాస్త్రాలు విని విని
వొక వేళ సుజ్ఞాన మొదవును' (11-67) అన్నాడు.

అన్నమయ్య తన సంకీర్తనలలో పదేపదే ప్రస్తావించిన పౌరాణిక కథలలో ధ్రువోపాఖ్యానమొకటి. ఇది బాలభక్తునికి సంబంధించిన కథ. ఈ కథలో చాలా సందేశాలున్నాయి.

తన తల్లి అసహాయురాలని తెలిసి కొడుకు అడవి మార్గాలు పట్టడం, నారదుడి ఉపదేశంతో వాసుదేవమంత్రాన్ని జపించి చివరకు ఎవరూ అందుకోలేని ధ్రువస్థానం వరంగా అందుకోవడం చాలా చిత్రం. పరమాత్మ దయకలిగినవానికి సర్వమూ సంసిద్ధమని ఈ కథాసందేశం.

"కొనరో కొనరో మీరు కూరిమి మందు
వునికి మనికి కెల్ల నొక్కటే మందు
ధ్రువుడు గొనిన మందు" (1-237)

భాగవతం పంచమస్కంధంలోని జడభరతుని కథ చాలా చిత్రమైంది.

పెంచిన మమకారం ఎంత తీవ్రతరమో చెప్పడానికి ఈ ఒక్క కథ చాలు. ఈ వృత్తాంతం గల అన్నమయ్య పంక్తులు.

అలరిన సంసారభ్రమ విడిచి యడవిలోన జడభరతుఁడు
తలఁపుచు నొక యిఱ్ఱి బెంచినంతనే తనకును నారూపు దగిలె
(2-22.)

భాగవతంలో కథ 'అజామీళుని కథ'. ఎంత దుర్మార్గుడైనా మరణసమయంలో నారాయణనామాన్ని జపిస్తే కలిగే ఫలితాన్ని ఈ కథ సూచిస్తుంది. నామమాహాత్మ్యకథనానికి ఇదొక ప్రసిద్ధ ఉదాహరణ.

'నార పేరిడి తండ్రి నందనుని బిలువఁగరు
ణారసము నించితివి నాడును'
నార పేర బిలిచితే నారాయణ యనెనంటా
చేరి కాచినటువంటి శ్రీపతివిగా (9-162)

భాగవతంలో సర్వజనాకర్షకమైంది 'ప్రహ్లాదచరిత్ర'. ఇది కూడా బాలభక్తుల వర్గంలో చేరదగింది.

ఆనందనిలయ ప్రహ్లాదవరదా
భానుశశినేత్రజయ ప్రహ్లాదవరదా (3-502)

భాగవతం అష్టమస్కంధంలో వామనావతారవృత్తాంతం ఉంది. ఈ అవతారాన్ని సూచించే అన్నమయ్య పంక్తులు

'మిగులా ఁబొట్టివాడు మింటికిని ఁబొడవు' (1-74)
'దేవహితార్థము సేసెంద్రివిక్రముడు' (10-145)

భాగవతం అష్టమస్కంధంలోని కథ గజేంద్రమోక్షం. ఇది చతుష్పాద జంతువుల పట్ల హరికరుణను నిరూపించే

వృత్తాంతం. అన్నమయ్య సంకీర్తనలలో గజేంద్రమోక్షణ కథాంశం గల పంక్తులు.

**'కరిరాజు గాచిన కరుణానిధివి' (1-140)**

**'చలపట్టి కరిరాజు శరణంటే విచ్చేసి**
**కలుషము ఁబెడబాపి కాచినట్టు' (2-85)**

భాగవతం అష్టమస్కంధంలోని మరో వృత్తాంతం **అమృతమథనం**. ఈ వృత్తాంతాన్ని స్పష్టం చేసిన అన్నమయ్య పంక్తులు-

**'అమృతము దచ్చునాఁడు అంబుధిలో మంధరము**
**తెమలఁ దేలించు తెప్ప తిరునాళ్ళు' (2-143)**

**'అమృతము పంచిపెట్టి యాదిలక్ష్మి గైకొనె**
**అమృతమథనమే అన్నిటికి సాక్షి'**

భాగవతం నవమస్కంధంలోని కథ **అంబరీషచరిత్ర.** ఇది ఏకాదశివ్రతమాహాత్మ్యాన్ని సూచించేది. దుర్వాసుని గర్వ భంగాన్ని ప్రకటించేది. భగవంతుడు భక్తులకు సదా అండగా ఉంటాడని నిరూపించే కథ. ఈ వృత్తాంతాన్ని తెలియజేసే అన్నమయ్య పంక్తులు-

**'అంబరీషుడు పట్టిన వ్రతాన గెల్చె**
**దిక్కులెల్లా దుర్వాసు తిరిగి బడలెను' (2-94)**

భారతానికి ఖిలపర్వంగా భావింపబడే హరివంశంలోని కథలు **హంసడిభక, ఘంటాకర్ణుల కథలు.** ఈ కథలను అన్నమయ్య విష్ణ్వాధిక్యతకు ఉదాహరణగా నిరూపించాడు. ఈ వృత్తాంతాన్ని తెలిపే అన్నమయ్య పంక్తులు- ***'మీఁటి హంస డిభకుల మీద దోలినట్టి తేరు' (4-35)***

ఉత్తరహరివంశపురాణాంతర్గతమైన ఘంటాకర్ణుని కథను సూచించే అన్నమయ్య పంక్తులు.

**వరమడుగ బోయి వడి ఘంటాకర్ణునికి**
**యిరవుగ మోక్ష మిచ్చిన యట్టు (9-25)**

అన్నమయ్య భవిష్యత్ పురాణంలోని పుండరీకుని కథను తన సంకీర్తనలలో ప్రస్తావించాడు. విజయనగర రాజుల కాలంలో కన్నడహరిదాసుల కారణంగా విఠలారాధన ఆంధ్రు లకు పరిచయమైంది. విస్తృత వైష్ణవాభిలాషియైన అన్నమయ్య ఈ కథను స్వీకరించాడు.

పుండరీకుడు బ్రాహ్మణుడు. ఇతడు కులధర్మాన్ని వదలి వేశ్యాలోలుడై విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. పుండరీ కుని నిరాదరణకు గురైన తల్లిదండ్రులు కాశీకి పయనమై కాలినడకతో వెళ్తుంటే, పుండరీకుడు తన భార్యతో కలసి గుర్రం మీద కాశీకి వెళ్తూ తల్లిదండ్రులను కూడా అధిగమించి కుక్కుట ముని ఆశ్రమానికి చేరుకుంటాడు. గంగ ఎంత దూరంలో ఉందని ఆ మహర్షిని అడిగాడు. తాను ఎప్పుడూ గంగలో స్నానం చేయలేదని, కాశీగానీ, గంగానదిగానీ తనకు తెలియ వని మహర్షి బదులిచ్చాడు. ఆ జవాబుకు పుండరీకుడు పరిహ సించాడు. ఇంతలో వికృతరూపంలో గల ముగ్గురు స్త్రీలు వచ్చి కుక్కుటముని ఆశ్రమాన్ని శుభ్రపరిచి సుందరాకారులై తిరిగి వెళుతుంటే వారి దగ్గరికి వెళ్లి పుండరీకుడు ఆశ్చర్యంతో "మీరెవ్వరు? మీ వికృతరూపం ఇలా ఎలా మారగలిగిందని" ప్రశ్నించాడు. అందుకు ఆ స్త్రీమూర్తులు "మేము గంగ, యమునా, సరస్వతులం. మాలో మునిగిన వారి పాతకాలన్నీ మా శరీరాల కంటుకొనడం వల్ల మేము కురూపులమవు తున్నాం. ఈ ముని ఆశ్రమాన్ని శుభ్రం చేసే సేవాభాగ్యం వల్ల మా మాలిన్యాన్ని పోగొట్టుకోగలుగుతున్నాం" అన్నారు. మాతా పితరుల సేవాభాగ్యం వల్ల కుక్కుటమునికింత మహత్తు కలిగిం దని తెలుసుకున్న పుండరీకుడు పశ్చాత్తాపంతో తల్లిదండ్రులను ఆ పై సేవించసాగాడు. అతని సేవకు మెచ్చి విష్ణువు ప్రత్యక్ష మయ్యాడు. అప్పుడు తల్లిదండ్రుల సేవలో ఉన్న పుండరీకుడు తన సేవ పూర్తి అయ్యేవరకు విష్ణుమూర్తిని ఇటుకపై నిలుచుండ మని తన దగ్గరున్న ఒక ఇటుకరాతిని స్వామి దగ్గరికి విసిరాడు. ఆ ఇటుక మీదనే స్వామి నిలిచాడు. సేవ పూర్తి అయిన తర్వాత పుండరీకుడు స్వామి చెంతకు వెళ్లాడు. విష్ణుమూర్తి సంప్రీతితో అతనికి వరాలిచ్చి అనుగ్రహించాడు. ఆ పుండరీకవరదుని బ్రోచిన కారణంగా ఆ స్థలం పాండురంగ క్షేత్రంగా విరాజిల్లుతోంది. నేటికీ తిరుమలకు వెళ్లే భక్తులు 'పుండరీకవరద' అని ఎలుగెత్తి కదలుతుంటారు. ఈ సన్ని వేశాన్ని తెలిపే అన్నమయ్య పంక్తులు.

**"గట్టిగ బుండరీకుఁడు కడు వేడుక బెట్టిన**
**యిట్టిక పీటపై నున్నాడీ విట్టలుఁడు"**

ఇలా అన్నమయ్య పౌరాణిక సంకీర్తనం చిత్తాకర్షకం, సర్వజనసమ్మోదాత్మకం.



# శ్రీవేంకటేశ్వరలీలలు

# దేవుడితో ఆటలా?

- శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

నలభై ఏళ్ల క్రితం జరిగిన సంఘటన ఇది. చిత్తూరు జిల్లా పుత్తూరు ఈశ్వరాపురం గ్రామం మాది. అప్పుడే పదో తరగతి ఫలితాలు వచ్చాయి. ఆ నెల చివరివారం తిరుమలకెళ్లి స్వామి దర్శనం చేసుకుని వద్దామని నేను, నా మిత్రుడు బాలాజీ అనుకున్నాం. కొండ ప్రయాణం గురించి అనుకున్నామో లేదో బాలాజీ ఊరు ఊరంతా 'టాంటాం' చేశాడు.

కొండకు వెళ్లబోయే రెండు రోజులముందే మా ఊరి శంకర రాజు బాలాజీకి పొరపాటుగా వందనోట్లు రెండు చేతికిచ్చి "ఈ వంద రూపాయలను హుండీలో వేయండి" అని చెప్పాడు. 'ఇచ్చిందేమో రెండు వందలు, చెప్పిందేమో వంద... కాబట్టి వంద దేవుడికి, వంద ఈ భక్తులకి' అనుకున్నాడు బాలాజీ. వెంటనే అందులోని వందను కొండకి వెళ్లే సంచిలో పెట్టాడు. మరో వందరూపాయలనోటుని ఇంటిలో ఉన్న ముగ్గుపిండిడబ్బా కింద గూటిలో పెట్టాడు.

ఇస్త్రీ చేసిన గుడ్డలేసి, మా ఇంటికి వచ్చాడు. నాకు జరిగిన కథ చెప్పకుండా "నా దగ్గర డబ్బు ఉంది, ఈ రోజు మనం పుత్తూరు వెళ్లి తమిళ సినిమా చూద్దాం" అన్నాడు.

ఎగిరి గంతులేశాను. గబగబా ముఖాన్ని ఒకటికి రెండుసార్లు సోపుతో రుద్ది చకచకా చెప్పులేసుకున్నాను. ఇద్దరం డబ్బు కోసమని బాలాజీ ఇంటికి వెళ్లాం. నేరుగా వెళ్లి గూటి దగ్గర నిలబడ్డాడు. ముగ్గు పిండి డబ్బాను ఎత్తి డబ్బు తీసుకోవడానికి చేయి ఎత్తాడు.

అంతే.... పెద్ద తేలు ఒకటి, ముగ్గుపిండి డబ్బా మీద ఉండటం గమనించాడు. భయంతో వణుకుతూ "తేలు" అని గట్టిగా అరిచాడు. పక్కనే ఉన్న కట్టెను అందుకున్నాను. ఇద్దరం కలిసి ఆ తేలును కొట్టేశాం. నేను చేతులు కడుక్కుంటూ "టైం అవుతోంది, పద" అన్నాను. "వద్దు, అది దేవుడి డబ్బు. అందుకే ఇలా జరిగింది" అంటూ విషయాన్ని పూసగుచ్చినట్లు చెప్పాడు.

తప్పు తెలుసుకున్న మేం నేరుగా శంకర రాజు ఇంటికి వెళ్లాం. "మీరు తిరుమల హుండీలో వేయమని చెప్పిందేమో వంద, ఇచ్చిందేమో రెండు వందలు. వంద మాత్రమే హుండీలో వేయమంటారా? లేక రెండు వందలూ వేసేయమంటారా?" అని అడిగాము. "అవునా... అలా జరిగిందా..." అని కొద్దిసేపు ఆలోచించాడు శంకరరాజు. చివరికి ఎంతో విశాలహృదయంతో "వంద హుండీలో వెయ్యండి, మిగిలిన వందని దర్శనానికి వెళ్లే మీరు ప్రయాణఖర్చులుగా వాడుకోండి" అని చెప్పాడు.

ఇద్దరం ఎగురుకుంటూ మరుసటి రోజే కొండకి వెళ్లాం. దర్శనం చేసుకుని, చేసిన తప్పుకి చెంపదెబ్బలు వేసుకుంటూ ప్రయాణఖర్చులు పోను మిగిలిన డబ్బంతా హుండీలో వేశాం. తీసుకెళ్లిన కొండలడ్డును భయభక్తులతో శంకరరాజుకు ఇచ్చాం. మా నిజాయితీకి మెచ్చుకున్న శంకర రాజు కొండలడ్డును మాక్కూడా కొంచెం పెట్టాడు.



ఈ నెల 11వ తేదీన
తరిగొండ వెంగమాంబ
జయంతి

# కాంతిదీపం

- కీ.శే. ఆచార్య
కె.జె.కృష్ణమూర్తి



మాతృశ్రీ తరిగొండవెంగమాంబ తాను జన్మించిన ప్రాంతానికి, జీవించిన కాలానికి అతీతమైన పూర్వజన్మసంస్కారం గల విశిష్టవ్యక్తిగా మనుగడ సాగించిన పరమయోగిని, భక్త కవయిత్రి. వెంగమాంబ 1730వ సంవత్సరానికి సరియైన సాధారణనామ సంవత్సరం వైశాఖశుద్ధ చతుర్దశి నృసింహ జయంతి పర్వదినంనాడు శ్రీవేంకటేశ్వరుని వరప్రసాదంగా తరిగొండగ్రామంలో అవతరించింది. కానాల కృష్ణయామాత్యుడు, మంగమాంబలు-అనే పుణ్యదంపతులు ఈమె తల్లిదండ్రులు.

వెంగమాంబ రచనలలో మొట్టమొదటిది 'తరిగొండ నృసింహశతకం'. 'తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!"-అనేది అందులోని మకుటం. 'నారసింహవిలాసకథ' (యక్షగానం), శివనాటకం (యక్షగానం), రాజయోగామృతసారం (ద్విపద కావ్యం), బాలకృష్ణనాటకం (యక్షగానం) అనే కృతుల్ని తరిగొండలో రచించింది. ఈ కవయిత్రి దైవప్రేరణతో తరిగొండను వీడి, అడవిదారులగుండా పయనించి తిరుమలక్షేత్రం చేరుకుంది. తిరుమలలో ఈమె తొలి రచన 'విష్ణుపారిజాతం' (యక్షగానం).

అక్కారాం వేంకట్రామదీక్షితులు అనే అర్చకుల పెద్ద వల్ల ఈమెకు కొన్ని కష్టాలు ఎదురయ్యాయి. అందువల్ల, వెంగమాంబ తిరుమల దేవాలయానికి దాదాపు పదిమైళ్ల దూరంలో నెలకొని ఉన్న 'తుంబురుకోన' అనే కొండగుహలో అయిదేండ్లు తీవ్రంగా తపస్సాధన కావించి, అపూర్వమైన, ఆధ్యాత్మికమైన భగవత్ సాక్షాత్కార అనుభూతిని పొందింది. ఆ కొండగుహ "తరిగొండ వెంగమాంబగవి"గా నేటికీ వ్యవహరింపబడుతోంది. ఆ తుంబురుకోనలో నివసించే చెంచువారి జీవనవిధానాన్ని ఇతివృత్తంగా స్వీకరించి ఈ కవయిత్రి "చెంచునాటకం" అనే యక్షగానాన్ని సహజ సుందరమైన శైలిలో రచించింది.

వెంగమాంబ మరల తిరుమల చేరింది. చేరిన వెనువెంటనే ఏకపాదం పై(ఒంటికాలిమీద) నిలిచి, ఆనందనిలయాన్ని వీక్షిస్తూ అత్యాశువుగా భక్తి, ప్రపత్తులతో "శ్రీవేంకటేశ్వర కృష్ణ మంజరి"- అనే స్తుతికావ్యాన్ని గానంచేసింది!

తుంబురుకోననుండి తిరుమల చేరిన అనంతరం తరిగొండ వెంగమాంబ తన మఠానికి ఎదుటగల ఎత్తైన ప్రదేశంలో పూలమొక్కలతోగూడిన తులసీవనాన్ని (బృందావనాన్ని) నెలకొల్పింది. ఆనాటినుండి ఆ ప్రశాంత పవిత్ర బృందావనంలో అక్షరాకృతి నొందిన ఆమె రచనలు ఈ క్రిందివి:

శ్రీరుక్మిణీనాటకం(యక్షగానం), గోపికానాటకం(గొల్ల కలాపం-యక్షగానం), శ్రీభాగవతం(ద్విపదకావ్యం), శ్రీవేంకటాచల మాహాత్మ్యము(పద్యప్రబంధం), అష్టాంగయోగసారం(పద్య కావ్యం), జలక్రీడావిలాసం(యక్షగానం), ముక్తికాంతావిలాసం (యక్షగానం), వాసిష్ఠరామాయణం(ద్విపదకావ్యం).

పైన పేర్కొన్న కృతులేగాక, ఈ మహాకవయిత్రి జీవిత కాలమంతటా ఆయా సన్నివేశాలలో భక్తి, వేదాంతభావ భరితాలు, సందేశాత్మకాలు అయిన అనేకశ్లోకాలను, పద్యాలను, పాటలను అత్యాశుధోరణిలో ప్రజలకు ప్రబోధించింది!

సువిస్తృతమైన, వైవిధ్యసహితమైన వాఙ్మయసేవతో పాటు, ఈ భక్తకవయిత్రి శ్రీవారి ఏకాంతసేవాసందర్భంలో 'నిత్యముత్యాలహారతి' కైంకర్యాన్ని శాశ్వతంగా నెలకొల్పింది. ఈ కైంకర్యాన్నిబట్టే "తాళ్లపాకవారి లాలి, తరిగొండవారి హారతి"- అనే అర్థవంతమైన సూక్తి అవతరించింది. ఈ సూక్తిలోని తొలి సగం అన్నమయ్యను సూచింపగా, మలిసగం వెంగమాంబను సూచిస్తూ ఉంది. ఈ రీతిగా ఈ యోగీశ్వరి ఒకవైపు సాహిత్యసేవకు, ఇంకొకవైపు శ్రీస్వామివారి కైంకర్యాలకు, మరొక ప్రక్క శిష్యులకు, శిష్యురాండ్రకు తత్త్వోపదేశాలను కొనసాగించింది.

బాల్యదశలో ఓనమాలనుసైతం గురువులవద్ద అభ్యసింపకపోయినా, యోగవిద్యాపాటవంతోనూ, పరిపూర్ణ భక్తి రసార్ద్రచిత్తంతోనూ అపూర్వసారస్వతశక్తిని సాధించి, శ్రీవేంకటాచల మాహాత్మ్యాది అమృతకావ్యాలను ఆవిష్కరించిన మహాకవయిత్రి వెంగమాంబ! తిరుమల మహాక్షేత్రంలో అన్నదానకైంకర్యాన్ని అపూర్వంగా నిర్వహించి, ప్రజానీకంచేత "మాతృశ్రీ"గా కొనియాడబడ్డ కరుణామూర్తి వెంగమాంబ!

ఈ నెల 18 నుండి 28వ తేదీ వరకు
కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు

# కదలి వచ్చెను చూడరే...

- డా॥ నొస్సం నరసింహాచార్య

తిరుపతి నుండి పుత్తూరు మీదుగా 46 కి.మీ. దూరంలోను, పచ్చికాపల్లం, రాయలచెరువు మీదుగా 35 కి.మీ. దూరంలో శ్రీకార్వేటినగర వేణుగోపాలస్వామి ఆలయం ఉంది. తిరుపతి బస్టాండు నుండి కార్వేటినగరానికి అనేకబస్సులు ఉన్నాయి.

17వ శతాబ్దంలో నిర్మితమైనట్లుగా పరిశోధకులచే భావింపబడుతున్న ఈ 'వేణుగోపాలస్వామి' ఆలయాన్ని కార్వేటి నగర సంస్థానాధీశులలో సుప్రసిద్ధుడైన కటారిసాళ్వ మాకరాజు వెంకటపెరుమాళ్లరాజు నిర్మించాడు. ఇతను స్వామివారికి ఎన్నో విలువైన మడులు, మాన్యాలు, విలువైన బంగారు, వెండి ఆభరణాలు సమర్పించడంతో పాటు స్వామివారికి ఎన్నో విశేష ఉత్సవాలను ప్రారంభించి కార్వేటినగరం నిత్యకల్యాణం పచ్చ తోరణంగా విరాజిల్లేలా చేశాడు.

పెరుమాళ్లరాజు వేణుగోపాలస్వామివారి ఆలయాన్ని 60గజాల పొడవు, 30గజాల వెడల్పుతో సువిశాలంగా నిర్మించడంతో పాటు, పురవీథులను కూడా విశాలపరిచాడు. ఆలయం చుట్టూ రక్షణగా ఎత్తైన ప్రహరిగోడను నిర్మించాడు.

ఆలయం తూర్పుదిక్కునకభిముఖంగా నిర్మించబడింది. వైష్ణవాలయస్ఫూర్తి కలిగేలా గోపురం, మహామండపం, స్నపన మండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలు సుందరంగా కనిపిస్తాయి.

ప్రధాన ద్వారానికి ఎదురుగా 5 అంతస్తుల రాజ గోపురం దర్శనమిస్తుంది. ఆలయంలో ప్రవేశించగానే ఎత్తైన ధ్వజస్తంభం, బలిపీఠం ఆ ప్రక్కనే ప్రధానాలయానికి గర్భా లయానికి ఎదురుగా నమస్కారముద్రతో నిలుచున్న గరుత్మం తుడు నెలవైన గరుడమండపం కనిపిస్తాయి. కవితాది కళలకు ప్రదర్శకరంగంగా 36 స్తంభాలతో విశాలంగా నిర్మితమైన మహా మండపం కనిపిస్తుంది. మహామండపానికి పశ్చిమంగా ఒక అడుగుఎత్తులో స్నపనమండపం నిర్మించబడింది. ఈ మండపం దాటగానే జయవిజయులు ద్వారపాలకులుగా ప్రవేశంగల ముఖమండపం నిర్మితమై ఉంది. ఈ ముఖమండపంలో ఒక ప్రక్కన చిరు అరుగుపై రామానుజాచార్య, ఆళ్వారుల విగ్రహాలు కనిపిస్తాయి. ముఖమండపం దాటగానే అర్ధమండపం, అంత రాలయ మండపాలున్నాయి.

గర్భాలయం చతురస్రాకారంలో నిర్మితమై ఉంది. మధ్యలో 3 అడుగుల ఎత్తైన పీఠంపై మూలవిరాట్టు శ్రీవేణు గోపాలస్వామి చతుర్భుజాలతో ఇరుగడల శంఖచక్రాలను ధరించి, మరో రెండు చేతులతో లీలగా వేణువును పట్టుకుని కాలుపై కాలువేసుకొని ఒయ్యారంగా నిలుచుని, కుడివైపున రుక్మిణీదేవి, ఎడమవైపున సత్యభామాదేవేరులతో వెనుక నిలబడ్డ గోవుతో స్వామివారి ప్రభలాగా ఉన్న మకరతోరణంతో దర్శన మిస్తారు.

తిరుమలగర్భాలయంలోని ఇతర మూర్తుల లాగే ఇక్కడ కూడా మూలమూర్తిముందు రుక్మిణీ సత్యభామ సమేత వేణు





గోపాలస్వామి, వెండిగోవు ఉత్సవమూర్తులుగా కనిపిస్తారు. వీరితో పాటు సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు, కుడి ప్రక్కన నవనీతకృష్ణస్వామి, ప్రక్కనే సుదర్శన చక్రత్తాళ్వార్‌ల పంచలోహ విగ్రహాలు ప్రకాశిస్తూ దర్శనమిస్తాయి. వీటితోబాటు అర్ధ మండపంలో గంభీరమైన శ్రీమహాలక్ష్మి అమ్మవారు 'కమల వల్లి'గా ఆసీనభంగిమలో దర్శనమిస్తుంది. ప్రతిరోజు నిత్య సేవల్లో భాగంగా నవనీతకృష్ణస్వామివారికే సుప్రభాతం, ఏకాంత సేవలు నిర్వహిస్తారు. ప్రధానాలయ శిఖరం ఏకతలవిమానంతో నిర్మితమై ఉంది. ఈ విమానం చుట్టు చూడముచ్చటైన వైష్ణవ శిల్పాలతో ఉంటూ పైన కలశం ప్రతిష్ఠించబడి ఉంది. ఆలయ ఆవరణలో దక్షిణంవైపు కోదండరామాలయం ఉంది.

కార్వేటినగరం శ్రీరుక్మిణీసత్యభామసమేత శ్రీవేణు గోపాలస్వామి ఆలయాన్ని 10-4-1989న అప్పటి ధర్మాధి కారులు తి.తి.దే.కు అప్పగించారు. తి.తి.దే.వారు ఈ ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చి అనేక ఉత్సవాలు నిర్వ హిస్తున్నారు. వాటిలో బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవాలు, పవిత్రోత్సవాలు ముఖ్యమైనవి.

కార్వేటినగర వేణుగోపాలస్వామివారి ఆలయంలో వైఖానస ఆగమోక్తంగా పూజాదికాలు నిర్వహిస్తారు.

### బ్రహ్మోత్సవాలు

శ్రీరుక్మిణీ సత్యభామాసమేత వేణుగోపాలస్వామి వారికి వైశాఖమాసంలో నవాహ్నిక బ్రహ్మోత్సవాలు సేనాధిపతి ఉత్సవం అంకురార్పణలతో ప్రారంభమై వైభవంగా జరుగుతాయి.

ఆనాటి స్వామివారి బంగారు గరుడవాహనం యొక్క శిరస్సు కంచి వరదరాజస్వామి గరుడవాహనం కంటె పెద్దదట. ఈ వాహనాన్ని 40 మంది మోసేవారట. ఈ భారీ గరుడ వాహనం పురవీథులలో ఊరేగించేందుకే కార్వేటినగర రాజ వీథులు వెడల్పుచేయబడ్డాయని ప్రతీతి.

పదకర్త సారంగపాణి తన పదాలలో గరుడవాహనాన్ని ఇలా వర్ణించాడు...

కదలివచ్చెను జూడరే వేణుగోపాలుడు
కనుల పండుగగాను
పదిలుడై గరుడనిపైనెక్కి భక్తుల
ముదమొందజేయుచు, ఇదిగొ రాజమార్గమున..

శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి అరకిలోమీటరు దూరంలో దీర్ఘచతురస్రాకారంగా నిర్మింపబడిన కోనేరు ఒకటున్నది. దీనినే 'స్కందపుష్కరిణి' అని పిలుస్తారు. కార్వేటినగర రాజసౌధాలు, ఆలయాలు ఒకెత్తయితే ఈ స్కందపుష్కరిణి సోయగం మరోఎత్తు. కార్వేటినగరం చేరుకొనే భక్తులు తప్పక దర్శించదగ్గది.

కార్వేటినగరవేణుగోపాలస్వామి కోరినవరాలను తీర్చే కోనేటిరాయడు. సంతానంలేనివారు స్వామివారిని భక్తిశ్రద్ధలతో సేవిస్తే సంతానవంతులవుతారట. వేణుగోపాలస్వామిక్షేత్రం నిరంతరం సస్యశ్యామలంగా పచ్చని పంటపొలాలతో పరవళ్లు తొక్కుతుంటుంది.

*(ముఖచిత్రకథనం)*

## మార్చి నెల క్విజ్-32 సమాధానాలు

| | |
|---|---|
| 01) సోమకాసురుడు | 11) శ్రేయస్సు |
| 02) మత్స్యపురాణం | 12) ప్రత్యూషుడు |
| 03) ఋతువులు | 13) హూ హూ |
| 04) పరమాత్మ | 14) తిరుక్కచ్చినంబి |
| 05) జనకుడు | 15) త్రివిక్రమనారాయణన్ |
| 06) కరాళనృసింహ | 16) నాగలాపురం |
| 07) కులశేఖరాళ్వారు | 17) ఉగాది |
| 08) భగవంతునికి | 18) హోళి |
| 09) గరుడుడు | 19) భూతత్త్వానికి |
| 10) కనకధారాస్తవం | 20) హరిపాదం |

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

**01)**వి.బి.రోషణి, కుప్పం **02)**డి.సుప్రియ, విజయవాడ **03)**సుంకరి సాత్త్విక, మెదక్ **04)**యామర్తి శ్రీనివాస సత్కృత్, బెంగళూరు **05)**లుప్తిక, అనంతపురం **06)**కె.అభికృష్ణ, హైదరాబాదు **07)**చిప్ప చిన్మయి, పోచారం **08)**జె.లక్ష్మణ్‌వీర్, కుప్పం **09)**క్రిష్టిపాటి సాకేత్, హైదరాబాదు **10)**పి.తన్మయిసాయిప్రియ, పెడన **11)**బాచిమంచి లక్ష్మీప్రణతి, మాచర్ల **12)**ఎం.వి.వందన, విజయవాడ **13)**సిద్దాని జ్యోతిర్మయి, ఆచంట వేమవరం **14)**చిప్పాడ తేజస్వి, గాజువాక **15)**నాగళ్ల శ్రీనివేద్, హైదరాబాదు **16)** కె.తేజస్విని, హైదరాబాదు **17)**తుంపూడి జైవీర్‌వరుణ్, హైదారాబాదు **18)**పెట్లూరి సహిష్ణ, హనమకొండ **19)**నగరం సుహాంత్ అమర్త్య, తిరుపతి **20)**మేడపాటి కీర్తిక, కుతుకులూరు **21)**మామిళ్లపల్లి లాలస అనన్య, ప్రొద్దుటూరు **22)**కాసారపు హర్షిత్‌కుమార్ గౌడ్, సిరిసిల్ల **23)**కన్నెపల్లి నాగార్జున, అనంతపురం **24)**సుంకేసుల శివపర్ణిది, అనంతపురం **25)**బట్టి ప్రోలు సూర్యకృష్ణవిరాజ్, బెంగళూరు **26)**సలుగుజ్ఞానహాసిని, కాశీబుగ్గ **27)**వెలిచేటి రత్నతన్మయి, రాజమహేంద్రవరం **28)**కంభం పాటి రుత్త్విక్‌సాయి, ఖమ్మం **29)**జ్యాగంటి గగన్‌మెహర, ధర్మవరం **30)**దాసరి ఆహ్లాదిత, మందమర్రి **31)**వై.సాయివాణి, బెంగళూరు **32)**పైళ్ళ జాహ్నవ్, ఖమ్మం **33)**బలివాడ హితేంద్ర, రెడ్డిపేట **34)**పులి కంటి చైత్ర, బాలసముద్రం **35)**జి.అతులిత్ రెడ్డి, హైదరాబాదు.




# అహంకారం మంచిది కాదు

– డా॥ నల్లాని రాజేశ్వరి,
99086 02443

దేవతలకు, రాక్షసులకు మహాయుద్ధం జరిగింది. "ఆ యుద్ధంలో దేవతలకు ఘనవిజయం లభించింది. వాళ్లకు విజయం కలగడానికి కారణం పరబ్రహ్మ యొక్క అనుగ్రహమే! కానీ దేవతలు తమకు విజయాన్ని అనుగ్రహించిన పరమాత్మను మరచిపోయారు. తమకు లభించిన విజయం కేవలం తమ శక్తిసామర్థ్యాల వల్లే వచ్చిందని భావించి చాలా గర్వం పొందారు. దేవతల అహంభావాన్ని సర్వేశ్వరుడు తెలుసుకుని వాళ్ల అహంకారాన్ని పోగొట్టాలని భావించాడు. రాక్షసులు మితిమీరి ప్రవర్తిస్తూ, ధర్మానికి విఘాతం కలిగిస్తున్నారు కాబట్టి వాళ్లను నిర్జించి ధర్మసంస్థాపన చేయడం కోసం దేవతలకు విజయం చేకూర్చబడింది కానీ, దేవతల శక్తిసామర్థ్యాల కారణం కాదు. కానీ అగ్ని, వాయువు, ఇంద్రుడు మొదలైన దేవతలు స్వదేహశక్తులచే విజయం లభించిందని, ఆ విజయ ఫలితంగానే తమకు పదవులు లభించాయనీ అనుకున్నారు.

దేవతల భ్రాంతిని తొలగించడానికి సర్వేశ్వరుడు అపూర్వమైన భూతరూపంతో వాళ్లకు కొంతదూరంలో ఉద్భ వించాడు. దేవతలకు అదేమిటో తెలియలేదు. సంశయచిత్తు లయ్యారు. అప్పుడు దేవతలలో ముందు అగ్నిహోత్రుణ్ణి దేవతలు చూచి "ఓ అగ్నిదేవా! ఆ కనిపిస్తున్నదే భూతమేమిటో కొత్తగా పుట్టుకువచ్చింది. అది ఎలాంటిదో తెలుసుకుని రండి" అని చెప్పారు.

అగ్నిహోత్రుడు "అలాగే" అని చెప్పి ఆ భూతం దగ్గరకు పోయాడు. ఆ భూతాన్ని సమీపించి చూస్తే, అగ్ని దేవుడికి ఏమీ తెలియదు, తోచలేదు. అప్రతిభుడై దిగాలుగా నిలిచిపోయాడు.

ఆ భూతం అగ్నిదేవునితో "నీ వెవడవు"? అని అంటే, అగ్నిదేవుడు "నేను అగ్నిహోత్రుడను, నన్ను జాతవేదుడని పిలుస్తారు" అని సమాధానం చెప్పాడు.

అప్పుడు ఆ భూతం "నీయందేమి శక్తి కలదు" అని ప్రశ్నించింది.

అగ్నిదేవుడు "నేను దేనినైనా దహించి భస్మం చేయ గలను" అన్నాడు. అప్పుడు ఆ భూతం "ఓహో! అంత గొప్ప వాడవా! బాగుంది. దీన్ని కాల్చేయి" అని ఒక చిన్న గడ్డి పరకను అగ్నిదేవుని ముందేసింది. అగ్నిదేవుడు సర్వప్రయ త్నాలూ చేశాడు. తన శక్తినంతటినీ వినియోగించాడు. ఆ గడ్డిపోచను దహించడానికి ప్రయత్నం చేసి సాధ్యపడక సిగ్గుతో దేవతల దగ్గరకు వచ్చి వాళ్లతో "ఆ భూతమెలాంటిదో తెలుసు కోవడం నావల్ల కాలేదు" అని చెప్పాడు.

తర్వాత దేవతలు వాయుదేవుణ్ణి చూచి "ఓ వాయు దేవుడా! నీవు మహాబలుడవు కదా ! నీవు వెళ్లి ఆ మహా భూతాన్ని చూచి, అది ఎలాంటిదో తెలుసుకునిరా!" అన్నారు



వాయుదేవుడు. “అదెంత పని! ఇలా వెళ్లి అలా తెలుసుకుని వచ్చేస్తాను” అని చిటికెలు వేసుకుంటూ ఆ భూతం దగ్గరకు పోయాడు. వాయుదేవుడు కూడా ఆ భూతం యొక్క తేజో విశేషాన్ని చూచి అప్రతిభుడైనాడు. ఏమీ తెలీలేదు. ఏమీ తోచ లేదు. అలాగే నిలబడిపోయాడు. ఆ భూతం వాయుదేవుణ్ణి చూచి “నీ వెవరవు” అంది. వాయుదేవుడు “నేను వాయుదేవుణ్ణి. నన్ను మహాబలుడు అని చెబుతారు” అన్నాడు.

అప్పుడా భూతం “నీ కేమి శక్తి ఉంది” అని ప్రశ్నిస్తే, వాయుదేవుడు “నేను ఈ ప్రపంచంలోని సర్వాన్నీ లాగేటటు వంటి శక్తి కలవాణ్ణి” అని సమాధానం చెప్పాడు. అప్పుడా భూతం “ఓహో! అంత గొప్పవాడవా! బాగుంది. దీన్ని కదిలించు చూద్దాం!” అని చిన్న గడ్డిపోచను వాయుదేవుని ముందుంచింది. వాయుదేవుడు అన్ని ప్రయత్నాలు చేశాడు కానీ ఫలించలేక పోయింది.

తర్వాత దేవతలు ఇంద్రునితో “ఓ దేవరాజా! నీవు వెళ్లి ఆ భూత మెలాంటిదో తెలుసుకునిరా!” అన్నారు. ఇంద్రుడు “దేవతల ప్రభువైన నాకు ఆ పని ఎంత?” అని చెప్పి ఆ భూతాన్ని సమీపించగా అతని కన్నులకు ఆ భూతాన్ని చూడగల శక్తే లేకుండాపోయింది. ఆ భూతమెలాంటిదో తెలుసుకోవాలని ఇంద్రుడు నిశ్చయించుకుని ధ్యానించాడు. అప్పుడు పరమేశ్వరుని నిత్యసాన్నిధ్యం కలిగిన పరమేశ్వరి, మహాతేజోస్వరూపిణి ఇంద్రుని ఎదుట ప్రత్యక్షమైంది. ఇంద్రుడామెకు నమస్కారం చేసి “మాతా! ఆ మహాభూత స్వరూపమెలాంటిది?” అని అడిగాడు.

ఆ తల్లి “ఓయీ ఇంద్రుడా! అది బ్రహ్మం. పరమేశ్వరుడు. అతని విజయంవల్లే మీరు మహిమల్ని పొందారు. మీరు నిమిత్తమాత్రులు.” అని చెప్పగా ఇంద్రునికి బ్రహ్మజ్ఞానం కలిగింది.

అంతర్యామియై ఉన్న సర్వేశ్వరుణ్ణి మరచిపోయి జీవులు తామే ఘనులమని, గొప్పవాళ్లమని భావించుకుని అహంకారంతో గర్వించడం మూర్ఖత్వమే అవుతుంది. భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ఏకాగ్రచిత్తం, ఇంద్రియనిగ్రహం ఉండాలి. ధర్మమైన పనులుచెయ్యాలి. ఇది దేవతలకు గుణపాఠమే కాదు అందరికీ వర్తించే నీతిపాఠం.



విశ్వదాభిరామం　　వేమన పద్యసూక్తి



# మనుష్యస్వభావం!

**పట్ట నేర్చుపాము పడగ యొరగ జేయు;**
**చెరుప జూచువాడు చెలిమి జేయు;**
**చంపదలచురాజు చనవిచ్చుచుండును;**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** ఓరగ జేయు= వంచుకొను; చెలిమి= స్నేహం; చనవు= అధికపరిచయం.

**భావం:** తాను ఆహారంగా తీసుకునే జంతువును పట్టుకోవాలనుకున్నప్పుడు పాము పడగను ఓరగా చేస్తుంది. ఎదుటివాణ్ణి నాశనం చేయాలనుకున్నవాడు ముందుగా వాడితో స్నేహం చేస్తాడు. రాజు కూడా చంపాలనుకున్నవాడికి ముందు చనవిస్తాడు.

**వివరణ:** జంతువులు తమ ఆహారాన్ని సంపాదించుకోవడానికి తమ ఉనికి తెలియకుండా మాటు వేసి పట్టుకుంటాయి. కప్పను పట్టేటపుడు పాము సూటిగా దానిపైకి రాదు. పాము పట్టుకుంటున్నదని తెలిస్తే కప్ప తప్పించుకుని పారిపోతుంది కదా. అపకారం చేయదలచుకున్నవాడు ముందుగా తనపై నమ్మకం కలిగే విధంగా స్నేహం చేస్తాడు. రాజైనా, చంపదలచుకున్నవాడిని దగ్గరకు చేర్చుకుంటాడు. నిన్ను చంపుతానంటే ఎవడు చంపించుకుంటాడు? దగ్గర చేర్చుకుని నమ్మించి అపకారం చేస్తారు మనుషులు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

చిత్ర కథ

# చెప్పుడుమాటలు చేటు తెస్తాయి

కథ– 'కళారత్న' డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ




ఆ మాట వినగానే కైకేయి భయవిహ్వల అయింది.
నా భరతుడు అడవుల పాలవుతాడా? ఆ దుర్గతి నా కొడుక్కు పడుతుందా?
ఆ... ఇప్పుడు అర్థమవుతున్నాయి నీ మాటలు.. ఆ గతి రాముడికి పట్టాలి..
ఇప్పుడేమిటి దారి?
దారి ఉంది. ఎందుకు లేదూ? బాగా గుర్తు తెచ్చుకో.. నాడు మహారాజు నీకిచ్చిన వరాలు.. అతడు ఇచ్చిందీ లేదు. నువ్వు కోరనూ లేదు. ఇప్పుడడుగు..
కోపగృహంలోకి ప్రవేశించి కార్యం సాధించు.. భరతుడి పట్టాభిషేకమూ, రాముడి వనవాసమూ కోరుకో...
మహారాజు వరాలు ఇస్తాడంటావా?
ముందు వరాలు చెల్లిస్తానన్న మాట తీసుకో... పంచభూతాల సాక్షిగా..! అప్పుడెక్కడికి పోతాడు మహారాజు...
సరే నీవు చెప్పినట్లే చేస్తాను.. మంథరా! మనం అనుకున్న పని పూర్తి కాగానే నీ గూనుకు బంగారు కవచం తొడుగుతానే...
హ హ్హా హ్హా.. తెల్లవారితే నా భరతుడు ఈ అయోధ్యానగర చక్రవర్తి.. నేను రాజమాతను....
మంథర మాట విని కైక దెబ్బతింది. చివరకు తన మాంగల్యాన్నే పోగొట్టుకుంది. అందరి ముందు దోషిలా నిలబడింది. పచ్చటి కుటుంబాల్లో చిచ్చుపెట్టే మంథరలు ఈ లోకంలో ఎందరో ఉన్నారు. వాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండి, చెప్పుడు మాటలకు చెవి ఇవ్వకుండా ఉంటే అందరూ బాగుపడతారు...
లోకాస్సమస్తా స్సుఖినో భవంతు!
2

# బాలవినోదం

## రాయగలరా!

ఇక్కడ గజిబిజిగా ఉన్న పదాలను సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి చూద్దాం..

| | | | |
|---|---|---|---|
| రామ | యాత్ర | చింత | హాసం |
| పిల్లన | చిగురు | పుత్తడి | కాలం |
| బొమ్మ | గ్రోవి | వాన | పీక |
| విహార | పాల | బాణం | దృష్టి |
| దూర | చలి | పరి | చినుకు |

జవాబు: 1)రామబాణం 2)పిల్లనగ్రోవి 3)పరిహాసం
4)విహారయాత్ర 5)చింతచిగురు 6)పుత్తడిబొమ్మ 7)వానచినుకు
8)దూరదృష్టి 9)చలికాలం 10)పాలపీక

## చుక్కలు కలపండి!




## అక్కడా.. ఇక్కడా..

క్రింద కొన్ని వాక్యాలూ, వాటి మధ్యలో ఖాళీలూ ఉన్నాయి. మొదటి గడుల్లో వచ్చే పదమే, తర్వాతి వాటిల్లోనూ నప్పుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1) నీకేమైనా ☐☐పోయిందా... పుట్టినరోజుకు వారంతా రావడమే మనకు పెద్ద బహు☐☐.

2) నిన్న సెలవు రోజు కావడంతో ☐☐లో షి☐☐కు వెళ్లొచ్చాం.

3) నా ☐☐లు ఎక్కడ దాచావో ☐☐... లేదంటే మా నాన్నకు చెప్తా!

4) ☐☐కంఠ, నాగ☐☐కి సమానంగా మార్కులు రావడంతో ఇద్దరికీ ఫస్టు ర్యాంకు ఇచ్చారు.

జవాబు: 1)మతి 2)కారు 3)చెప్పు 4)మణి

## రంగులు వేద్దాం..!!





పై చిత్రాన్ని చూసి రంగులు వేయండి

ఆయుర్వేదం

# ఎండాకాలం.. ఏమరపాటొద్దు

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ప్రచండభానుడి తీక్షణత్వం రోజురోజుకి పెరిగిపోతోంది. ఉష్ణ తాపాలు, మండుటెండలు, వడగాల్పుల తీవ్రత ప్రభావం మన దైహిక, మానసిక ఆరోగ్యంపై ఉంటుందనేది జగమెరిగిన సత్యం.

వాతావరణంలో వేడి పెరిగి పోవటం చేత శరీరంలో ద్రవాంశాలు తగ్గటం, నీరసం, నిస్సత్తువ, బడలిక, అధిక దాహం, నోరు తడారి పోవటం, నాలుక పిడుచకట్టుకుని పోవటం, శరీరమంతా మంటలు, ఎప్పుడూ ఒళ్లు వేడిగా ఉండటం, వేడి ఆవిర్లు, విపరీతంగా చెమటలు పట్టడం, మూత్రవిసర్జన తగ్గి మూత్రం మంట, మలబద్ధకం, వడదెబ్బ మొదలైన సమస్యలు కలిగే అవకాశాలు చాలా ఎక్కువ.

ఆహార, విహార పరమైన జాగ్రత్తలు తీసుకోవటం వల్ల వీటి బారిన పడకుండా ఉండి వేసవికాలమంతా హాయిగా ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపేయొచ్చు.

**ఆహారపరంగా:** మంచి నీళ్లు బాగా త్రాగుతుండాలి. తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. అధికమైన నూనెలు, ఉప్పు, కారం, మసాలాతో చేసిన వంటకాలు, వేపుళ్లు, నిల్వపచ్చళ్లు మంచివి కాదు. కాఫీ, టీలు బాగా తగ్గించి, మజ్జిగ, పెరుగు, పాలు, కొబ్బరినీరు, చెరుకురసం, నిమ్మరసం, పళ్లరసాలు బాగా తీసుకోవాలి. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పుచ్చకాయలు, కర్బూజా, తాటిముంజలు లాంటి ద్రవాంశ ఎక్కువగా ఉన్న పండ్లు విరివిగా తినాలి.

**విహారపరంగా...**

తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలి. తెల్లటి దుస్తులు మరీ మంచివి. వ్యాయామాలు ఉదయం 9 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత చెయ్యాలి. బయటకు వెళ్లినపుడు చలవచేసే కళ్లద్దాలు, తలకు టోపి, స్కార్ఫ్‌లాంటివి వాడుకోవాలి. వీలైతే గొడుగును ఉపయోగించటం మంచిది. ప్రయాణాల్లో మంచినీళ్లు దగ్గర ఉంచుకుని తరచూ తీసుకుంటుండాలి.

**ఆహారఔషధాలు**

(1) రోజూ ఒకటి, రెండుసార్లు పల్చటి తాజా మజ్జిగలో జీలకర్ర పొడి, పావు టీ స్పూన్ శొంఠి పొడి, మిరియాల పొడి, ఉప్పు రెండు మూడు చిటికెల వంతున కలిపి ఒకగ్లాసు సేవించాలి.

(2) రోజూ ఒకసారి 50 మి.లీ. పెరుగులో గ్లాసు నీరు కలిపి చిలికి అందులో పావు టీస్పూన్ జీలకర్ర పొడి, ఒకట్రెండు చిటికెల మిరియాల పొడి, సైంధవ లవణం పొడి, శొంఠి పొడికలిపి చివరగా పదికొత్తిమీర ఆకులువేసి సేవిస్తుండాలి.

(3) గ్లాసు నీటిలో ఒక టీ స్పూన్ పటికబెల్లం పొడి, రెండు లవంగాలను, మూడు మిరియాలను పొడిచేసి ఒక చిటికెడు పచ్చకర్పూరం కలిపి త్రాగుతుంటే చాలా మంచిది.

(4) ఒక మట్టిపాత్రలో గ్లాసు నీరు పోసి అందులో ఒక టీ స్పూన్ ధనియాల పొడి వేసి రాత్రంతా నానించి ఉదయం వడగట్టి ఆ నీటిలో ఒక స్పూన్ పంచదార లేదా పటిక బెల్లం, చిటికెడు పచ్చకర్పూరం కలిపి సేవించటం కూడా మంచిదే.

(5) గ్లాసు నీటిలో ఒకటిరెండు స్పూన్ల బెల్లాన్ని కరిగించి పావు టీ స్పూన్ వట్టి వ్రేళ్ల పొడి అరబద్ద నిమ్మరసం కలిపి సేవించటంవల్ల కూడా మంచి ప్రయోజనం కలుగుతుంది.

(6) గ్లాసు మరిగే పాలలో ఒక టీ స్పూన్ సుగంధ పాలవేర్ల పొడి కలిపి ఒక నిమిషం మరిగించి, దించి, చల్లార్చి వడబోసి కాస్త బెల్లం కలిపి సేవించాలి.

(7) రోజూ ఒకసారి 50 మి.లీ. కాచినపాలలో ఒక టీ స్పూన్ గులాబీ జలం కలిపి సేవించవచ్చు.

(8) రాత్రి పూట 100 మి.లీ. పాలు తోడు పెట్టి అందులో ఒక మీడియం సైజు ఉల్లిపాయ ముక్కలు వేసి కలిపి ఉదయం మొత్తం సేవిస్తుండాలి.

ఆయుర్వేదౌషధవిక్రయశాలల్లో లభ్యమయ్యే శారిబాద్యారిష్ట, ఉశీరాసవ, ద్రాక్షారిష్ట లాంటి ఔషధాల్లో ఏదో ఒక దాన్ని రెండు పూటలా ఆహారం తర్వాత పూటకు 10-20మి.లీ. చొప్పున సమానంగా నీటిని కలిపి సేవిస్తే చక్కటి ప్రయోజనం కలుగుతుంది.

# క్విజ్ 34

01) వైశాఖమాసాన్ని ఇలా కూడా అంటారు? జ)..........

02) ఇతరులు సంతోషిస్తే సంతోషించేవాడు? జ)..........

03) శుక్రాచార్యుల కుమారులు? జ)..........

04) ఈ వ్రతంలో 'మండపారాధన' విశిష్టం? జ)..........

05) అంతరిక్షవృత్తతారావళి వ్యాఖ్యాత్రి? జ)..........

06) మంగళప్రదమైన ఆనందప్రవాహమే? జ)..........

07) సముద్రాన్ని దాటేటప్పుడు హనుమకు ఎదురైన ఆటంకాలెన్ని? జ)..........

08) చంద్రుడి రాజయక్ష్మ వ్యాధిని పోగొట్టినది? జ)..........

09) తరంగముఖనందిని పెంపుడు తండ్రి? జ)..........

10) శ్రీవేంకటేశ్వరుని ఘంటావతారం? జ)..........

11) అన్నమయ్య పూజించిన గ్రామదేవత? జ)..........

12) ఎండవేడికి తినకూడని పదార్థాలు? జ)..........

13) శ్రీనివాసుడు తన పెళ్లికి ఎవరి దగ్గర అప్పు చేశాడు? జ)..........

14) క్షీరసాగరమథనంలో కవ్వం ఎవరు? జ)..........

15) తెలుగువారికి విఠలారాధన పరిచయం చేసినవారు? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్స్ప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-05-2025.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు,'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి.ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మే, 2025

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ప్రతికూలప్రభావాలుంటాయి. ఆర్థికనష్టం. పెట్టుబడులు కలసిరావు. ఇతరులతో ఘర్షణ వాతావరణాన్ని నిరోధించాలి. ఋణాల బారిన పడకుండా అధికఖర్చులను తగ్గించుకోవడం, ఆశావహంగా ఉండటం, మాటలతో ఇతరులను మెప్పించి కార్యజయం పొందుతారు.



**వృషభం–** వాక్ సౌశీల్యత పెరుగుతుంది. ఇతరులను విశేషంగా ఆకట్టుకుంటారు. స్వచ్ఛమైన నిజాయితీని ప్రదర్శించి అవరోధాలను అధిగమించి కృతకృత్యులౌతారు. కుటుంబం వృద్ధి అవుతుంది.



**మిథునం–** ధనలాభం అధికం, ఈశాన్యదేశ సందర్శనలు మరియు కుటుంబానికి దూరంగా ఉంటారు. వృత్తివ్యాపారాలలో కొన్ని ఆటంకాలు. ప్రతిఫలం ఏమీ ఆశించకుండా ఇతరులకు సహాయం చేస్తారు. ధార్మికకార్యాలకు ధనం ఖర్చు చేస్తారు.



**కర్కాటకం–** చిన్నచిన్న గాయాలు, ముఖంపై నల్ల మచ్చలు, ఉష్ణసంబంధజ్వరాలు మొదలైన స్వల్ప కాలిక రుగ్మతలుంటాయి. అధికారం విస్తరిస్తుంది.



**సింహం–** కృషికి తగిన ఫలితాన్ని పొందుతారు. జీవితాన్ని ఆస్వాదిస్తారు, ఆనందిస్తారు. పదోన్నతి లేదా ఆదాయంలో కొంత రకమైన పెరుగుదల చాలా సులభంగా వస్తుంది. ఆర్థికస్థితిలో పెరుగుదల కనబడుతుంది.



**కన్య–** భూ గృహ స్థిరాస్తులను ఏర్పాటు చేసుకోగల్గుతారు, పంటల అధిక దిగుబడుల వల్ల ఆదాయం పెరుగుతుంది. కుటుంబ వాతావరణం ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగస్తులకు ప్రోత్సాహకాల మూలంగా ఆర్థిక ఉన్నతి కలుగుతుంది.



**తుల–** అధికారం మీ పరం అవుతుంది. ఇతరులను శాసించాలనుకోవడం అజ్ఞానహేతువు. కుటుంబసౌఖ్యం ఉంటుంది. ఆర్థికవికాసం కల్గుతుంది.



**వృశ్చికం–** ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. కొంతమేరకు అస్థిమితం, అసౌకర్యంగా ఉండటం మిమ్ములను ఇబ్బంది పెడుతుంది.



**ధనుస్సు–** చుట్టూ ఉన్న సమాజం, కుటుంబ సభ్యుల శ్రేయస్సు ఆకాంక్షిస్తారు. వ్యాపార విషయాల్లో స్వయంప్రతిపత్తిని కోరుకుంటారు.



**మకరం–** సమయానికి తగినట్టు వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. సమాజంలో గౌరవం పెరుగుతుంది. అందరికీ ఆదర్శవంతులౌతారు. ధార్మిక కార్యాల్లో సహాయం అందిస్తారు.



**కుంభం–** కుటుంబంలో శుభకార్యసిద్ధి. కార్యభారం వహించి నిర్విఘ్నంగా శుభకార్యాలు జరుపుట, పై అధికారులను సందర్శించి ప్రయోజనం పొందటం, శారీరకంగా మానసికంగా స్వస్థతగా ఉంటారు.



**మీనం–** ఆర్థికస్థితి పెరుగుతుంది. శత్రువులు మీకు హాని చేయలేరు. ధైర్యంగా ముందుకు దూసుకుపోతారు. సోదరవర్గం నుంచి సహకారం అందుతుంది. వృత్తి వ్యాపారాలకు సంబంధించిన ప్రయత్నాలు సానుకూల ఫలితాలను ఇచ్చి ఇతరులకు ఆకర్షణగా నిలుస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సంగరాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.............................................................. తేది :...................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సంగరాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 112

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | 3 | | 4 | | ■ | 5 |
| | ■ | ■ | | ■ | | ■ | | ■ | ■ | |
| | ■ | ■ | 6 | | | ■ | | ■ | 7 | |
| 8 | | ■ | | ■ | ■ | 9 | | | ■ | |
| | ■ | 10 | | | ■ | | ■ | ■ | 11 | ■ |
| | ■ | ■ | | ■ | ■ | 12 | | | | |
| | ■ | 13 | | ■ | ■ | | ■ | ■ | | ■ |
| ■ | 14 | ■ | ■ | 15 | ■ | | ■ | ■ | ■ | 16 |
| 17 | | | | | | ■ | 18 | ■ | 19 | |
| ■ | | ■ | ■ | | ■ | 20 | | | ■ | |
| ■ | ■ | 21 | | ■ | ■ | ■ | | ■ | ■ | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)హిరణ్యకశిపుని వధించిన స్వామి(9); 6)హిరణ్య కశిపుని సోదరి, విప్రచిత్తుని భార్య(3); 7)అవునుకు వ్యతిరేకం(2); 8)రాముడికి జనకుడు ఏమౌతాడు(2); 9)శివుడు(3); 10)గెలుపు(3); 12)శ్రీకృష్ణుడు జన్మించిన యుగం(5); 13)నరసింహస్వామి జన్మనక్షత్రం(2); 17)అద్వైతమతస్థాపకుడు(6); 19)ఒక చెట్టు(2); 20)దేవతలకు అమృతం పంచేందుకు విష్ణువు ఎత్తిన అవతారం(3) 21)పాండవమాత(2)

**నిలువు** 1)విశిష్టాద్వైత మతస్థాపకుడు(7); 2)వైశాఖ మాసంలో ఈ స్వామి జయంతి వస్తుంది(7); 3)హిరణ్యకశిపుని కూతురు(3); 4)మనువులలో మొదటి వాడు(4); 5)ఇతణ్ణి నరసింహస్వామి రక్షించాడు(4); 9)బృహస్పతి కుమారుడు(5); 11)దేనికైనా ఇది గట్టిగా ఉండాలి(3); 14)శర్యాతి కూతురు(3); 15)పూజింపబడేవాడు(3); 16)వైశాఖ కృష్ణ ఏకాదశి(3); 18)వైశాఖ శుద్ధ ఏకాదశి(3);

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., P.G. Dip. in Ephigraphy, Dip. in Yoga on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడుగారి మనవడు, గౌరవ మంత్రివర్యులు శ్రీ నారా లోకేశ్ గారి కుమారుడు దేవాన్ష్ 11వ పుట్టినరోజు సందర్భంగా వీరు సకుటుంబంగా 21-03-2025న తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదకేంద్రం(తిరుమల)లో భక్తులకు భోజనాలు వడ్డించారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాదవితరణకు అయ్యే రూ.44లక్షల విరాళాన్ని తి.తి.దే.కి అందజేశారు.

ముఖ్యమంత్రిగారి తిరుమల పర్యటనలో వీరి వెంట తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, ఇతర పాలకమండలి సభ్యులు శ్రీమతి సుచిత్ర ఎల్లా, శ్రీ ఎం.శాంతారామ్, శ్రీ ఎన్.నర్సిరెడ్డి, శ్రీమతి పనబాక లక్ష్మి, శ్రీ జి.భానుప్రకాష్ రెడ్డి, శ్రీ ఎన్.నరేష్‌కుమార్, శ్రీ పి.రామమూర్తి, శ్రీ సౌరభ్ హెచ్.బోరా, శాసనసభ్యులు శ్రీ ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), శ్రీ పులివర్తి నాని(చంద్రగిరి), శ్రీ గురజాల జగన్మోహన్ (చిత్తూరు), శ్రీ మురళీ మోహన్ (పూతలపట్టు), తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్. ఉన్నారు.












తి.తి.దే. ప్రధాన సంపాదక కార్యాలయంలో ప్రత్యేకశ్రేణి ఉపసంపాదకుడు డా॥ కంపల్లె రవిచంద్రన్‌గారికి ఆం.ప్ర.రాష్ట్ర ప్రభుత్వ సర్వోన్నతపురస్కారం బంగారు హంస, 'కళారత్న' జీవితపర్యంతం బిరుదును ఆం.ప్ర. రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ఉగాది పండుగ (30-03-2025)రోజున తుమ్మలపల్లికళాక్షేత్రం, విజయవాడలో అందజేశారు. వీరిని తి.తి.దే. ప్రధాన సంపాదకుడు డా॥ కె.రాధారమణ, సంపాదకుడు డా॥వి.జి.చొక్కలింగం, ఇతర కార్యాలయ సిబ్బంది అభినందించారు.



అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల్ని 07-03-2025న తి.తి.దే. ఘనంగా 'మహతి'లో నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధవిభాగాల్లో విశేషసేవలు అందిస్తున్న 12మంది మహిళా ఉద్యోగులకు 'పద్మావతి మహిళా' అవార్డులిచ్చారు. ఈ కార్యక్రమంలో తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., తి.తి.దే. బోర్డు సభ్యులు శ్రీమతి ఎ.రంగశ్రీ, శ్రీమతి టి.జానకీదేవి, ఇతర తి.తి.దే. మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-04-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.



మాతా నృసింహశ్చ పితా నృసింహః
భ్రాతా నృసింహశ్చ సఖా నృసింహః
విద్యానృసింహో ద్రవిణం నృసింహః
స్వామీ నృసింహః సకలం నృసింహః